VASAVI ANANDA NILAYAM
ABODE OF HAPPY LIVING
@ LB NAGAR

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

22-1-2023 ఆదివారం సంపుటి : 28 సంచిక : 352, పేజీలు : 10+4 వెల : 8.00

VASAVI GROUP
A Legacy of Trust. Since 1994.




VASAVI
ANANDA NILAYAM
VASAVI
ANANDA NILAYAM
ABODE OF HAPPY LIVING
@ LB NAGAR
2, 3 & 4 BHK PREMIUM APARTMENTS
29.37 Acres
11 Towers
33 Floors
3576 Units
72% Open Space
1, 31, 385sqft. 2 Clubhouses
112 Sky Villas
TS RERA NO. P02400005582
CLUB VASAVI
Loaded with 100+ World Class Amenities.
Fully-Equipped Outdoor/Indoor Gym
Indoor & Outdoor Kids Play Area
Net Cricket Pitch
Jogging Track
Yoga / Aerobics & Meditation Room
Pet Park
Tennis Court & Badminton Court
Skating Rink
Swimming Pool
Sand Volleyball Court
Multipurpose Hall
Amphitheater
Unflinching Commitment to Customers
Delight earns us Recognition & Laurels
TRUSTED DEVELOPER OF THE YEAR AWARD
YERRAM VIJAY KUMAR
CHAIRMAN & MD, VASAVI GROUP
RECEIVING THE AWARD FROM
HON'BLE MINISTER OF TOURISM, CULTURE AND DEVELOPMENT OF NORTH EASTERN REGION OF INDIA
SRI G. KISHAN REDDY
Trusted Developer of The Year 2022
Best Ultra Luxury Apartment Ongoing Vasavi Skyla 2022
Exemplary Contribution to Real Estate Hyderabad 2021
Premium Affordable Project of the Year 2021
Trusted Developer of the Year 2019
A Legacy of Trust. Since 1994.
30 RESIDENTIAL PROJECTS
17 COMMERCIAL PROJECTS
8 MILLION SFT. BUILT
310 ACRES VILLA PLOTS SOLD
4510 APARTMENTS BUILT
50 MILLION SFT. ON THE ANVIL
25,000+ HAPPY RESIDENTS
Better Planning, Better Location
Better Amenities, Better Value
LOCATION HIGHLIGHTS
IN FRONT OF LB NAGAR METRO STATION
1 Min. Walk Shopping / Markets Movie theaters
1 Min. Drive Healthcare Hospitals
1 Min. Drive ATM/Banks Offices
1 Min. Drive Schools/ Coachings
DOCTORS COLONY
Pantaloons
Ankura Hospital
RAJEEVGANDHI NAGAR
CHANAKYAPURI
Priyadarshini Park
Mini Tank Bund
SAROORNAGAR
Saroornagar Indoor Stadium
Flower Market
Ranga Reddy District Court
KBR convention
VASAVI ANANDA NILAYAM
D Mart
Kamineni Hospitals
Delhi International School
Metro Station L.B. Nagar
L.B. Nagar x Road
Pedda Cheruvu
Hotel Shubham Palace - Karmanghat
VIVEKANANDA COLONY
Rainbow Childrens Hospital, LB Nagar
KHARMANGHAT
Chintalkunta Rd
Hotel Kinara Grand
Akshara International School
Pindi Pulla Reddy Gardens
Vasavi Sri Nilayam
+91 90191 00099 | www.thevasavigroup.com
Disclaimer: This advertisement does not constitute an offer and / or acceptance and / or contract and / or agreement and / or transaction and/or any intention thereof and / or a disclosure under any statute of any nature whatsoever. The pictorial/other representation herein, the layout, number of buildings / towers / wings / structures, facilities and amenities are merely creative imagination and an Architect's impression and are only indicative. Actual product may vary / differ from what is indicated herein. The photograph contained herein may be stock/standard photography used for the purpose and have been taken at a location other than the project site and are used to indicate a conceptual lifestyle. All norms, requirements pertaining to the environment, Fire Services, GHMC Rules and Regulations have been adhered to while designing the property.

# డెక్కన్ మాల్ భవనం కూల్చేస్తాం..

## ఎవరికైనా నష్టం కలిగితే పరిహారం చెల్లిస్తాం

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గాలి మాటలు మాట్లాడి వెళ్లారు: మంత్రి తలసాని



సంఘటనా స్థలం వద్ద అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 21, ప్రభాతవార్త:** సికిందరాబాద్ అగ్నిప్రమాద స్థలాన్ని సందర్శించిన సమయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గాలి మాటలు మాట్లాడి వెళ్లారని, బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం 2008లో ఆగిపోయిందని, ఈ స్కీం ద్వారా ప్రభుత్వం అవ సరమైనప్పుడల్లా సమకూర్చుకోవాలని చూస్తున్నదని ఇష్టానుసారం మాట్లాడారని, ఇది సరైన విధానం కాదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఘాటుగా స్పందించారు. ప్రజ లకు భరోసా ఇవ్వాల్సి న సమయంలో కేంద్రమంత్రి రాజకీయాలు మాట్లాడటం సరైంది కాదని తలసాని హితవు పలికారు. హైదరాబాద్‌లో సుమారు 25వేల ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్స్ ఉన్నాయని అంచనాకు వచ్చామని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్నింటినీ గుర్తిస్తామని మంత్రి తలసాని అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని కూల్చేందుకు అవసరమైన అధు నాతన టెక్నాలజీని ఉపయోగిస్తామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పక్షాన ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో భవనంలో పదివేల టన్నుల మెటీరియల్ నిల్వచేసి ఉందన్నారు. ఎన్ఐటీ ఇంజనీరింగ్ బృందం భవనం దృఢత్వంపై అధ్యయం చేసిందని, జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచి నివేదిక రావాల్సి ఉందన్నారు. జనావాసాల మధ్య ఇలాంటి గోదాములు, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ యూనిట్లపై ఉన్నతస్థాయి కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ఈ నెల 25వ తేదీన వివిధ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించ నున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వివరించారు. ఫైర్, ఎన్‌ఓసీ, జీహెచ్‌ఎంసీ అనుమతులు లేని వారిని ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సికిందరాబాద్ అగ్నిప్రమాదంలో ప్రమాదకరస్థాయిలో ఉన్న దక్కన్‌మాల్ భవనం కూల్చి వేసేందుకు ప్రయత్నిస్తున్నామని, మరో (జీహెచ్‌ఎంసీ) నివేదిక వచ్చాక కూల్చివేత పనులు చేపడతామని మంత్రి తలసాని అన్నారు. శనివారం మంత్రి తలసాని జీహెచ్‌ఎంసీ కమిషనర్ అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నల్లగుట్ట బస్తీలో మంత్రి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ అగ్నిప్రమాదంతో తమకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. భవనానికి ఆనుకుని బస్తీ ఉందని, భవనం ఒక్కసారిగా కూలితే తమ ఇళ్లు దెబ్బతింటాయని వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ భవనం కూల్చివేత సమయంలో అన్నిరకాలైన జాగ్రత్తలు తీసుకుం టామని, ఎవరికి ఇబ్బంది కలుగకుండా కూల్చివేస్తామన్నారు. కూల్చివేత సమయంలో ఎవరికైనా నష్టం జరిగితే వారికి నష్టపరిహారం చెల్లిస్తామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు.

కనిపించకుండాపోయిన వారి జాడ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మూడు రోజులుగా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారని, అగ్నిమాపక సిబ్బంది, ఇతర శాఖల అధికారుల శ్రమను అభినందిస్తున్నానని అన్నారు. ప్రమాద సమయంలో అస్వస్థతకు గురైన ఎడిఎఫ్ఒ ధనుంజయ్‌రెడ్డి డిఒపి(డ్రైవర్ ఆపరేటర్) నర్సింగరావు ఆరోగ్యం నిల కడగా ఉందన్నారు. భవనాలకు అనుమతులపై పటిష్టమైన చట్టం రూపొందించామన్నారు. ప్రమాదం జరిగిన భవనం పక్కన బస్తీలో నివసించే పేదల విషయంలో సానుకూలంగా ఆలోచించి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు.

## న్యూజిలాండ్ కొత్త ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్

### నేడు లాంఛనంగా ఎన్నుకోనున్న లేబర్ పార్టీ



**సిడ్నీ, జనవరి 21:** న్యూజిలాండ్ నూతన ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖరారైందని చెబుతున్నారు. ఆదివారం లాంఛనంగా ఆయణ్ని తమ తదుపరి ప్రధానిగా అధికార లేబర్ పార్టీ ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. కొవిడ్ తమ దేశంపై ప్రభావం చూపకుండా కఠిన చర్యలు చేపట్టిన వ్యక్తిగా లేబర్ పార్టీకి చెందిన క్రిస్ హిప్కిన్స్‌కు పేరుంది. రెండేళ్లపాటు కొవిడ్ నియంత్రణ బాధ్యతలను ఆయనే నిర్వహించారు. గతేడాది ఆగస్టులోనే న్యూజిలాండ్ సరిహద్దుల నుంచి ఇతర దేశీయులకు అనుమతిచ్చారు. 44 ఏళ్ల క్రిస్ హిప్కిన్స్ అటు ప్రతిపక్ష నేతగా, ఇటు అధికార పక్ష నేతగా తన 14 యేళ్ల రాజకీయ జీవితంలో సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం పోలీస్, విద్యాశాఖల్ని ఆయన నిర్వహిస్తున్నారు. న్యూజిలాండ్ ప్రస్తుత ప్రధాని జెసిండా ఆర్డర్న్ గురువారమే తన రాజీనామాను ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ దేశ తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు క్రిస్ హిప్కిన్స్‌కు మార్గం సుగమం అయింది. అయితే, తన తదుపరి ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్‌ను ఎన్నుకుంటున్నందుకు అభినందించిన జెసిండా..తాను ఫిబ్రవరి 7న పదవీ విరమణ చేస్తానన్నారు. దాంతో, క్రిస్ హిప్కిన్స్ బాధ్యతలు స్వీకరించడానికి మరికొన్ని రోజులు ఆగాల్సి ఉంటుంది. న్యూజిలాండ్‌లో సాధారణ ఎన్నికలకు ఎనిమిది నెలల సమయమున్నది. తాను నిర్ణయాత్మకంగా ఉన్నానని, వేగవంతంగా పనులు పూర్తి చేయగలనని క్రిస్ హిప్కిన్స్ ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రూ.1,800 కోట్లకు తగ్గిన రుణ పరిమితి

### బడ్జెట్‌లో రూ.16,320 కోట్లకు కుదింపు

### రుణ పరిమితి పెంపు యత్నాలు విఫలం

### తెలంగాణ అప్పులపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టత

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అప్పుల పరిమితి పెంపుపై తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అంతేకాకుండా ముందు అనుమతించిన రుణాల్లో కేంద్రం మళ్లీ 1,800 కోట్ల రూపాయల మేర కోత పెట్టింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ అంతర్గత నిర్వహణ విభాగానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రాసిన లేఖలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వార్షిక అంచనా బడ్జెట్‌లో 53,970 కోట్ల రూపాయల మేర అప్పులు చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. అయితే బడ్జెట్ వెలుపల కార్పొరేషన్ల పేరుతో అప్పులు చేసిన ప్రభుత్వం, వాటిని తిరిగి బడ్జెట్ నుండి చెల్లించడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. దీంతో ఆర్థిక నియంత్రణలో భాగంగా ఆ అప్పులను కూడా లెక్కలోకి తీసుకుని ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌ఆర్‌ఎంబి)కి లోబడి 53,970 కోట్ల రూపాయల అప్పుల్లో 14,520 కోట్ల రూపాయలకు కోత పెట్టి 39,450 కోట్ల రూపాయలకే అనుమతించింది. అయితే తాజాగా ఇప్పుడు అందులో మళ్లీ 1,800 కోట్ల రూపాయలకు కోత పెట్టి 37,650 కోట్ల రూపాయల వరకే అప్పులు చేసేందుకు అవకాశం ఉన్నట్లు స్పష్టత వచ్చింది.

ఈ లెక్కన బడ్జెట్ అంచనాల్లో మొత్తం 16,320 కోట్ల రూపాయల మేర కోత పడింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 31 వేల కోట్ల రూపాయలకు పైగా అప్పులు సేకరించింది. కేంద్రం పెట్టిన కోతలు పోను ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా ఇంచుమించు 6,650 కోట్ల రూపాయలకే వీలుంది. అయితే ప్రతీ నెలా రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఖర్చులకే సరిపోని పరిస్థితి నెలకొంది. కేవలం అప్పుల మీదే ఆధారపడి రైతు బంధు తదితర పథకాలతో పాటు, ఇప్పటికే చేసిన అప్పులకు కిస్తీలు, వాటికయ్యే వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీలకే దాదాపు రూ.19 వేల కోట్లు కట్టాల్సి వస్తోంది. ఇందుకు గాను ప్రతీ నెలా సగటున రూ.1,583 కోట్లను బడ్జెట్ నుండి చెల్లిస్తోంది. ఇవి కాకుండా పాత అప్పుల వాయిదాలకు కనీసం నెలకు రూ.2 నుండి 3 వేల కోట్ల వరకూ కడుతోంది. ఈ నేపథ్యంలో ప్రతీ నెలా దాదాపు 4 వేల కోట్ల రూపాయలకు పైగా కిస్తీలు, వాటికి వడ్డీలకే పోతున్నాయి. దీనికి తగినట్లుగా ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నుండి మార్చి వరకూ చివరి క్వార్టర్‌కు సంబంధించి నిధుల వినియోగం పెద్దఎత్తున చేయాల్సి ఉంటుంది.

మరోపక్క ఈ ఏడాది సాధారణ ఎన్నికల నేపథ్యంలో రుణ మాఫీ, దళితబంధు, కల్యాణలక్ష్మి తదితర పథకాలను అమలు చేయడం తప్పనిసరి కావడంతో ఈ నిధులు ఏ మూలకూ రావనేది దాదాపు తేలిపోయింది. దీంతో రుణ పరిమితి పెంపుపై రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. గత కొంతకాలంగా అనుమతి కోసం రిజర్వ్ బ్యాంక్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. రుణ పరిమితి పెంచాలంటూ పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తులు చేశారు. ఈ విజ్ఞప్తులన్నింటినీ పరిగణలోకి తీసుకోకపోగా, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు అనుమతించిన అప్పుల్లో తాజాగా మళ్లీ 1,800 కోట్ల రూపాయల మేర కోత పెట్టడం వివాదాస్పదమవుతోంది.

### పోలీసు భర్తీలు.. లాంగ్‌జంప్, షార్ట్‌ఫుట్‌లో

## ఉత్తీర్ణులు కానివారికి మళ్లీ అవకాశం లేనట్లే

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టులతో పాటు అబ్కారీ, రవాణా శాఖలో కానిస్టేబుల్ పోస్టులకు జరుగుతు న్న భర్తీలకు సంబంధించి ఇటీవల పూర్తయిన లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు కొంతమేర మినహాయించి వారిని తుది రాత పరీక్షకు అనుమతించాలన్న వినతులు బుట్టదాఖలైనట్లుగా తెలుస్తోంది. ఈ పోస్టుల భర్తీకి వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల మధ్య రాత పరీక్షలకు రిక్రూట్‌మెంట్ బోర్డు సన్నాహాలు చేస్తుండడం తెలిసిందే. అయితే అంతకు ముందు జరిగిన లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో చాలా మంది నిరుద్యోగులు కొద్ది తేడాతో విఫలమవడం విదితమే. వీటి కన్నా ముందు జరిగిన కఠినమైన పరుగు పందెం పోటీల్లో వీరంతా ఉత్తీర్ణులవడం గమనార్హం. రాష్ట్ర పోలీసు శాఖలో తొలిసారిగా పురుషులకు 1600 మీటర్ల (ఒక మై లు దూరం), మహిళలకు 800 మీటర్ల పరుగు పందెం (అరమైలు దూరం) నిర్వహించగా ఇందులో చాలా మంది విజయం సాధించారు. కఠినమైన పరుగు పందెంలో విజయం సాధించడంతో లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో సునాయసనంగా గెలుపొందుతామని అభ్యర్థులు అనుకున్నా వీటి ప్రమాణాలు ఎక్కువగా వుండడంతో చాలా మంది కొద్ది తేడాతో విఫలమయ్యారు. ఇలా విఫలమైన వారు తమకు మరో అవకాశం ఇవ్వాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును కోరగా నిబంధనలు అందుకు అంగీకరించవని అధికారులు తిరస్కరించారు. ఈ విషయమై రాజకీయ నాయకులు, నిరుద్యోగ, యువజన సంఘాలు పోరాటం చేబట్టాయి. ఈ విషయంలో నిరుద్యో గులకు న్యాయం చేసే విధంగా సర్కారు నిర్ణయం తీసుకోవాలని ఆయా సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు.

ఇదే సమయంలో కొందరు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. అంతకు ముందు జరిగిన అర్హత పరీక్షలో తప్పుడు ప్రశ్నలకుగానూ ఏడు మార్కుల నుంచి పది మార్కులు కలపాలని కూడా రాజకీయ నాయకులు, నిరుద్యోగ, యువజన సంఘాలు సర్కారును కోరినా ఎలాంటి ప్రయోజనం కలగలేదు.

> రాజకీయ నేతలు, యువజన, నిరుద్యోగ సంఘాలు వినతులు బుట్టదాఖలు

హైకోర్టు నుంచి ఈ విషయమై అందిన ఉత్తర్వులను కూడా సర్కారు పట్టించుకోవడం లేదని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శించడం గమనార్హం. రాజకీయ నాయకులు, నిరుద్యోగ, యువజన సంఘాల పోరాటం ఇలా సాగుతుండగానే పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీల ప్రక్రియను వేగంగా కొనసాగిస్తోంది. అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి వెంటనే పరుగు పందెం, ఆ తరువాత క్రీడాంశలకు సంబంధించిన పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా 25 కేంద్రాలలో స్వల్ప వ్యవధిలోనే పూర్తి చేసింది. మొత్తం మీద పరుగు పందెం, ఆ తరువాత క్రీడాంశలకు సంబంధించిన పోటీలలో 50 శాతానికి పైగా అభ్యర్థులు విజయం సాధించారని బోర్డు ప్రకటించింది. అయితే ఇదే విషయమై బిఆర్ఎస్ పార్టీతో సన్నిహితంగా వున్న సిపిఐ పోలీసు కొలువుల్లో లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు కొంతమేర సడలింపు ఇచ్చి వారిని రాత పరీక్షకు అనుమతించాలని సిఎం కెసిఆర్‌కు లేఖ రాసింది. ఇదే సమయంలో కాంగ్రెస్, బిజెపిలు కూడా సర్కారుకు లేఖలు రాశాయి. వీటపై కూడా సర్కారు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. మరోవైపు వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల మధ్య జరగనున్న రాత పరీక్షలకు తమను అనుమతించాలని కోరుతూ లా ంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన పలువురు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరుగుతోందని నిరుద్యోగుల తరపున వాదిస్తున్న న్యాయవాదులు తెలిపారు. ఎలాగైనా తమను రాత పరీక్షలకు అనుమతించే విధంగా స ర్కారును ఒప్పించాలని లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులు రాజకీయ పార్టీల నేతలను కలుస్తూ విజ్ఞాపనలు అందజేస్తున్నారు. వీరి వినతులకు ఆయా పార్టీల నేతలు సానుకూలంగా స్పందించినా సర్కారు నుంచి ఇప్ప టి వరకు సానుకూల ప్రకటన వెలువడ లేదు. ఈ నేపథ్యంలో వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల మధ్య జరగనున్న పోలీసు కొలువుల తుది రాత పరీక్షకు లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు అవకాశం లేనట్లుగానే తెలుస్తోంది.

### వరకట్న వేధింపుల కేసులో

## భార్య చనిపోయిన 15 యేళ్లకు కోర్టు తీర్పు



**ద్వారక(గుజరాత్), జనవరి 21:** వరకట్నవేధింపులు కింద నమోదయిన కేసు విచారణలో బాధిత మహిళ చనిపోయిన 15 ఏళ్ల తర్వాతకోర్టు నిందితులకు శిక్షవిధించింది. కేసులో నలుగురు నిందితులు దోషులేనని బాధిత మహిళ భర్త, మరుదులను నిందితులుగా నిర్ధారించి వరకట్నం కోసం ఆమెను వేధించి హింసించడంవల్ల మహిళ మృతికి కారకులయ్యారని నిర్ధారించింది. బాధిత మహిళ భర్త పవన్‌కుమార్, అత్త సత్‌బీరో, మామ కప్తన్ సింగ్, మరిది దల్జీత్‌సింగ్‌లపై కేసును విచారించింది. ప్రాసిక్యూషన్‌కథనం ప్రకారం భర్తి అనే మహిళ అసాధారణపరిస్థితుల్లో మృతిచెందినట్లు పోలీసులు కేసునమోదుచేసారని, 2007 ఆక్టోబరు 3వ తేదీ ఆమె మరణించిందని, పెళ్లి చేసుకున్న ఏడాదిన్నరకే ఆమె మరణించిందని వాదించింది. కేవలం అత్తమామలు, మరిది వేధింపులు, హింసకారణంగానే ఆమెచనిపోయిందని వాదనలు వినిపించింది. ప్రాసిక్యూషన్ తన వాదనలను నిరూపించుకోగలిగిందని, ఐపిసి 498, 304బి, 34 సెక్షన్లప్రకారం నిందితులు శిక్షార్హులేనని అదనపు సెషన్స్ జడ్జి గౌతమ్ మనన్ వెల్లడించారు. ఈనెల 30వ తేదీకి నిందితులకు శిక్షను విధించేందుకు వాయిదా వేసింది. అయితే కోర్టు ఈకేసులో నిందితులపై హత్య, సాక్ష్యాలను తారుమారుచేసారన్న అభియోగాలను కొట్టివేసింది. పోస్టుమార్టం నివేదికలోనే హత్యకు గురయినట్లు నివేదిక వచ్చిందని విచారణ అధికారి చెప్పినా ఆదిశగా దర్యాప్తుజరగలేదని అన్నారు. బాధిత మహిళ చనిపోవడానికిముందు వరకట్నం కోసం అత్తింటివారు వేధించారనడానికి ఒక్కసాక్ష్యంకూడా చూపించలేకపోయారన్నారు. అయితే బాధితురాలిపట్ల తరచూ వరకట్నవేధింపులు జరిగాయన్న వాదనలను అంగీకరించింది. నిందితులపై బాధిత మహిళ రాసిన లేఖలో తీవ్రస్థాయి ఆరోపణలున్నాయని వరకట్నం భారీగా తేవాలని హింసిస్తూ తనను కొడు తున్నారని, వెంటాడుతున్నారని ఆరోపించినట్లుపోలీసులు తెలిపారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ ఆనాడు ద్వారక పోలీస్‌స్టేషన్‌లోనే నమోదు చేసారు.

## దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో కిసాన్ క్రెడిట్ కార్డు

● బ్యాంకులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చిన కేంద్రం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రైతులు దరఖాస్తు చేసుకున్న రెండు వారాలు లేక 15 రోజుల్లో వారికి కిసాన్ క్రెడిట్ కార్డును అందించాలని బ్యాంకులకు కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి శనివారం బ్యాంకులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత రబీ (యాసంగి) సీజనులో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పరికరాలు కొనుగోలు చేసేందుకు డబ్బు అవసరం అవుతుంది. అయితే సన్న, చిన్నకారు రైతులతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన రైతులు ఈ వ్యవసాయ పెట్టుబడులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం, తెలంగాణ రాష్ట్రాలు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన, రైతు బంధు పథకాల పేరుతో ఏడాదికి ఎకరానికి రూ. 8-10 వేల వరకూ అందిస్తున్న ఆర్థిక సాయం పంటల సాగుకు అవసరమైన పెట్టుబడిలో ఏ మూలకూ సరిపోవడంలేదు. దీంతో సన్న, చిన్న, పేద రైతులు వ్యవసాయం చేసేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమస్యల నుండి రైతులను గట్టెక్కించేందుకు బ్యాంకుల నుండి కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టింది. బ్యాంకులు కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేయడంలో తీవ్ర ఉదాశీన వైఖరి అవలంబిస్తున్నాయి. ఫలితంగా రుణం సకాలంలో లభించక రైతులకు జాప్యం జరుగుతోంది. ఫిర్యాదులపై కేంద్రం స్పందించి కిసాన్ క్రెడిట్ కార్డు మంజూరుపై కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. రైతు దరఖాస్తు చేస్తున్న నిర్ణీతకాల వ్యవధిలో కిసాన్ క్రెడిట్ కార్డు పంపిణీ చేయాలని, లేదా చర్యలు తప్పవని హెచ్చరించింది.

## తెగుళ్ల నష్టాలతో పసుపు రైతులు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** పసుపు పంటపై తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా పసుపునకు మర్రాకు తెగులు, దుంప తెగులు వంటివి వ్యాపించడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాష్ట్రంలోని నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో 64 వేల ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. పంట చేలల్లో నీరు నిలవడంతో తదుపరి రోజుల్లో మొక్కలు దుంప తెగులు సోకింది. ఈ దుంపకుళ్లు కారణంగా పసుపు మొక్కలు కింది భాగాన కొమ్ము పిలకలు నీటిలో మురిగిపోయాయి. ఈ విధంగా పసుపు చేలల్లో దాదాపు 60 శాతం పంట దుంపకుళ్లు సోకినట్లు రైతులు వాపోతున్నారు. దీనికి తగినట్లుగా పసుపు చేలకు మర్రాకు తెగులు వ్యాపిస్తోంది. వీటి కారణంగా దుంప తెగులు సోకిన పసుపు కొమ్ముల్లో ఎదుగుదల లోపం ఏర్పడి దిగుబడి తగ్గిపోయింది. సాధారణంగా ఎకరానికి 20 నుండి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే దుంప తెగులు కారణంగా ఎకరానికి 7 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని కన్నీటి పర్యాంతమవుతున్నారు. ఎకరం పసుపు సాగు చేయడానికి దాదాపు 1.20 లక్షల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. తెగుళ్లకు తోడు ప్రస్తుతం క్వింటాల్ ధర 6 వేల రూపాయల లోపు పలుకుతోందని అంటున్నారు. ఒకవైపు తెగుళ్లతో దిగుబడి తగ్గిపోగా, మరోవైపు ధరలు లేకపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ఈ ఏడాది నష్టాలు తప్పేటట్లు లేవని పలువురు రైతులు వాపోతున్నారు.

# డెక్కన్ స్పోర్ట్స్‌మాల్ అగ్నిప్రమాదం విషాదకరం



అగ్నిప్రమాద ప్రాంతంలోని బస్తీ వాసులతో మాట్లాడుతున్న సిపిఐ నేతలు

> మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి
> అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
> సిపిఐ జిల్లా కార్యదర్శి ఇ.టి. నర్సింహా

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 21, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ దక్కన్ స్పోర్ట్స్ అగ్ని ప్రమాదం లో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం రూ 25లక్షల రూపాయల నష్ట పరిహారం అందించాలని హైదరాబాద్ జిల్లా సీపీఐ కార్యదర్శి ఈ టి నర్సింహా డిమాండ్ చేసారు.శనివారం అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీపీఐ హైదరాబాద్ బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా ఈ టి నర్సింహా మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నివాసాల మధ్య అక్రమ కట్టడాలు,గోదాంల వల్ల స్థానికంగా నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన దుయ్యబట్టారు. అక్రమాలకు అలవాటు పడిన అధికారులు అక్రమ కట్టడాలను, పట్టించుకోకపోవడం వల్ల సికింద్రాబాద్ ప్రాంతంలో తరచూ ఇలాంటి భారీ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని,ఆయన పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, ఫైర్‌సేఫ్టీ,విద్యుత్ సంబంధించిన అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి అన్ని సక్రమంగా ఉంటేనే అనుమతి ఇవ్వాలి కానీ ఇవేమి పట్టించుకోకుండా అనుమతులు ఇస్తుండటం వల్లనే ఇలా ప్రమాదాలకు కారణాలుగా మారుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను రెగ్యులరైజ్ చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

ప్రజలు నివాసం ఉండే ప్రాంతంలో కమర్షియల్,గోడౌన్ల నిర్మాణం జరగకుండా చూడాలని చట్టం చెబుతున్నా అక్రమంగా అనేక నిర్మాణాలు నగరంలో ఉన్నాయన్నారు.తక్షణమే వీటిని గుర్తించి కూల్చివేయాలన్నారు.ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను తక్కువ వేతనాలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని ఇక్కడకు తీసుకు వచ్చి షాపులలో పనిచేయించుకుంటున్నారని,వారికి ఏ విధమైనటువంటి సామాజిక బధ్రత రక్షణ లేకపోవడం మూలంగా మృత్యువాత పడుతున్నారని అన్నారు.ఇటువంటి సంఘటనపైన లేబర్ కమీషన్ తక్షణమే స్పందించి ఈ కమర్షియల్ బిల్డింగ్‌ల లేబర్ పర్మిషన్లను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేస్తుందన్నారు.మృతుల కుటుంబాలను ఆదుకోవాలని,చుట్టు పక్కల దాదాపు 50ఇండ్లను ఖాళీ చేయించిన ప్రభుత్వ అధికారులు వారి బాధ్యతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు ఛాయాదేవి, స్టాలిన్, నెర్లకంటి శ్రీకాంత్, సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్,ఉమర్ధాన్,ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొమరెల్లి బాబు,సహాయ కార్యదర్శి ఎస్‌కే లతీఫ్,గువ్వల మల్లేష్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భవనం అగ్ని ప్రమాదం జరిగిన భవనం వద్ద ఆందోళన చేసేందుకు సీపీఐ నేతలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

**అక్రమ కట్టడాలను కూల్చివేయాలి :**

**టిజెఎస్ అధ్యక్షుడు కోదండరాం**

సికింద్రాబాద్ అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పరిశీలించారు. ఈ సందర్భంగా దక్కన్ మాల్‌లో జరిగిన అగ్నిప్రమాదం వల్ల సమీప బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, భయాందోళనలకు గురయ్యారని కోదండరాం అన్నారు. ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయాలన్నారు. నల్లగుట్ట, కాచిబౌలి బస్తీల వాసులు మూడు రోజులుగా పొగ,మంటలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని,వారికి ప్రభుత ్వం వైద్యసహాయం అందించడంతో పాటు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేసారు.అలాగే మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేసారు.

## భాషా పండితులకు పదోన్నతులివ్వాలని నేడు మంత్రులకు వినతి

### రేపు కలెక్టర్లు, డిఇఒలకు..: పండిత జెఎసి

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని భాషా పండితులకు పదోన్నతులు కల్పించడం కోసం పండిత జేఏసీ కార్యాచరణను ప్రకటించింది. ఉపాధ్యాయులకు బదలీలు, పదోన్నతులు కల్పిస్తున్న తరుణంలోనే తమకు కూడా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పండిత జేఏసీ నేడు(ఆదివారం) అన్ని జిల్లాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు పండిత జేఏసీ నాయకులు జగదీష్, నర్సిములు, చక్రవర్తుల శ్రీనివాస్, గౌరీ శంకర్, ఎండీ అబ్దుల్లా, కాంతికృష్ణ తెలిపారు. శనివారం సమావేశమైన పండిత జేఏసీ రెండు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణను చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆదివారం మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చిన తరువాత సోమవారం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా కలెక్టర్లకు, డీఈవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము, మోత్కూర్, యాదాద్రి భువనగిరి జిల్లా
ఫైల్ నెం./1ఇ.AE/ENGG/15/1/2022-23, ఆసక్తి వ్యక్తీకరణ (EoI) తేది: 21.01.2023
మోత్కూర్ మునిసిపాలిటీ పరిధిలో వివిధ రములైన నిధులచే (TUFIDC, సాధారణ నిధులు, ఎస్.ఎస్.ఎఫ్.సి., ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్, సి.డి.ఎఫ్, 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి, ఎల్.ఆర్.ఎస్. టి.యు.ఎఫ్.ఐ.డి.సి. మరియు స్టార్టప్ నిధులు మొదలగునవి) చేపట్టు అభివృద్ధి పనులకు డి.పి.ఆర్. ఎస్టిమేట్స్ మరియు డిజైన్లు చేయుటకు కనీసం పది సంవత్సరముల అనుభవము గల ప్రతిపాదితుల అర్హత, ఆర్గనైజేషన్ యొక్క క్రెడెన్షియల్ ఫైనాన్షియల్ ఆఫర్ వివరాలతో తమ ఆసక్తి వ్యక్తీకరించవలసినదిగా మరియు దిగువ సంతకందారు కమిషనర్ మోత్కూరు మునిసిపాలిటీ గారి పేరు పైన రూ.1000/- (వెయ్యి రూపాయలు) డి.డి.తో పాటు అవసరమైన డాక్యుమెంట్లను 25.01.2023న సా.3.00 గం.లలోగా దాఖలు చేయవలసిందిగా ఆసక్తి గల కన్సల్టెన్సీల నుండి కోరబడుచున్నవి.
DIPR.No.11665-PP/CL/Advt/1/2022-23, తేది: 21.01.2023 సం/- కమిషనర్, మోత్కూర్ మునిసిపాలిటీ

ఇక జంట నగరాలు, శివారు ప్రాంతాలలో ఉన్న అగ్నిమాపక కేంద్రాలు ఇప్పటికీ పాత కాలపు పద్ధతులనే అనుసరిస్తుండడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో వెంటనే వాటిని నిలువరించలేకపోతున్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు అగ్నిమాక విభాగం అధికారులది కీలకపాత్ర అనడంలో సందేహం లేదు. అయితే అగ్నిమాకవిభాగం నేటికీమారిన కాలానికి అనుగుణంగా విదేశాల్లో వున్నట్లుగా సాంకేతికతను అందిపుచ్చుకోలేకపోతోంది. ఉదాహరణకు తీసుకుంటే మంటలను ఆర్పేందుకు నీటితో పాటు గ్యాస్‌నుకూడా వాడడం ఇటీవలకాలంలో బాగా పెరిగింది. ఈ తరహాయంత్రాలు హైదరాబాద్‌లో ఒక్కటే వుండడం అదికూడా తరచూ మొరాయిస్తుండడంతో భారీ ప్రమాదాలు సంభవించినపుడు ఈవిభాగం అధికారులకు ఎటూపాలు పోవడంలేదు. హైదరాబాద్ వంటినగరంలో గ్యాస్‌తో మంటలను ఆర్పేయంత్రాలు కనీసంపదైనా వుండాలని అధికారులంటున్నారు. ఇవి కాస్త ఖరీదైనవే అయినా మారినపరిస్థితుల్లో ఇవిఎంతగానో ఉపయోగకరంగావుంటాయని వారంటున్నారు. ఈ విషయంలో నిధులలేమి అగ్నిమాపక విభాగాన్ని పీడిస్తోంది. ఇక అగ్నిమాపక యంత్రాలకు వెంటవెంటనే నీటిని సమకూర్చుకోవడం కూడా కష్టంగా మారుతోంది. గతంతో పోలిస్తే వాటర్ వర్క్స్ విభాగంనుంచి నీటినితీసుకునే వెసులుబాటువున్నా వాటర్‌వర్క్స్ రిజర్వాయర్లు దూరంగా వుండడం, చాలా సమయాలలో అనుమతులు ఆలస్యమవుతుండడం సమస్యగా మారుతోంది. నగరంలో ఇప్పుదున్నఅగ్నిమాపక కేంద్రాలకు తోడుగా మరో 30 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిపుణులు కోరుతున్నారు. అలాగే వసతుల్లేని గోదాములు నగరంలో ఆరువేలకు పైగా వుండడం విచిత్రంగా పేర్కొనాలి. ఇదే సమయంలో అగ్నిమాపకకేంద్రాలలో సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. వీటిని వెంటనే భర్తీ చేసి అదనపు సిబ్బందిని మంజూరు చేయడం వల్ల అగ్ని ప్రమాదాల సమయంలో వేగంగా స్పందించేందుకు వీలుంటుందని ఆయా ప్రాంతాల ప్రజలు అంటున్నారు.

# ప్రమాద ఘంటికలు మోగిస్తున్న అగ్ని ప్రమాదాలు

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. జనావాసాల మధ్య టింబర్, రసాయన డిపోలు, స్క్రాప్ గోదాములు, బాణా సంచా దుకాణాలు, ఫ్యాక్టరీలు పెద్ద సంఖ్యలో వుండడం, వీటికి ఆనుకుని అనేక మార్కెట్లు నెలకొనడంతో చిన్నపాటి ఘటనలు కూడా భారీ ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఇదివరకు అగ్నిప్రమాదం అంటే చిన్నపాటి ఆస్తి నష్టం వరకే వుండగా నేడు పదుల కోట్ల రూపాయల ఆస్తినష్టంతో పాటు పదులసంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి నెలకొంది. 2002లో బేగం బజార్‌లో ప్రధాన రహదారిపై గల శాంతిఫైర్ వర్క్స్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 13 మంది మరణించిన ఘటన మొదలుకొని తాజాగా రాంగోపాల్‌పేట్‌లో జరిగినభారీ అగ్ని ప్రమాదం వరకు నగరంలో అనేక ఉదంతాలు ఆయా ప్రాంతాల ప్రజలను భయకంపితులను చేయగా ఎన్నో కుటుంబాల్లో విషాధాన్ని నింపాయి. హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాలు ప్రతీయేటా పెరుగుతూనే వుండడం ఒక ఎత్తయితే బేగంబజార్, బోయిగూడ, రూబీ హోటల్, రాం గోపాల్ పేట్ తరహాలో భారీ ఘటనలు తరచూ జరుగుతున్నా వీటిని నివారించలేకపోవడంలో సర్కారీ విభాగాలు వైఫల్యం చెందడం మరోఎత్తుగా చెప్పాలి. హైదరాబాద్ వరకు వస్తే గడచిన 10 నెలలో మూడు భారీ అగ్ని ప్రమాదాలు సంభవించగాఈ దుర్ఘటనల్లో 22 మంది దుర్మరణం చెందారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఇప్పుడు అంతర్జాతీయ నగరంగా రూపాంతరం చెందుతోంది. నైజాం నవాబుల కాలం నుంచి అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మరింతవేగంగా దూసుకుపోతుందనడంలో ఎలాంటి సందేహంలేదు. ముఖ్యంగా దేశ, విదేశాలకు చెందిన లక్షలాది మంది విద్యాధికులకు ఐటి రంగంలో ఉపాధి కల్పిస్తున్న హైదరాబాద్ నగరం నేడు ప్రపంచంలోని అగ్రనగరాలలో ఒకటిగావుంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన లక్షలాదిమంది వలసకూలీలకు కూడా భాగ్య నగరం కూడు, గుడ్డ అందిస్తూ నీడనుకూడా ఇస్తోంది. దేశంలోని ఇతరనగరాలతో పోలిస్తే హైదరాబాద్ నగరం వాతావరణం సమతుల్యంగా వుండడం, తాగునీటి కొరతలేకుండా వుండడం, శాంతిభద్రతల సమస్యలు లేకపోవడం వంటి అంశాలు భాగ్యనగరానికి బాగా కలిసివచ్చిన అంశం. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర జనాభా నాలుగు కోట్లమంది కాగా హైదరాబాద్‌తోపాటు శివార్లలో సుమారు కోటీ 75లక్షల మంది నివసిస్తున్నారు. ఇదే సమయంలో నిత్యం 25 లక్షల మంది ఇక్కడ రాకపోకలు సాగిస్తున్నారు. నగరంలో వందలసంఖ్యలో ఐటి



కంపెనీలతోపాటు వేలసంఖ్యలో ఫ్యాక్టరీలు వుండడంవల్ల విద్యాధికులతో పాటు వలసకూలీలకు ఉపాధి లభిస్తోంది. ఇదే సమయంలో అసంఘటిత రంగంలోవున్న టింబర్ డిపోలు, స్క్రాప్ గోదాములు, బాణా సంచాదుకాణాలు వేలసంఖ్యలో వుండగా వీటిలోనూ లక్షలమంది ఉపాధి పొందుతున్నారు. ఇందులో టింబర్ డిపోలు, స్క్రాప్ గోదాముల వరకువస్తే ఇవిఇప్పట్లో ఏర్పాటైనవి కావని చెప్పాలి. స్వాతంత్ర్యం రాక ముందు ఇప్పటి రాణిగంజ్ వద్ద రైలుపట్టాల పక్కనకొన్ని టింబర్ డిపోలుండేవి. అప్పట్లో బొగ్గుతో నడిచే రైలు ఇంజన్లు వుండడం, వీటిలో బొగ్గునింపే సమయంలో నిప్పురవ్వలుఎగసి పడి రాణిగంజ్‌వద్ద రైలుపట్టాల పక్కనే గల టింబర్ డిపోలలో అనేకమార్లు అగ్నిప్రమాదాలు సంభవించి పెద్దఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించాయి. దీంతో డిపోల వ్యాపారులు నాటి పాలకులతో తమసమస్యలను చెప్పుకోగా అప్పట నైజాంసర్కారు రైలుపట్టాల పక్కన వున్నటింబర్ డిపోలను ఇప్పటి బోయి గూడ వద్దగల ఖాళీస్థలానికి తరలించింది. అప్పట్లో బోయి గూడవద్ద ఏర్పాటైన టింబర్ డిపోలు నేటికీ ఎలాంటి మౌలిక వసతులు లేక కొనసాగుతుండగా, వాటి పక్కన స్క్రాప్ దుకాణాలు కూడా వెలియడం గమనార్హం. నగరంలో మొత్తంమీద 6200వరకు టింబర్, స్క్రాప్ డిపోలున్నట్లు అధికారుల అంచనా. ఇది పదివేలకు పైగా వుంటుందని అనధికారవర్గాలు చెబుతున్నాయి. ఇకవీటితోపాటు వెయ్యివరకు వున్న చిన్నాపెద్ద బాణాసంచా దుకాణాలు, పదివేలకుపైగా వున్న ఫ్యాక్టరీలు, అంతకు రెట్టింపు సంఖ్యలో నగరం మధ్యన అక్రమబహుళ అంతస్తుల భవనాలలో ఏర్పాటైన వాణిజ్య సంస్థలు వీటికి అదనంగా చెప్పాలి. నిబంధనల ప్రకారం పారిశ్రామికవాడలతోపాటు గోదాములు, డిపోలలో అగ్నిప్రమాద నివారణకు పటిష్టమైన చర్యలుతీసుకోవాల్సి వున్నా ఎక్కడా ఈఏర్పాట్లు కానరా వడం లేదనేది బహిరంగరహస్యమే. ఇరుకైన చోట్ల గోదాములు, డిపోలు, బాణాసంచా దుకాణాలు, ప్రమాదకర రసాయనాలు కలిగిన వాణిజ్యసంస్థలు వుండడం, వీటిపక్కనే కాలనీలు, మార్కెట్లు వుండడంతో అనుకోని ప్రమాదం ఏదైనాజరిగితే దానికి బాధ్యులెవరన్న దానికి సర్కారీవిభాగాలే సమాధానం చెప్పాలి. ఉదాహరణకు రాంగోపాల్‌పేట్‌లోగల మినిస్టర్స్ రోడ్డుపైగల ఓఅంతస్తుల భవనంలో గురువారం సంభవించిన భారీ అగ్ని ప్రమాదాన్నే తీసుకుంటే ఈప్రమాదంలో చెలరేగిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపకశాఖ అధికారులకు 12గంటల సమయం పట్టింది. ఇదే సమయంలో నగరంలోని అన్ని ఫైర్ స్టేషన్లకు చెందిన ఫైరింజన్లను ఇక్కడవాడారు. ఇదే సమయంలో ఈ ప్రమాదం కారణంగావెలువడ్డ పొగకారణంగా చుట్టుపక్కనగల పలుబస్తీల ప్రజలను ఖాళీచేయించాల్సి వచ్చింది. ఇదే ప్రాంతంలోని కిమ్స్ ఆసుపత్రిలోని రోగులు సైతం ఇబ్బందులకుగురయ్యారు. రాంగోపాల్‌పేట్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో మంటల తీవ్రతపెరగడానికి, గంటల తరబడి నల్లటి పొగ సమీపంలోని బస్తీలను కమ్మేయడానికి ప్రమాదం జరిగిన వాణిజ్యసంస్థలో పెట్రోకెమికల్స్, ప్రమాదకర రసాయ నా లు నిలువుండడం కారణంగా తేలింది. వాస్తవానికి టింబర్, స్క్రాప్ డిపోలు, రసాయనాలు, పెట్రోకెమికల్స్ వంటి వస్తువులు కలిగివున్న సంస్థలకు విశాలమైన ప్రాంతం కావాల్సి వుంది. వీటివల్ల అనుకోని ప్రమాదంసంభవిస్తే దీని తీవ్రత ఎక్కువగా వుండే వీలుండడంతో విశాలమైన ప్రాంతాల అవసరం వుంది.

నగరంలోని ప్రముఖ వాణిజ్యమార్కెట్‌లలో ఒకటిగా వున్న ఉస్మాన్‌గంజ్ మార్కెట్, బేగంబజార్, మలక్‌పేట్‌మార్కెట్, సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లలో గతంలో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. బేగంబజార్‌లో వున్న అనేక బాణాసంచా దుకాణాలలోనూ అనేకమార్లు అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఇందులో 2002లో శాంతి ఫైర్ వర్క్స్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో 12 మంది మరణించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇటువంటి దుర్ఘటనే గత సెప్టెంబర్ నెలలో సికింద్రాబాద్‌లోని రూబీ హోటల్‌లో జరిగి ఎనిమిది మంది మరణించారు. ఈఘటనల తరువాత నగరంలో ఇరుకుగా వున్నచోట్ల మండే స్వభావం కలిగిన వస్తువులు కలిగి వున్న గోదాములు వుండకుండా చూడాలని అధికారులు నిర్ణయించినా ఇది ఆచరణలో అమలుకాలేదు. నిబంధనల ప్రకారం బాణాసంచా దుకాణాలు, గోదాములు, మండే స్వభావం కలిగిన రసాయనాలు వుండే గోదాములకు విశాలమైన ప్రదేశం వుండాలి. కానీ నగరంలో ఇవి ఎక్కడా లేవనిచెప్పాలి. ఈ విషయంలో బల్దియాతో పాటు పోలీసు విభాగాలు ఏంచేస్తున్నాయనే దానికి సమాధానం లేకుండా పోయింది. ఒక్క బాణాసంచా దుకాణాలు, మండే స్వభావం కలిగిన రసాయనాలు వుండే గోదాములే కాదు టింబర్ డిపోలు, స్క్రాప్ గోదాముల్లోనూ ఇటువంటి పరిస్థితులే వున్నాయంటే అతిశయోక్తికాదు. హైదరాబాద్‌లో ఇటీవల కాలంలో స్క్రాప్ దుకాణాలు, గోదాముల్లో తరచూ పేలుళ్లు జరుగుతూ ఒకరిద్దరు మరణించడం పరిపాటిగా మారింది. నిబంధనల ప్రకారం వీటికి ప్రతీయేటా లైసెన్స్ రెన్యూవల్ చేయాల్సి వుంది. రెన్యూవల్ సమయంలో అన్ని విభాగాల అధికారులు ఒకటికి పదిమార్లు తనిఖీ చేశాకే ఎన్ఓసి జారీ చేయాల్సివుంది. కానీ నగరంలోని ఏ గోదాములోనూ కనీస మౌలిక వసతులు లేకపోయినా ప్రతీ ఏడాది లైసెన్స్ మాత్రం ఠంచనుగా రెన్యూవల్ అయిపోతుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుందనేది అందరికి తెలిసిందే. మామూళ్ల మత్తులో అందరు అధికారులు అంతా ఓకే....అనేస్తున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు చెప్పుకుంటున్నారు. ●

కర్ణాటక

# 'ఉచిత' మాయ!

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నికల వేడి పెరుగుతోంది. కాంగ్రెస్, బిజెపి, స్థానిక పార్టీలు సహా అన్ని రాజకీయ పక్షాలకు చెందిన నేతలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. కొత్తకొత్త ప్రణాళికలతో ప్రజల ముందుకు వస్తున్నారు. తాము ప్రకటించేదేదైనా ఇతర పార్టీలకంటె భిన్నంగా, గొప్పగా ఉండాలన్నదొక్కటే వారి తాపత్రయం. ఒకరు పది అంటే మరొకరు 20అనడం, వారు గోడ ఎక్కిస్తామంటే వీరు చెట్టెక్కిస్తామనడం. ఎవర్ని చూసినా కనిపిస్తున్నది ఇదే. సాధ్యాసాధ్యాలను పక్కనపెట్టి, సమాజానికి కలిగే ప్రయోజనాలను విస్మరించి, ఆకర్షణీయంగా ప్రకటనలు చేయడం ఒక్కటే అందరిలో కనిపిస్తోంది. తాజాగా కర్ణాటకలో కాంగ్రెస్, బిజెపిలు చేస్తున్న ప్రజాకర్షక ప్రచారం చూస్తుంటే స్వర్గాన్ని నేలకు దింపుతున్నట్లే అనిపిస్తుంది. గతవారం మూడు ఈశాన్య రాష్ట్రాలు మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూలు విడుదల కావడంతో, కర్ణాటకలోనూ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఈ రాష్ట్రంలో ఎన్నికలకు మరో మూడు నెలల వ్యవధి ఉందికానీ, నేతలు ప్రచారంలో పోటీలుపడడం మొదలుపెట్టేశారు. అధికారం నిలబెట్టుకోవాలని బిజెపి భావిస్తుంటే గత వైభవాన్ని తిరిగిపొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ పోటీలో రెండు పార్టీలవారుఉచితమో, అనుచితమో పట్టించుకోనకుండా, 'ఉచిత' ప్రకటనలు మాత్రం హోరెత్తించేస్తున్నారు. హామీలు ఎంతవరకు వెళ్తున్నాయంటే స్వర్గంలోకూడా సీట్లు రిజర్వు చేయిస్తామనేంతవరకు ఆశలు కల్పిస్తున్నారు. ఏదోవిధంగా ఓట్లను ఆకర్షించడం అన్నదొకటే వాటి లక్ష్యం. చివరికి ఆ హామీలను బడ్జెట్‌లో కూడా చేరుస్తామంటూమరో అడుగు ముందుకు వేశారు ముఖ్యమంత్రి బొమ్మయ్. ఇంటి క్షేమాన్నినిరంతరం కాంక్షించేగృహిణులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందనీ, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండడం కోసం వారందరికి ఆర్థికసహాయం అందిస్తామనీ, ఫిబ్రవరి 17నఅసెంబ్లీకి సమర్పించే బడ్జెట్‌లో దానికి అవసరమైన నిధులు కూడా కేటాయిస్తామనీ ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడంతో కాంగ్రెస్‌లో కంగారు మొదలయింది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీప్రకారం ప్రతి గృహిణికి దాదాపు మూడువేల రూపాయలు ప్రతినెల లభించే సూచనలున్నాయి. అంటే గృహిణులు తమచిల్లర ఖర్చులకు ఇక భర్తపైనో, కుమారులపైనో ఆధారపడనక్కర లేదన్నమాట. గృహిణుల ఓట్లు ఆకర్షించడానికి ముఖ్యమంత్రి పెద్ద ఎరనేవేశారు. ఆయన ఆ ప్రకటన చేయగానే కాంగ్రెస్‌అగ్రనేత ప్రియాంకగాంధీ కర్ణాటక ప్రచారానికి వచ్చి, తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి గృహిణికి నెలకు రెండువేల 'బహుమతి'గా ఇస్తామంటూ ప్రకటించారు.



ప్రియాంక గాంధీ

ప్రభుత్వం ప్రకటించిన సాయం అమలైనా, కాంగ్రెస్ ప్రకటించిన 'బహుమతి' అమలైనా సంవత్సరానికిదాదాపు45వేలకోట్ల రూపాయలు ఖర్చవుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. అంటే అంతటి భారీ మొత్తం అనుత్పాదక కార్యక్రమాల ప్రవాహంలో కొట్టుకుపోతుందన్నమాట. ఓవక్క ఉచితాలుఅలా ప్రకటించవద్దని ప్రధాని మోడీ, సుప్రీంకోర్టు కూడా చెబుతుంటే, సాక్షాత్తుముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్షనేత ఆ ఉచితాలే అనూహ్యమైనరీతిలో ప్రకటించడం విచిత్రంగా కనిపిస్తుంది. తమను గెలిపిస్తే రాష్ట్రంలోని అన్నికుటుంబాలకు 200యూనిట్లవిద్యుత్ ఉచితంగా ఇస్తామంటూ కాంగ్రెస్ మరోవాగ్దానంకూడా చేసింది. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే గృహిణుల ఖాతాల్లోకి సంవత్సరానికి 24వేల రూపాయలు అలా జమ అయిపోతాయన్నమాట. గృహిణుల ఓట్లను ఆకర్షించడంలో సఫలమైతే, ఆగృహిణి ఓటుతోపాటు ప్రతి కుటుంబం నుంచి మరో రెండు, మూడు ఓట్లు కూడా తమ ఖాతాలోపడే అవకాశం ఉంటుందనే అంచనాతో కావచ్చు. అటు ప్రభుత్వం, ఇటు ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా ఈ వినూత్న ఆకర్షణపథకానికి తెరతీశాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల సాధించిన విజయం కాంగ్రెస్‌లో మరింత ఉత్సాహాన్ని పెంచినట్లుగా ఈ ప్రచార్భాటాన్ని చూస్తే అర్థమవుతుంది. 'నా నాయకి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి కాంగ్రెస్ ఈ ఉచిత హామీలు ఇచ్చుకుంటూవెళ్తోంది. 'మహిళా సాధికారత' అనే చక్కని పేరు పెట్టి దానికింద ఇలాంటి సంక్షేమ పథకాలను వారు ప్రకటించడం గమనించవలసిన అంశం. మహిళలు వారికాళ్లపై వారు నిలబడేట్లు చేయగలిగితే ఎవరైనా హర్షిస్తారు. వారికోసం ప్రకటించిన 33శాతం రిజర్వేషన్లు చట్టసభల్లోకూడా అమలు చేస్తే అంతా సంతోషిస్తారు. కానీ అతి ముఖ్యమైనవన్నీ వదిలేసి ఈ 'ఆకర్షణ' పథకాలు మాత్రమే ప్రకటించడం చూస్తే వాటివల్ల సాధికారత ఎలా సాధ్యమవుతుందో అంతుపట్టని విషయం. ఇక విద్యార్థులకు ముఖ్యంగా స్కూలు పిల్లలకు కూడా ట్యాబ్‌లు పంపిణీ చేయడం, మొబైల్‌ఫోన్లు పంపిణీ చేయడం మరింత విస్తుగొలుపుతుంది. ట్యాబ్‌లకు అవసరమైన ఇంటర్నెట్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉన్నా భారీసంఖ్యలో వాటిని తెప్పించి ఇస్తుంటారు. కమిషన్లు ఆశించి అటువంటి పథకాలు రచిస్తారో, లేక విద్యార్థులకు నిజంగా ప్రయోజనమో అర్థంకాని విషయం. విద్యార్థులకు సంవత్సరమంతా వారికవసరమైన నోట్‌పుస్తకాలు ఉచితంగా సరఫరాచేస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. కానీ వాటికంటె ట్యాబ్‌లకే నాయకులు ప్రాధాన్యం ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అన్నభాగ్య, క్షీరభాగ్య అంటూ మరికొన్ని ఉచిత పథకాలను కూడా ప్రియాంక గాంధీ ప్రకటించారు. ఉచిత పథకాలను ఇలా ప్రకటిస్తూ వెళ్తే చివరికి అన్ని ప్రభుత్వ సర్వీసులు ఉచితాలయిపోతాయి. ఆ భారమంతా మళ్లీ ప్రజలపైనే పడుతుంది. ఎందుకంటే ఏ నాయకుడుగాని, ఏ పార్టీగాని తమ సొంత డబ్బు ఒక్క పైస కూడా ఏ పథకానికి ఖర్చు చేయరు కదా! అటువంటప్పుడు ప్రజలకు రెండు ఇచ్చినాలుగు తీసుకోవడమే అవుతుంది. ఈ ఉచితాలు ముదిరితే ఎన్ని సమస్యలకైనా దారితీస్తాయి. ●

న్యూజిలాండ్

# ఎన్నికలకు ముందే 'కివీస్'కు కొత్తప్రధాని!

**గన్ని మోహన్**

ద్వీపకల్పదేశంగా ఉన్న న్యూజిలాండ్‌లో రాజకీయ అస్థిరతనుంచి గట్టెక్కేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్లపదవీకాలం పూర్తిచేసుకుంటున్న తరుణంలోనే సంస్కరణల పరంగా ముందుకుపోవాల్సిన తరుణంలో ప్రస్తుత ప్రధానిజెసిండా ఆర్డర్న్ రాజీనామా అక్కడిపాలకులను కుదిపేసింది. 37 ఏళ్లవయసులోనే ప్రధానిగా పదవినిచేపట్టిన సమర్థవంతంగాపాలన అందించిననేతగా జెసిండాకు పేరుంది. పార్టీ వార్షిక సమావేశంలో జెసిండా తననిర్ణయాన్ని ప్రకటించడంతో అధికార లేబర్‌పార్టీ ఇపుడు కొత్తనేతను అన్వేషించుకునేపనిలో పడింది. కేవంద్ర వామపక్ష సామాజిక సమీకరణాలతో ప్రజాస్వామ్యబద్ధంగా నడిచేపార్టీగా లేబర్‌పార్టీకిపేరుంది. ఇపుడు జెసిండా కూడా ఆపార్టీ ప్రతినిధిగానే ప్రధానిగాకొనసాగారు. అయితే 2023లో జరిగే ఎన్నికల్లో జెసిండా నేతృత్వంలోని లేబర్‌పార్టీ ప్రధాన ప్రతిపక్షం నేషనల్ పార్టీకంటే కొంత వెనుకబడింది. దేశాన్ని సంస్కరణల దిశగా నడిపించాలని ఆదేశ ప్రజలు కోరుకుంటున్నారు. అయితే సంస్కరణలకు ఇది సమయంకాదని అందువల్ల ఎన్నికలకు ముందుగానే తాను రాజీనామాచేయాలని నిర్ణయించుకున్నట్లు జెసిండాప్రకటించారు. వాస్తవానికి ఆమె పదవీకాలం వచ్చేనెల ఏడవతేదీవరకూ ఉంది. ఎన్నికలు ముగిసి కొత్తప్రధాని వచ్చేంతవరకూ తాను కొనసాగుతానని చెప్పిన జెసిండా స్థానంలో ఇపుడు కొత్తప్రధాని అభ్యర్థిగా జెసిండా కేబినెట్‌లోని విద్యామంత్రి క్రిస్ హిప్కిన్స్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జెసిండా స్థానంలో 44 ఏళ్ల హిప్కిన్స్ లేబర్‌పార్టీ సహచరుల నుంచి మద్దతు కూడగడుతున్నారు. అయితేఇది కేవలం లాంఛనప్రాయమేనని ప్రధానిగా ఎన్నిక ఖాయమన్న వార్తలు కూడా ఉన్నాయి. అధికార బదిలీ రానున్న కొద్దిరోజుల్లోనే జరిగిపోతుందన్న భావనలో లేబర్‌పార్టీ ఎంపిలున్నారు. రాజధాని వెల్లింగ్టన్‌కు సమీపంలోని కుగ్రామంలో పుట్టిపెరిగిన హిప్కిన్స్ ప్రధానిగా బాధ్యతలుచేపట్టడం తనకెంతో గర్వకారణమని, దేశ ప్రతిష్టను ఇనుమడింపచేసే విధంగా వ్యవహరిస్తానని చెప్పుకొచ్చారు. హిప్కిన్స్‌తోపాటు లేబర్‌పార్టీలో మరికొందరి పేర్లు వచ్చినా వీరంతారేసులో వెనుకబడినట్లు స్పష్టం అయింది. సార్వత్రిక ఎన్నికలకుముందు హిప్కిన్స్ పదవి చేపడితే ప్రధానిగా కేవలం ఎనిమిది నెలలు మాత్రమే ఉంటారు. అభిప్రాయసేకరణతో లేబర్‌పార్టీ ప్రధానప్రతిపక్షంకంటే వెనుకబడటంతో ఈసారి ఎన్నికల్లో గట్టిపోటీ తప్పదన్న భావన లేబర్‌పార్టీలో వ్యక్తం అవుతోంది. నేషనల్‌పార్టీ కన్సర్వేటివ్స్ పార్టీగాపేరుంది. కరోనావైరస్ ఉధృతి ఉన్నకాలంలో హిప్కిన్స్ పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. 37ఏళ్లవయసుతో ప్రపంచంలోనే అత్యంత పిన్న వయసు ప్రధానిగా పేరు తెచ్చుకున్న జెసిండా కరోనా కట్టడి, సామూహిక కాల్పుల ఉదంతంపై అమలుచేసిన కార్యాచరణతో తన సమర్థతనుచాటుకున్నారు. అయితే ఆమెకు రాజకీయ వత్తిళ్లు ఎక్కువయ్యాయి. అమెకు ఎక్కువగా ప్రాణహాని హెచ్చరికలు కూడా అందాయి. పెరుగుతున్న ఒత్తిడి కారణంగా నేరాజీనామాచేసిన జెసిండాస్థానంలో ఇపుడు హిప్కిన్స్ వస్తున్నారు. విద్యాశాఖతోపాటు పోలీస్, పౌరసేవల విభాగాలను కూడాపర్యవేక్షించిన హిప్కిన్స్ అధికారసభాపక్షనేతగా కొనసాగారు. రాజకీయంగా వచ్చే సమస్యలకు ట్రబుల్‌షూటర్ అన్న పేరుంది. ఇతరప్రజాప్రతినిధులు సృష్టించే సమస్యలనుంచి పార్టీని గట్టెక్కించడంలో హిప్కిన్స్ సమర్థుడన్న పేరుంది. 15ఏళ్లుగా ఎన్నికైన ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్న హిప్కిన్ ఇపుడు ప్రధాని పదవికి అన్నివిధాలా అర్హుడని లేబర్‌పార్టీ భావిస్తోంది. ఎన్నికల సంవత్సరంలో కొత్త బాధ్యతలుచేపడుతున్న హిప్కిన్స్ ముందు అనేకసవాళ్లున్నాయి. న్యూజిలాండ్‌లో నిరుద్యోగం 3.3శాతంమాత్రమే. కానీ ద్రవ్యోల్బణం మాత్రం 7.2శాతంగా ఉంది. కివీస్ రిజర్వుబ్యాంకు బెంచ్‌మార్క్ వడ్డీరేట్లను 4.25 శాతానికిపెంచింది. ద్రవ్యోల్బణం కట్టడిచేయడం ప్రస్తుత ప్రభుత్వ ప్రధానలక్ష్యం. కట్టడిచేయలేని పక్షంలో ద్వీపకల్పదేశం ఆర్థిక మాంద్యంలోకి వెళ్లకతప్పదని ఆర్థికనిపుణులు హెచ్చరిస్తున్నారు. కొత్తప్రధాని క్రిస్ హిప్కిన్స్‌కు ఇపుడు దేశ ఆర్థికవ్యవస్థను చక్కబెట్టడమే ప్రధాన కర్తవ్యం. అంతేకాకుండా ఎన్నికల సంవత్సరం కావడంతోప్రజలను అంటే ఓటర్లను లేబర్‌పార్టీవైపు ఆకర్షితులనుచేసేందుకు అవసరమైన కార్యాచరణను కూడా సిద్ధంచేయాలి. మరోవైపు పెరుగుతున్న ప్రతిపక్ష ప్రాబల్యానికి బ్రేకులు వేయడంతోపాటు ఉన్న పార్టీలో అసంతృప్తులను కూడాబుజ్జగించి తనవైపునడిపించాల్సిన గురుతరబాధ్యత హిప్కిన్స్‌పై ఉంది. అంతేకాకుండా దేశ ఆర్థికవ్యవస్థను తమపార్టీ సరిదిద్దగలదన్న నమ్మకాన్ని ప్రజల్లోపెంచాలి. ఆదిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనాఉంది. పన్నురాబడులతోపాటు పన్నుమినహాయింపులు, ఉచితాలు వంటివి ఇపుడు ప్రపంచదేశాల్లో సర్వసాధారణం అయిపోయాయి. అభివృద్ధిచెందిన దేశాలనుంచి అభివృద్ధిపథంలోనడుస్తున్న దేశాల్లోకూడా ఈ ఉచితాల బెడద ఎక్కువయిందనే చెప్పాలి. ఈతరుణంలో దక్షిణపసిఫిక్ మహాసముద్రంలోని ఈ ద్వీపకల్పదేశంలో రానున్న ఎన్నికలు ఇపుడు అధికార లేబర్‌పార్టీకి అటు ప్రతిపక్షంలో ఉన్న నేషనల్ పార్టీకి కూడా ప్రతిష్మాకంగానే మారుతున్నాయి. ఆస్ట్రేలియా, తోంగా, ఫిజీ ద్వీపకల్పదేశాల సరిహద్దులను పంచుకుంటున్న న్యూజిలాండ్ ఇపుడు ఎన్నికల సంస్కరణలతో కొత్తప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధం అవుతోంది. ఈలోపే మహిళాప్రధాని జెసిండా రాజీనామాతో ఇపుడు అత్యవసరంగా పార్టీ పట్టు కోల్పోకుండా కొత్తప్రధానిని నామినేట్ చేసుకోవాల్సి వచ్చింది. గతప్రధాని కేబినెట్‌లో కీలకశాఖలు నిర్వహించిన హిప్కిన్స్ పాలనానుభవంతో ప్రపంచదేశాల్లో ద్వీపదేశ ప్రతిష్టను ఇనుడింపచేయగలిగితే రానున్న ఎన్నికల్లో కూడా ఆయనే మళ్లీ ప్రధాని అవుతారనడంలో ఎలాంటి సందేహంలేదు. ●



క్రిస్ హిప్కిన్స్

# పాఠశాల విద్యాలక్ష్యాలు- ముందున్న సవాళ్లు

**మల్లాడి శ్రీనగేష్**

సుస్థిర అభివృద్ధి లక్ష్యం ప్రకారం 2030 సంవత్సరాంతానికి సమ్మిళిత, సమానమైన నాణ్యమైన విద్య అందరికి అందించడం, తద్వారా అందరికీ అభ్యసనా అవకాశాలు అనేది ప్రధానలక్ష్యం. ఈ లక్ష్యాలు సాధించడానికి ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలి. ఈ లక్ష్యాలదిశగా ప్రస్తుతమున్న పరిస్థితులను విశ్లేషించి సంస్కరణ దిశగా అడుగులు వేయడం, చేపట్టిన కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసే యంత్రాంగాలను ఏర్పరచడం, పూర్తి నిబద్ధతతో పాఠశాలవిద్యకు కొత్తరూపును తీసుకురావడం ప్రధాన లక్ష్యం. 21వ శతాబ్దంలో రూపొందించిన నూతన విద్యావిధానం ప్రధాన ఉద్దేశ్యమైన దేశంలో అభివృద్ధి అవసరాలకు కావలసిన విద్యను, నైపుణ్యాలను పెంపొందించడం, సృజనాత్మకతను, ఆలోచింపచేసే చదువును అందించి అందరికి అభివృద్ధిఫలాలను అందేలా చేసి భారతావనిని భాగ్యసీమగా తీర్చిదిద్దడం అనేది ప్రధానాంశం. అయితే కొవిడ్ విపత్తువల్ల భారత దేశంలో సుమారు 32కోట్ల మంది విద్యార్థులు అభ్యసనకు దూరమైనట్లు యునెస్కో 2020నివేదిక ప్రకారంవెల్లడైంది. వీరిలో 15.8కోట్లమంది బాలికలు, 16.2కోట్ల మంది బాలురు అనితెలిసింది. వీరిలో 86 శాతం మంది సెకండరీ విద్యనభ్యసించేవారని, 10శాతం మంది విద్యార్థులు మధ్యస్థాయి తరగతులు కాగా పూర్వప్రాథమిక విద్యనభ్యసించేవారు నాలుగుశాతం మంది పిల్లలు అని నివేదిక వెల్లడించింది. అసర్ నివేదిక 2019 ప్రకారం దేశంలో 96.7 శాతం మంది బాలలుపాఠశాలల్లో చేరగా 25.7శాతంమంది ఇంకా బడి బయట ఉన్నట్లు తెలిసింది. అయితే సుమారు32.9శాతం మంది బాలికలు సెకండరీ విద్యకు రాకుండా ముందే పాఠశాలను మానేస్తున్నట్లు యుడైస్ 2016-17 ప్రకారం తెలిసింది. వరల్డ్ డెవలప్‌మెంట్ నివేదిక 2018 ప్రకారం సర్వే నిర్వహించిన 12 దేశాల్లో భారత దేశం గురించి ప్రస్తావిస్తూ సుమారు 60శాతం 3వ తరగతి చదివే పిల్లలు కనీసం రెండు అంకెల తీసివేత కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నారని, ఐదవ తరగతిలో అయితే 50 శాతం మంది పిల్లలు రెండంకెల తీసివేత కూడా చేయలేకపోతున్నారని వెల్లడించింది. దశాబ్దాలు గడుస్తున్నా, పాఠశాలల్లో 100 శాతం మంది పిల్లలను బడికి తీసుకురాగలిగినా, విద్యాహక్కుచట్టం ద్వారా నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు అమలు, ప్రణాళికలు 2010నుండి అమలు జరుగుతున్నా ప్రాథమికస్థాయి విద్యార్థులు తరగతి స్థాయి అభ్యసనా సామర్థ్యాలు సాధించలేని స్థితిలో ఉన్నారనేది గమనార్హం. పిల్లలు కనీస సామర్థ్యాలు అనగా చదవడం, రాయడం చేయలేని స్థితిలోఉండడం వలన పిల్లలకు పాఠ్యాంశాలు బోధించినప్పటికీ భాషా సామర్థ్యాలను, అభ్యసనా ఫలితాలను సాధించడం చాలాకష్టతరం. ఈ పరిస్థితుల నుండి పిల్లలను తీర్చి దిద్దడానికి విద్యార్థుల్లో మౌలిక సామర్థ్యాల సాధన కోసం జాతీయ విద్యావిధానం 2020 'ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అనగా మౌలిక భాష, గణితంలో సామర్థ్యాల సాధన కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నది. ఈ ప్రక్రియలో పటిష్టంగా పని చేయడానికి ప్రత్యేకంగా నేషనల్ మిషన్ ఆన్ ఫౌండషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అనే ఒక శాఖను ఏర్పాటుచేశారు. దీనిఉద్దేశ్యం 2026-27 వ సంవత్సరానికి విద్యార్థి మూడవ తరగతికి చేరేనాటికి అవగాహనతో చదవడం, రాయడం, గణిత సామర్థ్యాలు సాధించడంతోపాటు కనీస జీవన నైపుణ్యాల పరిజ్ఞానాన్ని కలిగించడం ఒక ప్రధాన భూమికగా ఎఫ్.ఎల్.యెన్ మిషన్ తన ఉద్దేశ్యంగా తెలియపరచింది. దీనికి పాఠశాలయాజమాన్యాలు సంసిద్ధం కావాలని సూచించింది. ఈ మిషన్‌ద్వారా అందేఫలాలు ప్రాథమిక పాఠశాల పిల్లలు వారి వయసు, తరగతి, సబ్జెక్టుస్థాయి విద్యా సామర్థ్యాలను సాధించడానికి మార్గం సుగమం అవుతుంది. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల సాధనకు ఒక బలమైన కారణం గ్రామీణ, పేద పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యా అవకాశాలు అరుదైన అంశంగా ఉంది. ఎందుకనగా అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య ఒక ప్రధాన భూమిక అయినప్పటికీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం తగిన శిక్షణ ఇచ్చినప్పటికీ సమయం, వారికున్న అదనపు బాధ్యతల నిర్వహణ పూర్వ ప్రాథమిక విద్యవైపు ఎక్కువ సమయాన్ని వెచ్చించడం ఒక పెద్దసవాలుగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతపిల్లలు పూర్వప్రాథమిక విద్యానుభవం లేకపోవడం, ఒకేసారి 1వ తరగతిలో ప్రవేశించడం అనేదిఎంతమాత్రం



పునాది లేని చదువుగా పరిణమించి ప్రాథమిక స్థాయిలో తరగతి వారీ సామర్థ్యాల సాధన ఒక పరీక్షగా పరిణమించింది. ఇది ఉపాధ్యాయులకు కూడా అలవికాని స్థితిలా ఉంది. ఈ పరిస్థితుల దృష్ట్యా పునాది స్థాయి విద్యపటిష్టంగా ఉండాలని నూతన విద్యావిధానం ఐదుసంవత్సరాలు నిడివిగల అనగా పూర్వ ప్రాథమిక లేదా బాలవాటిక లేదా అంగన్‌వాడీ విద్యగా, ప్రిపరేటరీ అనగా సంసిద్ధతా దశగా విభజించారు. ఈ స్థాయిలకు సంబంధించి కరికులం, బోధనాశాస్త్ర వ్యూహాల్లో తగిన మార్పులు అనివార్యం. అందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను, రాష్ట్రస్థాయి కరికులం ఏర్పాటు అనగా స్థానికతను జోడించి వాస్తవాలకు, నిత్య జీవనానికి దగ్గరగా ఉండేలా కరికులాన్ని అనగా పాఠ్య ప్రణాళికలను తయారు చేయడం అనేది చాలా కీలకం. సాధారణంగా పైస్థాయి నుండి పాఠ్యప్రణాళికలు రూపొందించబడేవి. కానీ నూతన విద్యావిధానం 2020 పాఠ్య ప్రణాళికలను కిందిస్థాయి నుండి స్థానికతను జోడించి రచించేలా పూర్తి వెసులుబాటు కల్పించింది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి నూతన ఒరవడిని దిద్దడానికి చాలా సమయం పడుతుంది. దీనికి ప్రభుత్వ ప్రయత్నాలు తగిన వనరులను సమకూర్చడం, పటిష్టమైన కార్యాచరణ దానిఅమలు వంటి కీలక ఘట్టాలు మాత్రమే నూతనవిద్యావిధాన రూపకల్పనకు ఒక స్థిరమైన రూపం ఏర్పడుతుంది. నూతన విద్యావిధానం పాఠశాల విద్యా సవాళ్లకు సమాధానం ఏర్పరస్తుందని తల్లిదండ్రులు, సమాజం ఎంతో ఎదురు చూస్తోంది. అయితే విధాన రూపకల్పన ఎంత ముఖ్యమో దానికి పటిష్టమైన కార్యాచరణ అత్యవసరం. మును పటి సవాళ్లు- కొవిడ్ తర్వాత తోడైన సమస్యలు ప్రభుత్వ యంత్రాంగాలకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు మరింత పెను సవాళ్లుగా పరిణమించాయి. ఈ మధ్యనే మే 2022లో విడుదలైన నేషనల్ అచీవ్మెంట్ సర్వే నివేదిక 2021 ప్రకారం ప్రతివిద్యార్థి ప్రగతి జాతీయ స్థాయిలో ప్రతి సబ్జెక్టులో పై తరగతికి వెళ్తున్నకొద్దీ పిల్లల విద్యాసామర్థ్యాల శాతం ఎక్కువ శాతం తగ్గినట్లు వెలడైంది. అనగా సరాసరి విద్యార్థి స్థాయి ప్రగతి నిర్దేశించిన ప్రగతి ఊచికలో మూడవ తరగతి గణితంలో సాధించిన ప్రగతి 306గా తెలిసింది. ఇక ఐదవ తరగతి గణితంలో మరింత తక్కువ సాధించారు. అనగా 284.గా, ఎనిమిదో తరగతిలో 255కాగా పదవ తరగతిలో 220 స్థాయికి ప్రగతి తగ్గినట్లు నాస్ నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం మౌలిక సదుపాయాలు తగినంత శాతం కల్పించినట్లు నివేదిక వెల్లడించినప్పటికీ ఈ సౌకర్యాలు పాఠశాలల పిల్లల నమోదు, బడికి హాజరయ్యే పిల్లలందరికీ సరిపోతున్నాయా లేదా, నిరంతర మంచినీటి సౌకర్యం ఉందా లేదా మరుగుదొడ్ల నిర్వహణకు సరిపడినంత నీటి సరఫరా, ఇచ్చిన మౌలిక సదుపాయాను మెరుగ్గా వినియోగించుకునేలా పిల్లల్లో ప్రవర్తనా ప్రభావాల్ని అలవరచాలి. అలవరచుకునేలా వారికి చైతన్యాన్ని కలిగించాలి. తద్వారా మౌలిక సదుపాయాలను సంరక్షించుకోవడమే కాదు తగిన ప్రగతి సాధించడానికి ఈ ప్రక్రియలు పాఠశాలకు ప్రగతి మార్గాలనందిస్తుంది. నాణానికి మరొక ముఖ్యమైన కోణం సుస్థిరాభివృద్ధిసూచికల్లో ప్రధానమైన, కీలకాంశం ఏమనగా నాణ్యమైన, సమ్మిళిత విద్య. ఈ దిశగా ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు చేపట్టాలి. విద్యావ్యవస్థకు కొత్త ఊపిరి తేవాలి. బోధనా సిబ్బందిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వివిధ సామాజిక నేపథ్యమున్న విద్యార్థులందరికీ నాణ్యమైన, సమానవిద్యను అందించడంలో అనగా కుల, వర్గ, మత, లింగ, భాష, ప్రాంతీయ, ధనిక, పేద, గ్రామ, పట్టణ, సామాజిక వ్యత్యాసం, దివ్యాంగులు లేదా ఎటువంటి సామాజికపరమైన వివక్ష లేకుండా అందరికి కావలసిన బోధనావ్యూహాలను రచించి విద్యార్థులందరినీ సుశిక్షితులుగా తీర్చిదిద్దాలి. అందుకు ప్రభుత్వాలు నిధులు, విధులు కార్యాచరణలు ముమ్మరంచేయాలి. ప్రతిఅవకాశాన్ని అందిపుచ్చుకుని మరింత ఉత్సాహంతో పిల్లలకోల్పోయిన విద్యాసామర్థ్యాలు పునరుద్ధరించడానికి తగిన వ్యూహాలురచించాలి. ప్రభుత్వం, పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు కలసికట్టుగా కృషిచేయాలి. భారంలేని చదువుతోపాఠశాల పిల్లలనుచక్కదిద్దాలి. అందకు అందరిసహకారం అవసరం. అప్పుడే అనుకున్నఫలితాలు సాధించడం చాలాసులభం. ఈ ప్రయత్నంలో అందరూభాగస్వామ్యంతో ముందుకు సాగితేనేసుస్థిరాభివృద్ధిసూచికలో పొందుపరిచిన ఫలితాలు సాధించడం సులభమవుతుంది. బాలల భవిష్యత్తుకు ఓచక్కటి భరోసాకలుగుతుంది. ●

## మూడు ఈశాన్యరాష్ట్రాల ప్రజలకు ప్రధాని అవతరణదినోత్సవ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, జనవరి 21:** మూడు ఈశాన్యరాష్ట్రాల అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ శనివారం ఆరాష్ట్రాలకు శుభాకాంక్షలు తెలిపారు. త్రిపుర, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాలు జనవరి 21వ తేదినే అవతరించాయి. త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల్లో అభివృద్ధి వేగవంతం అవుతోందని, మేఘాల ప్రజలు విభిన్నరంగాల్లో రాణిస్తున్నారని మోడీ పేర్కొన్నారు. మణి పూర్ రాష్ట్రంలో గడచిన కొన్నేళ్లుగా అన్ని రంగాల్లోను అభ్యున్నతి కనిపిస్తోందని, ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నట్లు భావిస్తున్నానని మోడీ పేర్కొ న్నారు. భారత అభివృద్ధి పథంలో మణిపూర్ మరింత క్రియాశీలకం అవుతుందన్నారు. గడచిన ఏడేళ్ల కాలంలో త్రిపుర అభివృద్ధిలో పలు మార్పులు వచ్చా యని, వ్యవసాయంనుంచి పరిశ్రమలు, విద్య, ఆరోగ్యరంగాలవరకూ ఎంతో పరివర్తన చెందిందని అన్నారు. ఇక మేఘాలయ పరంగా చూస్తే మరింతగా సంస్కృతిపరంగా విలసిల్లుతోందని సంగీతం, క్రీడల్లో మేఘాలయ మరింత చురుకుగా ఉందన్నారు. విభిన్నరంగాల్లో మేఘాలయ పౌరులు రాణిస్తున్నారని, రానున్న సంవత్సరాల్లోకూడా మేఘాలయ మరింత ప్రగతిని సాధించగలదని ప్రధాని ఆకాంక్షించారు.

## బ్రిజ్‌భూషణ్‌పై రెజ్లర్ల ఆరోపణలు నిరాధారం

### క్రీడాశాఖకు రెజ్లింగ్ సమాఖ్య వివరణ



**న్యూఢిల్లీ, జనవరి 21:** భారత రెజ్లింగ్ సమాఖ్య క్రీడాకారులపై లైంగిక వేధింపులు కొనసాగుతు న్నాయన్న ఆరోపణలను ఖండించింది. అంతేకా కుండా ఇవన్నీ అవాస్తవాలని అన్ని ఆరోపణలను తిరస్కరించింది. తమ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై వచ్చిన ఆరోపణలు నిరాధారమని ఖండించింది. యాజమాన్య లోపాలు, నిర్వహణాలోపాలు, ఏకపక్ష నిర్ణయాలు ఉండనే ఉండవని డబ్ల్యుఎఫ్ఐ స్పష్టం చేసింది. సమాఖ్యను ఒక నిర్దిష్టమైన రాజ్యాంగంప్రకారం నిర్వహిస్తామని, ఎన్నికయిన కార్యవర్గం నిబంధనలకు లోబడి వ్యవహరిస్తుందని ఏలాంటి ఏకపక్ష నిర్ణయాలు, నిర్వహణ లోపాలు ఉండవని ఏ ఒక్క వ్యక్తిపైనే ఆధారపడి పనిచేయదని అది అధ్యక్షుడయినా మరెవ్వరయినాసరే సమాఖ్య నిబంధనలకు లోబడి మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపింది. సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై వినేష్ ఫొగాట్, బజరంగ్‌పునియా, సాక్షి మాలిక్, రవిదహియాలు ఆరోపణలుచేసిన సంగతి తెలిసిందే. ఈ నిరసనలపై క్రీడా మంత్రిత్వశాఖ నోటీసులు జారీచేసి 72 గంటల్లోపు వివరణ ఇవ్వాలని కోరింది. దీనిపై స్పందించిన సమాఖ్య ఎలాంటి వేధింపులు ఉండవని, ఆరోపణలు అర్థరహితమని వెల్లడించింది. అంతేకా కుండా ఈ రెజ్లర్ల సమాఖ్య తమ వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూస్తూ తమను వేధిస్తోందని ఒలింపిక్స్‌కు వెళితే మాకు ఫిజియోకాని కోచ్‌కాని లేరని, మా వాణిని వినిపిస్తే మమ్మల్ని బెదిరించారని రెజ్లర్లు పేర్కొన్నారు. ఒలింపిక్ పతక విజేత పునియా మాట్లాడుతూ సమాఖ్య పాలకవర్గాన్ని రద్దుచేసి కొత్త కార్యవర్గంతో భర్తీచేయాలని కోరారు. ఏ ఒక్క యువతి అయినా తనపై ఆరోపణలకు ముందుకువస్తే తాను ఉరేసుకుంటానని ఆరుసార్లు ఎంపి అయిన సింగ్ చెప్పారని, అయితే ఇద్దరు బాలికలు ఇపుడు ముందుకు వచ్చారని ఆధారాలతో ఉన్నారని పూనియా గుర్తుచేసారు. నిరసనకారులకు బిజెపి నేత, కుస్తీ క్రీడాకారిణి బబితా ఫొగాట్‌మద్దతు కూడా లభించింది. కేంద్ర క్రీడామంత్రి అనురాగ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఢిల్లీలో తాను నిరసన చేస్తున్న క్రీడాకారులను కలుస్తానని చెప్పారు. రెండు సార్లు ప్రపంచ పతక విజేత, మూడుసార్లు కామన్వెల్త్ ఛాంపియన్ వినేష్ ఫొగాట్ మా డిమాండ్లను పట్టించుకోని పక్షంలో పోలీసులను సంప్రదిస్తామని ఇప్పటి వరకూ ఇద్దరు బాలికలమేనని ఇపుడు ఐదారుగురు బాలికలు ముందుకువచ్చి ఆధారాలను బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికీ తమ డిమాండ్లను పట్టించుకోనిపక్షంలో పోలీసులను సంప్రదించి ఆదిశగా ముందుకు పోతామని హెచ్చరించారు.

## బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు జరిమానా విధించిన పోలీసులు



**లండన్, జనవరి 21:** బ్రిటన్‌ప్రధాని రిషిసునాక్‌కు ఆ దేశ పోలీసులు జరిమానా విధించారు. కారులో సీటుబెల్ట్ ధరించనందుకు 100 పౌండ్ల ఫైన్ విధించినట్లు లంకాషైర్ పోలీసులు తెలిపారు. ఓ ప్రచార కార్యక్రమం కోసం ఇంగ్లాండ్ వాయువ్యప్రాంతంలో కారులో ప్రయాణిస్తున్న సమయంలో వీడియో చిత్రీకరిస్తుండగా రిషి సునాక్ సీటు బెల్టు తొలగించారు. ఆ వీడియో వైరల్ కావడంతో వివాదం మొదలైంది. ప్రధానిలాంటిబాధ్యతాయుత మైన పదవిలోఉన్నవ్యక్తి నిబంధనలు పాటించకపోవడం సాధారణ పౌరులకు తప్పుడు సందేశమిస్తుం దంటూ నెటిజన్లు విమర్శలు గుప్పించారు. దాంతో, బ్రిటన్‌ప్రజలకు రిషిసునాక్ క్షమాపణలు తెలిపారు. సీటు బెల్టు ధరించకుండా ప్రయాణించడం తప్పేనని ఒప్పుకున్నారు. ప్రతి ఒక్కరూ సీటుబెల్టు ధరించాలని సూచించారు. బ్రిటన్ చట్టాల ప్రకారం కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటుబెల్టు ధరించాలి. అత్యవసర వైద్యం పొందాల్సిన వ్యక్తి మినహా ప్రతి ఒక్కరూ ధరించాల్సిందే. ధరించనివారికి భారీగా జరిమానా విధిస్తారు. సీటుబెల్టు ధరిం చకుండా పట్టుబడ్డ అక్కడికక్కడే 100 పౌండ్ల ఫైన్ కట్టాలి. కోర్టుదాకా వెళ్తే 500 పౌండ్ల వరకూ జరిమానా ఉంటుంది.

## జమ్మూలో రోడ్డు ప్రమాదం ఐదుగురి మృతి, 15మందికి గాయాలు



**కతువా, జనవరి 21:** జమ్మూకాశ్మీర్ కతువా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, 15మంది గాయపడ్డారు. ధనూ పెరోల్ ప్రాంతంలో ఓ టెంపో లోయలోకి పడటంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో చనిపోయినవారి మృత దేహాలను స్థానికులతో కలిసి పోలీస్, సహాయక బృందాలు బయటకు తీశాయి. గాయపడినవారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కౌగ్ నుంచి ధనూ పెరోల్‌కు ప్రయాణీకులతో వెళ్తున్న టెంపో 150 మీటర్ల లోతైన లోయలోకి జారి పడింది. దాంతో, అందులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఐదుగురు చనిపోగా, మిగతా వారిని బిల్లావర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పొగమంచు వల్ల దారి సరిగ్గా కనిపించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది.

## 'వందేభారత్'పై మరోసారి రాళ్ల దాడి



**పాట్నా, జనవరి 21:** వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై మరోసారి రాళ్ల దాడి జరిగింది. తాజా రాళ్ల దాడి బీహార్‌లోని కతిహార్ జిల్లాలో జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన రాళ్ల దాడిలో రైలు అద్దం పగిలింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణీకులెవరికీ గాయాలు కాలేదని రైల్వే అధికారులు తెలిపారు. న్యూజల్పాయిగురి నుంచి శుక్రవారం సాయంత్రం 3 గంటలకు వందేభారత్ రైలు బయలుదేరింది. సాయంత్రం4.25 సమయంలో బీహార్‌లోని డకోలా, టెల్టా స్టేషన్ల మధ్య రాళ్ల దాడి జరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో సి 6 బోగీలో ఓ అద్దం పగిలిందని తెలిపారు. ఈ ఘటనపై డకోలా రైల్వే పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. డిసెంబర్ 30న ఈ రైలు ప్రారంభం కాగా రెండు రోజుల్లోనే వరుసగా రెండు రాళ్ల దాడి ఘటనలు జరిగిన విషయం తెలిసిందే. వాటిలో ఒకటి బెంగాల్‌లో జరగగా, మరొకటి బీహార్‌లో జరిగింది. ఇప్పుడు మూడోది కూడా బీహార్‌లోనే జరగడం గమనార్హం. ఇటీవల సికింద్రాబాద్, విశాఖ వందే భారత్ రైలుపైనా ప్రారంభానికి ముందే విశాఖలో కొందరు రాళ్లు రువ్విన ఘటన జరిగింది.



## జమ్మూలో జంట పేలుళ్లు , 9మందికి గాయాలు

### రాహుల్ యాత్రకు మరింత భద్రత

**శ్రీనగర్,జనవరి 21:** జమ్మూలోని నర్వాల్‌లో శనివారం ఉదయం జంట పేలుళ్లు జరిగాయి. ఈ పేలుళ్లలో 9మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ట్రాన్స్‌పోర్టునగర్ యార్డ్ నెంబర్ 7లో 15 నిమిషాల వ్యవధిలో రెండు పేలుళ్లు జరిగాయి. మొదటి పేలుడు 10..45 సమయంలో జరిగింది. మరమ్మతుల కోసం తెచ్చిన ఓ వాహనంలో మొదటి పేలుడు జరిగినట్లు జస్వీందర్‌సింగ్ అనే ప్రత్యక్ష సాక్షి తెలిపారు. గాయపడినవారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటనా ప్రాంతంలో భద్రతా బలగాల పర్యవేక్షణలో ఫోరెన్సిక్ నిపుణులు, క్లూస్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. పేలుడు జరిగిన నర్వాల్ ప్రాంతం రోజంతా రద్దీగా ఉంటుందని, అక్కడ వాహనాల క్రయవిక్రయాలు జరుగుతాయని స్థానికులు తెలిపారు. పేలుళ్ల వెనక ఏదైనా ఉగ్ర సంస్థ ఉన్నదా..? అన్నది ఇంకా తేలలేదు. జమ్మూలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర జరుగుతుండటంతో అప్రమత్తమైన పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రస్తుతం భారత్ జోడో యాత్ర జమ్మూకు 60 కిలోమీటర్ల దూరంలో చద్వాల్ వద్ద కొనసాగుతోంది. శుక్రవారం యాత్ర ప్రారంభించిన రాహుల్ శనివారం బ్రేక్ ఇచ్చారు. తిరిగి ఆదివారం యాత్ర ప్రారంభం కానున్నది. జనవరి 30 వరకెల్లా యాత్రను పూర్తి చేయాలని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. భద్రత దృష్ట్యా యాత్రను ఏ మార్గంలో నిర్వహించాలనేది అధికారులకే కాంగ్రెస్ వర్గాలు వదిలేశాయి. అయితే, రెండు, మూడు మార్గాలను కాంగ్రెస్ నేతలు సూచించారు.

## ఈశాన్యంపై ఫోకస్ పెంచిన టిఎంసి అధినేత్రి

### మూడు రాష్ట్రాల ఎన్నికలకు వ్యూహాలు షురూ

**కోల్‌కత్తా, జనవరి 21:** ఈశాన్యప్రాంతంలోని మూడురాష్ట్రాల్లోఎన్నిక నగారా మోగడంతో ఈశాన్యంలో కీలకం అవుతున్న తృణమూల్‌కాంగ్రెస్ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతోంది. టిఎంసి సుప్రీమో, బెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈమేరకు ఎన్నికల వ్యూహాలనుప్రారంభించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఐకమత్యంతో ఉండాలన్న ఏకైకనినాదంతో పోరాడి గెలిచారు. రెండేళ్ల తర్వాత ఇపుడు ఆమె తప్పని తెలుసుకున్నారో ఏమో కానీ ఇపుడు మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల్లో తమ పార్టీ పట్టును పెంచాలని నిర్ణయించారు. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసి ఓటమి చవిచూసింది. పార్టీ అంతర్గత వ్యూహాలు కేవలం పశ్చిమ బెంగాల్‌కే పరిమితం అయ్యాయి. రాష్ట్రం బయట కేడర్‌ను పెంచుకోలేక పోయింది ఇపుడు జాతీయ స్థాయికి ఎదగాలన్న ఆకాంక్ష పార్టీలో



పెరిగింది. అందుకు ఈశాన్యం రూటును ఎంచుకుంది. తూర్పువైపునే ఉన్న పార్టీ ఇపుడు ఈశాన్యరాష్ట్రాల్లో ఓటుబ్యాంకును పెంచుకోవడంద్వారా జాతీయ పార్టీ ముద్రపొందాలనిచూస్తోంది త్రిపురలో బెంగాలీజనాభా ఎక్కువమందే ఉంటారు. ఈరాష్ట్రం ఈఏడాదిఎన్నికలకు వస్తోంది. అలాగే మేఘాలయ, నాగాలండ్ రాష్ట్రాల్లోకూడా ఎన్నికలు జరుగుతాయి. ఫిబ్ర వరి, మార్చి నెలల్లో జరిగే ఎన్నికల్లో ఓటుబ్యాంకునుపటిష్టంచేసుకోవడంతోపాటు గణనీయంగా స్థానాలు గెలుచుకునేదిశగా మమతా ప్రణాళికలున్నాయి. ఇక మిజోరమ్ ఎన్నికలు ఈ ఏడాదే తర్వాత జరగనున్నాయి. ఈసారి టిఎంసి మేఘా ల యపై ఫోకస్ పెంచింది. లోక్‌సభ మాజీ స్పీకర్ తనయుడు ముకుల్ సంగ్మా మేఘాలయలో ప్రనముఖనేతగా కొనసాగుతున్నారు. టిఎంసి తర పున ఇపుడు మేఘాలయలో కీలకం అవుతున్నారు. ఇందుకు మమతా మేనల్లుడు అభిషేక్ పావులు కదిపారు. టిఎంసిలో ఇపుడు మేఘాలయకు చెందిన భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు టిఎంసిలో చేరారు. మేఘాలయలో ఇపుడు టిఎంసి నంబర్‌టూ స్థానంలో ఉంది. దివంగత పిఎ సంగ్మా మమతాకు రాజకీయాల్లో సమకాలికుడు. ముందు టిఎంసిలో చేరి ఆ తర్వాత ఎన్‌సిపిలో చేరి మళ్లీ టిఎంసికే వచ్చారు. ఇపుడు అభిషేక్ జూనియర్ సంగ్మాతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. టిఎంసికి ఈ తీరు ఎంతో లాభదాయకమని అంచనా. అయితే టిఎంసి రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ స్థానం ఆక్రమిస్తుందా బిజెపికి లాభిస్తుందా అన్నది తేలాల్సి ఉంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అక్కడ వేగంగాప్రచారం చేసారు. ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పూర్తిగా క్షీణించి బిజెపికి అనూహ్య మెజార్టీని తెచ్చిపెట్టింది. కాంగ్రెస్ ఈ అంశాన్ని బాహాటంగానే వెల్లడించింది. ఇక త్రిపులో కూడా టిఎంసికి అంచనాలుభారీగానే ఉన్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువ ఉంది. ముఖ్యమంత్రిగా బిప్లబ్‌కుమార్‌దేవ్ హయాంలో అసమ్మతిపెరిగింది. పార్టీ కాంగ్రెస్‌పరంగా సుదీప్‌రాయ్‌బర్మన్ టిఎంసిలో చేరేందుకు సిద్ధం అవుతున్నారు. బిజెపిని ఢీకొనే సమర్థత ఆయనకే ఉందని టిఎంసి విశ్వసిస్తోంది. అయితే సుదీప్ టిఎంసిలో చేరేందుకు ఇష్టంగా లేరు. బిజెపినుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆయన ఇపుడు కాంగ్రెస్, సిపిఎం, గిరిజనపార్టీ, టిప్రా మోతాలతో కలిసి ఎన్నికల అవగా హనకు వస్తున్నారు. ఇక నాగాలండ్ పరంగాచూస్తే టిఎంసికి అంతగా ఆలోచనలేనట్లే ఉంది. టిఎంసి వర్గాల కథనం ప్రకారం ప్రస్తుతం మేఘాలయ, త్రిపురలపైనే ఫోకస్ పెట్టినట్లుతెలుస్తోంది.

## షారూక్ ఎవరు..పఠాన్ ఏమిటి?

### అసోం సిఎం ప్రశ్నలతో అవాక్కయిన మీడియా

**గువాహతి, జనవరి 21:** షారూఖ్‌ఖాన్ ఎవరు? ఆయన గురించి నాకేమి తెలియదు. అతని సినిమా పఠాన్ అంటున్నారు ఆవిషయమే తెలియదు అని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమాధానం మీడియాను ఆశ్చర్యానికి గురిచేసింది. మీడియా సమావేశంలో ప్రతినిధులు బజరంగ్‌దళ్ కారకర్తలు పఠాన్ సినిమాపై తీవ్రస్థాయి నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్న ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. నగరంలోని నారెంగిలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు నిరసనలపై అడిగినప్రశ్నలకు ఆయన వింతైన సమాధానం ఇచ్చారు. హిందూ ఆతివాద సంస్థల నేతలు ఈ చిత్రం పోస్టర్లను చించివేసారు. నారెంగిలోని



ధియేటర్‌వద్దకు చేరుకునన కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఖాన్ ఎవరో తనను ఇప్పటి వరకూ కల వలేదు. నన్ను సంప్రదించలేదు. బాలివుడ్‌నుంచి అనేకమంది తనను సం ప్రదిస్తుంటారు. ఇక ఈ సమస్య అంటారా తనను కలిస్తే తాను ఈ సమ స్యను పరిశీలిస్తానని చెప్పారు. శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే చర్యలు తప్ప కుండా ఉంటాయని కేసులు నమోదుచేస్తామని చెప్పారు. బాలివుడ్ మెగాస్టార్ షారుక్‌ఖాన్ ఆయన సినిమా పఠాన్ చిత్రాలు దీపికాపదుకోణె కాషాయం బికిని ధరించి బేషరమ్ రంగ్ పాటలో పాల్గొనడంపై తీవ్ర నిరసన వ్యక్తంచేస్తూ ఆర్ఎస్ఎస్ భజ రంగ్‌దళ్ సంస్థలు నిరసన ప్రదర్శనలుచేసాయి. సినిమాను ప్రదర్శించనీయబోమని హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే.

విశ్వహిందూపరిషద్‌కు చెందిన నాయకులు కూడా ఈచిత్రాన్ని నిషేధిం చాలని కోరారు. దీనిపై మీడియా ప్రతినిదులు అస్సాం సిఎంతో మాట్లాడుతూ షారూఖ్ ఖాన్ బాలివుడ్ సూపర్‌స్టార్ అని చెప్పారు. దీనిపై సిఎం స్పందిస్తూ తమకు అస్సామీస్‌కు సంబంధించి మాత్రమే తెలుసని, హిందీచిత్రాలగురించి కాద న్నారు. అస్సామీచిత్రం డాక్టర్ బెజ్ బారువా పార్ట్2ను దివంగత నిప్పన్ గోస్వామిపై చిత్రీకరించారని, సత్వరమే విడుదలవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ చూడాలని ఆయన కోరారు.

## రేప్‌బాధితురాలి వైద్యపరీక్షల్లో కావాలనే జాప్యం!

### 12 గంటలపాటు పోలీసులతోపాటే వైద్యకేంద్రంలో నిరీక్షణ

**కియోంఝర్(ఒడిశా), జనవరి 21:** రాష్ట్రంలోని కియోంఝర్‌జిల్లాలో జరిగిన సామూహిక అత్యాచారం బాధితురాలికి వైద్యపరీక్షలకోసం పోలీసులు బాధితురాలితోపాటు 12 గంటలపాటు వేచి ఉండాల్సి వచ్చింది. 37 ఏళ్ళ బాధిత మహిళను పోలీసులు తమ వ్యాన్‌లో స్థానిక ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ఆమెకు పరీక్షలునిర్వహించేందుకు తిరస్కరించారు. ఆమెపై అత్యాచారం జరిగిన ప్రాంతం మరొక కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రంపరిధిలోకి వస్తుందని, తమ పరిధి కాదని వాదించి తిరస్కరించారు. దీనితోపోలీసులు ఆ మహిళను ఇతర ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. మహిళా డాక్టర్ లేకపోవడంతో బాధితురాలు పోలీస్ వ్యాన్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. దీనితోపోలీసులు మళ్లీ ఆమెను మొదటి ఆసుపత్రికే తీసుకుని వచ్చారు. డాక్టర్లు ఉదయం నుంచి వేచి ఉన్న ఆమెకు రాత్రి 9.30 గంటలప్రాంతంలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. రాత్రివేళల్లో పూర్తిస్థాయి పరీక్షలు చేయడం వీలుపడదని అందువల్ల మరుసటిరోజు రమ్మన్నారని బాధితురాలు చెప్పింది. మరుసటిరోజు అంటే 12 గంటల తర్వాత ఆమహిళకు పూర్తి వైద్యపరీక్షలునిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా వైద్యులులేని ఆసుపత్రికి పంపించారని, చెప్పుకోలేని సమస్యలు కూడా ఎదుర్కొన్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ఉద్దేశ్యపూర్వకంగానే వైద్యపరీక్షల్లో జాప్యంచేసారని చెప్పలేమని అయితే బాధితురాలు 12 గంటలపాటు వేచి ఉండాల్సి వచ్చిందని చెప్పారు. 40 కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ ఆసుపత్రినుంచి బాధితురాలిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు తీసుకువస్తే రాత్రి 9.30 గంటలకు పరీక్షలుచేసారని, ఉద్దేశ్యపూర్వకంగానే ఇలా జరిగిందని అన్నారు. కియోంఝర్ సిఎంఒ కిశోర్‌చంద్ర ప్రుష్టిని సంప్రదిస్తే ఆయన శెలవులో ఉన్నారు. ఇతర సీనియర్ అధికారులు స్పందించేందుకు నిరాకరించారు. ఈనెల 18వ తేదీ ఈమహిళపై సామూహిక అత్యా చారం జరిగింది.

## నేపాల్- భారత్‌సరిహద్దులో బస్సు ప్రమాదం 60 మందికి గాయాలు

**ఖాట్మండు, జనవరి 21:** నేపాల్‌తో భారత్‌సరిహద్దుకు 500 మీటర్ల దూరంలోజరిగిన బస్సు ప్రమాదంలో 60 మంది ప్రయాణీకులు గాయపడ్డారు. నేపాల్‌లోని త్రివేణిధామ్‌ను సందర్శించి భారత్‌కు తిరిగి వస్తున్న ప్రయాణీకుల బస్సు అదుపు తప్పి ఒక గోతిలోపడి తల్లకిందులు కావడంతో బస్సులో ప్రయాణీకులు గాయపడ్డారు. నేపాల్‌నుంచి సు మారు 70 మంది భక్తులు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌జిల్లా పిపిగంజ్, కంపిర్‌గంజ్‌ప్రాంతంనుంచి త్రివేణిధామ్ సందర్శనకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈప్రమాదం జరిగింది. భారత్ నేపాల్ సరిహద్దుల్లోని తుథిబరి సరిహద్దు వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. నేపాల్ పోలీసులు వెంటనే ఈప్రాంతానికి చేరుకుని గాయపడిన వారిని పృథ్వీచంద్ జిల్లా ఆసు పత్రికి తరలించారు. నేపాల్‌లోని నవాల్ పరాసి జిల్లా కేంద్రంలో ఈ ఆసుపత్రికి వెనువెంటనే తరలించి చికిత్సలు ప్రారంభించారు. యుపి మహారాజ్‌గంజ్ జిల్లాకలెక్టర్ నేపాల్ అధికారులతో మాట్లాడి సాయం కోరారు. అలాగే యుపినుంచి అధికారుల బృందాన్ని కూడా పంపించి గాయపడిన వారిని క్షేమంగా తీసుకువచ్చే ఏర్పాట్లుచేసారు.



## 93వయేట నాలుగో పెళ్లి చేసుకున్న అమెరికా వ్యోమగామి ఆల్డ్రిన్

### చంద్రుడిపై కాలుమోపిన రెండో వ్యక్తి

**వాషింగ్టన్, జనవరి 21:** చంద్రుడిపై కాలుమోపిన ముగ్గురు అమెరికా వ్యోమగాముల్లో రెండో వ్యక్తిగా పేరున్న బజ్ ఆల్డ్రిన్ తన 93వయేట నాలుగో పెళ్లి చేసుకున్నారు. అంటే..ఆయనకు అంతకుముందు మూడు వివాహాలు జరిగి, వారి నుంచి విడాకులు పొందారు. తన చిరకాల ప్రేయసి డాక్టర్ అంకా ఫౌర్‌ను తన పుట్టిన రోజే వివాహం చేసుకున్నానని ట్విట్టర్ ద్వారా ఆల్డ్రిన్ వెల్లడించారు. అంకా ఫౌర్‌కు 63 ఏళ్లు. ఆమె ఓ రసాయనిక కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. జనవరి 20న లాస్ ఏంజెల్స్‌లో తన కుటుంబసభ్యులు, సన్నిహితుల మధ్య నిరాడంబరంగా వివాహం జరిగిందని ఆల్డ్రిన్ పేర్కొన్నారు. తనకు ఈ వివాహం టీనేజీలో ఇంట్లోంచి వెళ్లిపోయి రహస్యంగా పెళ్లి చేసుకున్నంత ఉత్సాహాన్నిచ్చిందని ఆల్డ్రిన్ ట్వీట్‌చేశారు. ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. 1969 జులై 20న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) చేపట్టిన మానవసహిత చంద్రమండల యాత్రలో పాల్గొన్న ముగ్గురిలో ఆల్డ్రిన్ కూడా ఒకరు. అపోలో 11వ్యోమనౌకలో తోటి వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మైఖేల్ కోలిన్స్‌తో ఆల్డ్రిన్ చంద్రుడిపైకి వెళ్లారు. చంద్రుడిపై మొదటిసారిగా కాలుమోపిన ఆర్మ్‌స్ట్రాంగ్, తర్వాత 19 నిమిషాలకు ఆల్డ్రిన్ చంద్రుడిపై అడుగుపెట్టారు. చంద్రుడిపై కాలుమోపిన ఆ ముగ్గురు వ్యోమగాముల్లో ప్రస్తుతం జీవించి ఉన్న వ్యక్తి ఆల్డ్రిన్ ఒక్కరే అన్నది గమనార్హం.





## నాలుగేళ్లలో 42 మంది పాక్ జర్నలిస్టుల హత్య

**ఇస్లామాబాద్, జనవరి 21:** పాకిస్థాన్‌లో గడచిన నాలుగేళ్ల కాలంలో 42 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని పాకిస్థాన్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ముర్తాజా జావేద్ అబ్బాసి సెనేట్‌కు తెలిపారు. మంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంప్రకారం హత్యకు గురయిన 42 మందిలో 15 మందిని పంజాబ్‌లోను, 13మందిని ఖైబర్‌ఫఖ్తూన్‌క్వాలోను, 11 మందిని సింధుప్రాంతంలోను, మరో ముగ్గురిని బెలూచిస్తాన్‌లోను హత్యచేసినట్లు తెలిపారు. ఎక్కువ కేసుల్లో జర్నలిస్టులను కాల్చిచంపారని, అత్యధికంగా ఉగ్రవాదులే ఈ ఘాతుకాలకు పాల్పడ్డారని వారిలో ఇప్పటికీ కొందరి ఆచూకీ తెలియడంలేదన్నారు. పంజాబ్‌లో ఏడుగురు అనుమానితులను అరెస్టు చేసామని, ప్రస్తుతం వారిలో ఇద్దరు బెయిల్‌పై ఉన్నారన్నారు. ఐదుగురిపైనా విచారణ కొనసాగుతోందని, మరో ఎనిమిది మంది అనుమానితులు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల్లో ఒకరిని కోర్టు విడుదలచేసిందని అబ్బాసి తెలిపారు. సింధ్‌ప్రాంతంలో నలుగురిని అరెస్టుచేసామని, మరో ఏడుగురు విచారణ ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఖైబర్‌ఫఖ్తూన్‌క్వాలో ఇద్దరు అనుమానితులపై కేసు కొట్టివేసినట్లు తెలిపారు. మరో నలుగురు విచారణ ఎదుర్కొంటున్నారని, ఒక అనుమానితుడు ఇప్పటికీ పరారీలో ఉన్నట్లు తెలిపాఉ. అదేవిధంగా బెలూచిస్తాన్‌లో ఇద్దరు తప్పించుకున్నారని, ఒకరిపై విచారణ జరుగుతోందని, మరొకరి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. సెనేట్‌సభ్యుడు జమాత్‌ఇస్లామి ఎంపి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వం జర్నలిస్టుల పరిరక్షణలో విఫలం అయిందని నిందితులను సకాలంలో పట్టుకుని ఉంటే అర్షాద్ షరీఫ్ వంటివారు చనిపోయేవారు కాదని చెప్పారు. మంత్రి అబ్బాసీ మాట్లాడుతూ జర్నలిస్టులకు సరైన రక్షణ కల్పిస్తున్నామని, సకాలంలో జోక్యం చేసుకుని కఠిన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు.



## ఒక్కరోజులో కరోనా కేసులు 130, మృతి ఒకరు

### దేశంలో మొత్తం బాధితులు 4,46,81,781

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి21:** భారత్‌లో కరోనావ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 130 కేసులు నమోదయ్యాయి. మృతి నమోదు కాలేదు. ఇప్పటి వరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,46,81,781కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖవెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,49,111 మంది కోలుకోగా 1940మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,730కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది.దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది.మహారాష్ట్రలో కరోనాపాజిటీవ్ కేసులసంఖ్య 81,37,023కి చేరగా,79,88,488మంది వరకు కోలుకున్నారు. 1,48,420మందిప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా కేసుల సంఖ్య 68,29,399కి చేరింది.అందులో 67,56,582మంది కోలుకున్నారు.71,571మంది మరణించారు. కర్ణాటకలో పాజిటీవ్ కేసులసంఖ్య 40,72,643చేరింది.అందులో 40,32,204 మంది కోలుకున్నారు.40,309మందిమరణించారు. తమిళనాడులో కరోనా బాధితులసంఖ్య35,94,593కిచేరింది. అందులో 35,56,501మంది కోలుకున్నారు.38,049 మంది మరణించారు.

## ప్రతి పదిలక్షలజనాభాలో 87వేల మందికి కరోనా

### ప్రపంచంలో 67.29 కోట్లకు పెరిగిన వైరస్‌కేసులు

### 67.42 లక్షలకు చేరుకున్న కరోనా మృతులు

**జెనీవా, జనవరి 21:** ప్రపంచదేశాల్లో కరోనా జాడ ఇప్పటికీ అంతరించిపోలేదు. కొత్తకొత్త వేరియంట్లు, ఉపవేరియంట్లరూపంలో జనాన్ని కాటేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా శనివారం నాటికి మొత్తం 67.29 కోట్లమందికి కరోనాసోకి 67.42 లక్షలమంది చనిపోయారు. మరో 44,645 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 64.45 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.16 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాడుతున్నారు. ప్రతి పదిలక్షల జనాభాలో 87వేలమందికికరోనాసోకుతుంటే 865మందిచనిపోతున్నట్లు సర్వేలు చెపుతున్నాయి.యూరోపియన్‌దేశాల్లో మొత్తం 24.42 కోట్లమందికికరోనాసోకి 19.98 లక్షలమందిచనిపోయారు. మరో 6808 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 23.96 కోట్లకుపైగా నమోదుకాగా మరో 25.72 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 12.29 కోట్లమందికి కరోనాసోకి వారిలో 15.91 లక్షలమందిచనిపోయారు. మరో 9353 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 11.76 కోట్లకుపైగా నమోదుకాగా మరో 36.36 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.17 కోట్లమందికికరోనాసోకి వారిలో 15.24 లక్షలమందిచనిపోయారు. మరో 17,261 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 19.61 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.41కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.75 కోట్లమందికి కరోనాసోకి వారిలో 13.45 లక్షలమందిచనిపోయారు. మరో 10,276 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 6.54కోట్లకుపైగా నమోదుకాగా మరో 7,52,588 మందిపరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.27 కోట్లకుపైగా కరోనా సోకి వారిలో 2,58,439 మందిచనిపోయారు. రికవరీలు 1.20 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,54,120 మంది ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. 19 ద్వీపకల్పదేశాల పరంగాచూస్తే మొత్తం 1.38కోట్లకుపైగా బాధితులున్నారు. వారిలో 24,604 మందిచనిపోయారు. రికవరీలు 1.36 కోట్లకుపైగా నమోదయితే మరో 1,69,654 మంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటం చేస్తున్నట్లు నివేదికలు ప్రపంచ ఆరోగ్యసంస్థకు వెళ్లాయి.



చెరువులో దొరికిన ఆధార్‌కార్డులు తదితరాలు

## పోస్టల్ డిపార్ట్‌మెంట్‌పై కలెక్టర్ సీరియస్

### నాగసాల చెరువులో ఆధార్‌కార్డులు లభ్యంపై ఆరా

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి 21, ప్రభాతవార్త:** జడ్చర్ల పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై మహబూబ్‌నగర్ కలెక్టర్ సీరియస్ అయ్యారు. ప్రజలకు చేరవేయాల్సిన వందలాది ఆధార్, ఏటీఎం కార్డులు, ఇతరత్ర విలువైన పత్రాలు చెరువులో వేయడంపై సర్వత్రా చర్చనీ యాంశమైంది. వివరాల్లోకి వెళ్తే..మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని నాగసాల చెరువులో విలువైన వందలాదిగా ఆధార్, ఏటీఎం,కోర్టు సమన్లు, లైసెన్సులు, ఇతర విలువైన కార్డులు కుప్పకుపలుగా చెరువులో తేలియాడుతూ కనిపించడంపై సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలు వైరల్ అయ్యాయి. ఈ విషయం కలెక్టర్ వెంకట్రావు దృష్టికి వెళ్లడంతో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎంతో విలువైన ఖర్చుతోతో వ్యయ ప్రయాసాతలో కూడు కున్న కార్డులను అలా నిరుపయోగంగా పారేయడంపై సీరియస్ అయ్యారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. దీంటో వెంటనే సంబంధిత పోస్టల్, రెవెన్యూ సిబ్బంది కార్డులను స్వాధీన పర్చుకున్నారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంఘటనా స్థలానికి విచారణ చేపట్టా రు. పూర్తిస్థాయిలో విచారణచేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## విద్య, వైద్యం, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలి

### ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** వచ్చే 2023-24 వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలకు అధిక నిధులు కేటాయించాలని, అదే సమయంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలుపై దృష్టి సారించాలని, అదే సమయంలో వాటి అమలులో ఉన్న లోపాలు, లొసుగులను ఎత్తి చూపుతూ వాటిని సరిదిద్దాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జిజి) సూచించింది. ఈ మేరకు రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల విషయమై ఆర్థిక మంత్రి హరీష్‌రావుకు ఎఫ్‌జిజి కార్యదర్శి ఎం పద్మనాభరెడ్డి రాసిన ఒక లేఖలో పలు సూచనలు, సలహాలు చేశారు. విద్య శాఖకు కేటాయిస్తున్న నిధులు జీతభత్యాలకే సరిపోవడం లేదని, మంచి నీరు, మరుగుదొడ్లు, ప్రహారీగోడలు వంటి మౌలిక సదుపాయాలు లేక విద్యాలయాలు శిధిలావస్థలో ఉన్నాయని, మన ఊరు-మన బడిలో ఒక బడిని కూడా బాగు చేయలేదని, వీటికి రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, పరికరాలు, డాక్టర్ల కొరత వంటి వాటిని తీర్చాలని, ఇందుకు మొత్తం బడ్జెట్‌లో 10 శాతం తక్కువ కాకుండా కేటాయింపులు జరపాలని సూచించారు. అలాగే పంచాయితీలు, మున్సిపాలిటీలకు ఒక హక్కుగా అధిక నిధులు కేటాయించాలని, వాటికి విడుదల చేయాల్సిన బకాయిలను చెల్లించాలని అందుకు 25 శాతం శాతం నిధులు కేటాయించాలన్నారు. ఇక రైతు బంధు మంచి కార్యక్రమం అయినా దీన్ని చిన్న, సన్నకారు, మధ్య తరగతితో పాటు, 10 ఎకరాలు లోపు ఉన్న రైతులకు మాత్రమే వర్తింప చేయాలని, వ్యవసాయ పెట్టుబడికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని చెప్పారు. అలాగే నీటిపారుదల శాఖకు ఒక ఏడాది సెలవు ప్రకటించి, పెండింగ్, ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల డిపిఆర్‌లు, పెండింగ్ అనుమతులు తీసుకున్న తదుపరే పనులు మొదలు పెట్టాలన్నారు. దళిత బంధు ఒక చక్కటి కార్యక్రమమని, అయితే ఇందులో చాలా లోపాలు ఉండడంతో అనుకున్న ఫలితాలు రావడం లేదని, అక్రమాలు, లోపాలను సరిదిద్దాలని తెలిపారు. రంజాన్, క్రిస్మస్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బతుకమ్మ చీరలు వంటి ఉచితాలపై చేసే ఖర్చును నిలిపివేయాలన్నారు. పెట్రోలు, డీజిల్‌పై పన్ను తగ్గించాలని, మద్యం విచ్చలవిడి లభ్యతపై నిషేధం ఉండాలని, రైతు బీమాను నిలిపివేసి, పంటల బీమాను అమలు చేయాలని, ప్రభుత్వ భూములను అమ్మ రాదని, బడ్జెట్‌లో సంక్షేమ పథకాలపై 25 శాతం నిధులు ఖర్చు చేయాలని ఆర్థిక శాఖకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## నేడు ఎఇఇ పరీక్ష

### ఉదయం, మధ్యాహ్నం నిర్వహణ

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(ఏఈఈ) పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షను నేడు(ఆదివారం) తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమి షన్ (టీఎస్‌పీఎస్‌సీ) నిర్వహించనుంది. పరీక్షను 7 జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు కమిషన్ ప్రకటించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లోని 1540 ఏఈఈ పోస్టుల భర్తీ కోసం సెప్టెంబర్ 3న టీఎస్‌పీఎస్‌సీ నోటిఫికేషన్ నంబర్12/2022ను జారీ చేసిన విషయం తెలిసిందే. పరీక్షకు సంబంధించి 81,548 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో శనివారం సాయంత్రం వరకు 74,192 మంది తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు టీఎస్‌పీఎస్‌సీ ప్రకటించింది. ఏఈఈ పరీక్షను నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 2.30 గంల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓఎంఆర్ విధానంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు 45 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రంలోని వెళ్లాల్సి ఉంటుందని కమిషన్ ప్రకటించింది. హాల్ టికెట్స్‌లో ఫోటో సరిగా లేకపోయినా.. బ్లర్‌గా ఉన్న అభ్యర్థులు గెజిటెడ్ అధికారితో మూడు ఫోటోలపై అటెస్టేషన్ చేయించుకొని పరీక్షకు హాజరుకావల్సి ఉంటుందని ప్రకటించింది. లేకపోతే పరీక్షకు అనుమతి ఇవ్వబోమని తెలిపింది.

## హాస్టల్ భవనంపైనుంచి దూకి ఇఫ్లూ విద్యార్థిని ఆత్మహత్య



అంజలి (ఫైల్)

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 21, ప్రభాత వార్త:** కుటుంబ కలహాలతో ఓ యూనివర్సిటీ విద్యార్థి హాస్టల్ భవనంపై దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్ కుమార్తె అంజలి 22) ఇఫ్లూ యూనివర్సిటీలో ఎం.ఏ. ఇంగ్లీష్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. ఇదిలా ఉండగా హర్యానాలో ఉంటున్న అంజలి తల్లిదండ్రులు తరుచుగా గొడవలు పడుతుండే వారు. ఇటీవల కూడా ఆమె తల్లిదండ్రులు గొడవ పడ్డారని తెలిసింది. దీంతో అంజలి కలత చెంది మనోవేదనకు గురై తన సహచర విద్యార్థిర్దులు చూస్తుండగానే శుక్రవారం రాత్రి హాస్టల్ 4వ అంతస్థు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తోటి విద్యార్థులు వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మృతి చెందింది. హాస్టల్ విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో ఓయు పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసు పత్రికి తరలించారు. సమాచారాన్ని మృతురాలి తల్లిదండ్రులకు అందిచినట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన అంజలి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తెలుస్తుంది. ఆమె మృతికి కారణమైన విషయాలపై పోలీసులు దర్యాప్తు చేయాలని విద్యార్థులు డిమాండ్‌చేశారు. కేసును ఓయు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కమాండ్ కంట్రోల్‌ను సందర్శించిన ట్రైనీ ఐపిఎస్‌లు

### ● సిటీ పోలీసు చరిత్ర, టెక్నాలజీ వాడకంపై యువ ఐపిఎస్‌లకు వివరించిన కొత్వాల్

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** పోలీసు అకాడమిలో శిక్షణలో వున్న 74 బ్యాచ్‌కు చెందిన 195 మంది యువ ఐపిఎస్ అధికారులు శనివారం నాడు బంజా రాహిల్స్‌లోని పోలీ సు కమాండ్ కంట్రోల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా యువ ఐపిఎస్‌లకు సిటీ కొత్వాల్ ఆనంద్ స్వాగతం పలకడంతో పాటు 1847లో ఏర్పా టైన సిటీ పోలీసు విభాగం అప్పటి నుంచి మారుతూ నేటి వరకు ఎలా వచ్చిందనే అంశాలకు సంబంధించిన చరిత్ర గురించి వివరించారు. దీంతో పాటు పోలీసు కమా ండ్ కంట్రోల్ ఏర్పాటు, దీనివల్ల కలుగుతున్న ప్రయోజనాలు, సిసి టివిల ఏర్పాటు, వీటివల్ల కలుగుతున్న ప్రయోజనాలు, టెక్నాలజిని పోలీసులు ఏ విధంగా వాడుతున్నారనే అంశాలపై యువ ఐపిఎస్‌లకు ఆనంద్ సుదీర్ఘంగా వివరించారు. పోలీసుల విధుల్లో నేడు టెక్నాలజీ వాడకం అనేది తప్పనిసరిగా అయ్యిందని ఆయన అన్నారు. టెక్నాలజిని వాడడం ద్వారా శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, నేరగాళ్ల పట్టివేత, ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా హైదరాబాద్‌లో చేబట్టిన రోప్ ప్రాజెక్టు వంటి అంశాలను కూడా ఆయన వివరించారు. మతపరమైన సున్నిత అంశాలను ఎలా అధిగమించాలి, సోషల్ మీడియాలో వస్తున్న అడ్డగోలు పోస్టింగులను ఎలా నివారించాలనే వాటిపైనా కొ త్వాల్ యువ ఐపిఎస్‌లకు వివరించారు. దీం తో పాటు మహిళల భద్రతకు సంబంధించి సమర్థంగా పనిచేస్తున్న షి బృందాలు, భరోసా కేంద్రాల గురిం చి కూడా ఆయన తెలిపారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నేరాల విషయంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు సునీతారెడ్డి, చింతమనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




కమాండ్ కంట్రోల్‌ను సందర్శించిన ట్రైనీ ఐపిఎస్‌లకు సిటీ పోలీసు చరిత్ర, టెక్నాలజీ వాడకంపై యువ ఐపిఎస్‌లకు వివరిస్తున్న కొత్వాల్ ఆనంద్

## విద్యుత్ సంస్థల్లో పొంచి ఉన్న ఆర్థిక సంక్షోభం

### సాంకేతిక సామర్థ్యం అద్భుతంగా ఉన్నా.. ఆర్థికంగా వెనుకబాటు
### మీటర్ అమ్మకాలు పెంచి వృధా ఖర్చులు తగ్గించాలి
### ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి
### విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్ల డైరీ ఆవిష్కరణలో సిఎండి ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** సాంకేతిక సామర్థ్యంలో తెలంగాణ విద్యుత్ సంస్థలు దేశంలోని ఇతర డిస్కంల కంటే ముందున్నా.. ఆర్థికంగా వెనకబడి పోయాయని నష్టాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఆయా పంపిణీ సంస్థల మనుగడే ప్రశార్థకంగా మారే ప్రమాదం ఉందని ఈనష్టాల నుంచి విద్యుత్ సంస్థలను గట్టెక్కించాలంటే మీటర్ సేల్స్ పెంచి అంతర్గత వృధా ఖర్చులు తగ్గించుకోవాలని ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. ఈమేరకు శనివారం చిక్కడపల్లి ఆర్టీసీ కళ్యాణమండపంలో తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.అశోక్, ప్రధాన కార్యదర్శి పి.అంజయ్యల ఆధ్వ ర్యంలో నిర్వహించిన విఏఓఏటీ 2023డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి టిఎస్ ఎస్‌పిడిసిఎల్ సిఎండీ రఘుమారెడ్డి, ఎన్‌పిడిసిఎల్ సిఎండీ గోపాల్‌రావులతో కలిసి హాజరై డైరీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ''ప్రస్తుతం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం, ట్రాన్స్‌కో,జెన్‌కో సంస్థలు కొంత మెరుగ్గా ఉన్నా..పంపిణీ సంస్థలు మాత్రం నష్టాల్లో ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికే అనేకవిధాలుగా సహకరించింది. అయినా నష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. నష్టాల్లో ఉన్న సంస్థలను లాభాల భాట పట్టించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉంది. లేదంటే సంస్థల మనుగడే కాదు ఉద్యోగుల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుతం రోజుకోరకమైన సైబర్ క్రైం వెలుగు చూస్తుంది. విద్యుత్ సంస్థలకు ఈక్రైం సవాలు విసురుతుంది. ఇంజనీర్లు ,అకౌంటెంట్లు ఎప్పటికప్పుడు వృత్తినైపుణ్యం మెరుగుపరుచుకోవాలి. సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా చూడాలి. సాంకేతిక పరిజ్ఞానమే కాదు. ఆర్థిక వనరులు వారి చేతికి చిక్కకుండా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. అకౌంటెంట్లు కేవలం అకౌంట్స్‌ను నిర్వహించడమే కాదు. బ్యాలెన్స్‌షీట్‌ను మెయింటెన్ చేయాలి. సంస్థ ఖాతాలో నిల్వలు ఉన్నప్పుడే అవసరానికి ,అభివృద్ధి పనులకు బ్యాంకులు, ఇతర సంస్థ లు అప్పులు ఇవ్వడానికి ముందు వస్తాయి. విద్యుత్ సంస్థల నిర్వహణ ,విస్తరణ కోసం ఇప్పటి వరకు రూ.37వేలకోట్లు ఖర్చు చేశాం. ఉత్పత్తి సరఫరా వ్యవస్థలను పూర్తిగా ఆధునీకరిచంచడమే కాకుండా దేశంలో ఎక్కడా లేనివిధంగా గృహాలు పరిశ్రమలకు ,రైతులకు 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఉద్యోగులు మరింత నిబద్ధతతో పనిచేసి వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేయాలి'' అని సిఎండీ ప్రభాకర్‌రావు అన్నారు.




డైరీ ఆవిష్కరిస్తున్న సిఎండిలు ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి, గోపాల్‌రావు, అంజయ్య తదితరులు

**ఆ డబ్బులు సొంతానికి వాడుకుంటే ఎలా?: ఎస్‌పిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి**

వినియోగదారుల నుంచి వసూలు చేసిన విద్యుత్ బిల్లులను వెంటనే సంస్థ ఖాతాల్లో జమ కావడం లేదని వీటిని కొంతమంది సొంత ఖర్చులకు వాడుకుంటున్నారని ఎస్‌పిడిసిఎల్ సిఎండీ రఘుమారెడ్డి అన్నారు. వరుస డోర్‌లాక్‌లు, మీటర్ స్టకప్‌లు, బర్న్ వంటి అంశాలను ఈఆర్‌ఎలు మానిటరింగ్ చేయకుండా పరోక్షంగా సంస్థ నష్టాలకు కారణమవుతు న్నారన్నారు. వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లులకు సంబంధించిన మొత్తాన్ని సొంత అవసరాలకు వాడుకుంటే ఎలా ? ఈఆర్‌ఓ కేంద్రాల్లోని అకౌంటెంట్లు ఏంచేస్తున్నారు..? ఎప్పటికప్పుడు బిల్లులు ,ఇతర అంశాలను మానిటరింగ్ చేయాల్సి బాధ్యత మీపై లేదా ? ఈఆర్‌ఓ కోఆర్డినేటింగ్ మీటింగ్‌లో ఏం చర్చిస్తున్నారు? ఈచిన్న విషయాన్ని కూడా చెప్పాలా ? అన్‌బిల్డ్ సర్వీసులపై ఎదుకింత నిర్లక్ష్యం ?మీటరు రిలీజ్ చేసినప్పటినుంచి విధిగా బిల్లుంగ్ నమోదు చేయాల్సిందేనని లేకుంటే సంస్థకు ఆర్థిక కష్టాలు తప్పవని సిఎండీ అన్నారు. అలాగే ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించని సర్వీసులను ఉపేక్షించ వద్దని సెక్షన్ల వారిగా సమీక్షలు నిర్వహించి .వృధా ఖర్చులు విద్యుత్ లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత అకౌంటెంట్స్ పై ఉందన్నారు. ఈకార్యక్రమంలో జెఎండీ శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు నరసింహ్మారావు, టిర్‌కేరావు, తిరుపత్తిరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు నాజర్ షరీఫ్, అనురాధ, పరమేష్, అనిల్, స్వామి, వీరస్వామి, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బదలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభంపై పిఆర్‌టియు హర్షం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బదలీలు, పదోన్నతుల ప్రక్రియపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 91 విడుదల చేయడం పట్ల పీఆర్‌టీయూ టీఎస్ హర్షం ప్రకటించింది. జీవో నంబర్ 91 జారీ చేయడంతో రాష్ట్రంలో పదోన్నతుల ప్రక్రియకు మార్గం సుగమం అయిందని.. ఇందుకు తమ సంఘం తరపున హర్షం ప్రకటిస్తున్నట్టు పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఉత్తర్వులు వెలువరింప చేసిన ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, విద్యా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## దేశ విదేశాల్లో సిటీ కళాశాల విద్యార్థుల్లేని రంగమే లేదు!

### కళాశాల విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్




సదస్సులో కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ ప్రసంగిస్తున్న దృశ్యం

**హైదరాబాద్ (చార్మినార్), జనవరి 21, ప్రభాతవార్త :** పూర్వ విద్యార్థులను కేవలం ఆర్థిక కోణంలోనే చూడకుండ విద్యార్థులలో జ్ఞాన వనరులను అభివృద్ధి చేసే విధంగా వారి నుంచి సేవలు అందుకోవాలని రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ నవీన్ మిత్తల్ అన్నారు.ప్రభుత్వ సిటీ కళాశాల అలుమ్ని కమిటి,ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నూతన విద్యా విధానం (2020) సదస్సులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు మార్గ దర్శకులుగా, జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవటానికి కౌన్సిలర్లుగా దోహదపడాలని తెలిపారు.పూర్వ,ప్రస్తుత విద్యార్థులు ఎన్ని సార్లు కలుసుకుంటే అంత అనుబంధం పెరిగి ఆయా విద్యా సంస్థల అభివృద్ధి చెందుతాయని తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య యస్వీ సత్యనారాయణ అన్నారు.మట్టి కాళ్లతో,రబ్బరు చెప్పులతో సిటీ కళాశాలలో అడుగు పెట్టిన తాను ఉప కులప తిగా సాహితీ వేత్తగా ఎదగటానికి సిటీ కళాశాల సంస్థ పునాదులు వేసిందని ఆయన తెలియజేశారు. తాను సినీనటుడు కావటానికి ప్రధాన కారణం సిటీ కళాశాలలోని వాతావరణమేనని సినీనటుడు తిరువీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.బాలభాస్కర్,కన్వీనర్ డా.జె.నీరజ, సదస్సు సంచాలకులు డా.పావనీ, డా.రవిచంద్ర, డా.సీతారాం, డా.అయోధ్యరెడ్డి, డా.రజనీ, ఫర్హత్ నాజ్నీన్, డా.ఝాన్సీతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఆధునిక సాంద్రత పద్ధతిలో సాగు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలో వివిధ పంటలను నూతన విధానంతో సాగు చేసేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. వీటిలో ప్రధానంగా పత్తి పంట సాగులో ఈ నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు. చైనా దేశంలో అమలు చేస్తున్న ఆధునిక సాంద్రత పద్ధతిని తెలంగాణలో అమలు చేయాలని నిర్ణయించారు. ఆధునిక సాంద్రత పద్ధతిలో ఒక్కో ఎకరంలో 20 నుండి 30 క్వింటాళ్ల పత్తి దిగుబడి చైనాలో వస్తున్న నేపథ్యంలో తెలంగాణలోనూ అదే స్థాయిలో పత్తి దిగుబడి తీసుకు రావాలని పట్టుదలతో అధికారులు ఉన్నారు. ఇప్పటికే తెలంగాణ పత్తికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉంది. దీంతో పత్తిలో అధిక దిగుబడులు సాధించేందుకు గాను ఆధునిక పద్ధతిలో పత్తినిన సాగు చేసేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలోనే వానాకాలం సీజనులో నల్లగొండ జిల్లాలో 1,356 ఎకరాలు, సూర్యాపేట్ జిల్లాలో 188 ఎకరాలు, భువనగిరి జిల్లాలో 300 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిన పత్తిని సాగు చేశారు. ఈ పద్ధతి ఇక్కడ విజయవంతం కావడంతో వచ్చే సీజను నుండి మరిన్ని జిల్లాలకు విస్తరించే యోచనలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

## నిషిద్ధ ఇ-సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు




టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన నిషిద్ధ ఇ-సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరు యువకులు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన ఈ సిగరెట్లను చట్ట వ్యతిరేకంగా కాలేజి విద్యార్థులకు, టీనేజి కుర్రాళ్లకు విక్ర యిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 40 ఈ సిగరెట్లను రెండు సెల్‌ఫోన్లను, ఒక ద్విచక్ర వాహనాన్ని జప్తు చే శారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు శనివారం నాడు మీడియాకు వెల్లడించారు. బోయిన్‌పల్లికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రజాక్ (19), మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ (18)లు పనీపాట లేకుండా తిరుగుతూ ఇటీవలే నిషిద్ధ ఈ సిగరెట్లను కాలేజి విద్యార్థులకు, టీనేజి కుర్రాళ్లకు అమ్మసాగారు. ఈ సిగరెట్లు మామూలు సిగరెట్లలా వుండవు. సిగరెట్ లైటర్ తరహాలో వుండి చూసేందుకు ఆకర్షణీయంగా వుంటుంది. ఇందులో ప్రమాదకరమైన నికోటిన్‌తో పాటు ఘా టైన వాసన, మత్తు కలిగించే రసాయన పదార్థాలు ద్రవ రూపంలో వుంటాయి. లైటర్ లేదా అగ్గిపెట్టె సహాయంతో వీటిని వెలిగించి పీల్చేందుకు అవకాశం వుంటుంది. చూసేందుకు ఇది బాగానే వున్నా ఒక్కసారి వీటికి అలవాటు పడ్డవారు ఆ తరువాత బానిసలుగా మారి, వ్యసనపరులై తమ జీవితాలను నాశనం చేసుకుంటారు. ఈ క్రమంలోనే వీటిని కేంద్రంతో పాటు రాష్ట్ర సర్కారు చాలా కాలం క్రితమే నిషేధించింది. అయినప్పటికీ వీటి తయారీ పలుచోట్ల జరుగుతునే వుంది. ముంబయిలో వీటి తయారీ ఎక్కువగా వుంటుండడం గమనార్హం. నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రజాక్, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌లు ముంబాయి నుంచి తక్కువ ధరకు వీటిని కొని హైదరాబాద్‌లో కాలేజి విద్యార్థులకు, టీనేజి కుర్రాళ్లకు 2500 రూపాయలకు అమ్మసాగారు. వీటి అమ్మకాల కోసం వీరిద్దరు సోషల్ మీడియాలో వపేస్ హైదరా బాద్ అనే పోస్టింగ్ వుంచి కాలేజి విద్యార్థులకు, టీనేజి కుర్రాళ్లను ఆకట్టుకుంటున్నారు. కాగా వీరి గోల్‌మాల్ వ్యవహారలపై సమా చారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ నేతృత్వంలోని పోలీసు బృందం శుక్రవారం సాయంత్రం గాంధీ భవన్ పక్కనే గల షెజాన్ హోటల్ వద్ద దాడిచేసి ఇద్దరిని పట్టుకు న్నారు. ఈ సందర్భంగా వీరి వద్ద 40 ఈ సిగరెట్లను జప్తు చేశారు. దీంతో పాటు రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా జప్తు చేశారు. పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

## ఐదేళ్లు పూర్తయిన జిహెచ్‌ఎంలకు తప్పనిసరి బదలీలు చేయాలి

### గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం వినతి

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో జరగబోయే బదలీల్లో 5 సంవత్సరాలు పూర్తయిన గెజిటెడ్ హెడ్మాష్టర్లకు తప్పనిసరి బదలీలు చేపట్టాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాష్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యా శాఖమంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి శనివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజభాను చంద్ర ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ గంగారెడ్డి, కోశాధికారి తుకారాం వినతిపత్రం సమర్పించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఒక పాఠశాలలో ఉండే గరిష్ఠ కాలం పూర్వం వలే 5 సంవత్సరాలు కాకుండా.. 8 సంవత్సరాలని కొన్ని పత్రికలోలన వచ్చిందని.. దీంతో రాష్ట్రంలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు 5 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వారికి బదలీలకు గతంలో లాగా అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. 8 సంవత్సరాలు కొనసాగిస్తే దూర ప్రాంతాల నుంచి దగ్గరి ప్రాంతాలకు బదలీ కోరుకునే ప్రధానో పాధ్యా యులకు అవకాశాలు సన్నగిల్లుతా యన్నారు.

# నార్కోటిక్ డ్రగ్స్ కేంద్రంపై పోలీసుల దాడి

### ● ముగ్గురి అరెస్టు.. పరారీలో మరొకరు
### ● 600 గ్రాముల డైజోఫామ్, ఒక కారు, మోటర్ సైకిల్, తయారీయంత్రం పరికరాలు, 60 డ్రమ్ముల కెమికల్స్ సీజ్
### ● వివరాలు వెల్లడించిన పటాన్‌చెరు సిఐ వేణుగోపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, జనవరి 21, ప్రభాతవార్త:** అక్రమంగా తయారు చేస్తున్న నార్కోటిక్ డగ్స్ కేంద్రంపైం పటాన్‌చెరు పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురికి అరెస్టు చేశారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో శనివారం సిఐ వేణుగోపాల్‌రెడ్డి, క్రైమ్ సిఐ బీసన్నలు వివరాలను వెల్లడించారు.

తిరుపతికి చెందిన మదన్ మోహన్‌రెడ్డి, గుంటూరుకు చెందిన గురువారెడ్డి, దుబ్బాక మండలం ధర్మాజీపేట చెందిన మనోహర్, నరేందర్ గౌడ్ లతో కలిసి మండలంలోని ఇస్నాపూర్ శివారులో గల కెఎస్ఎం జనరిక్ ఫార్మసిటికల్స్ లిమిటెడ్ పరిశ్రమ పక్కన గల షెడ్డులో ల్యాబ్‌లి వివిధ రకాల మత్తు పదార్థాలతో డైజోఫామ్- ఆల్ఫాజోలం పొడర్‌ను తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఎస్ఐ రామనాయుడు సిబ్బందితో తయారి కేంద్రంపై దాడి చేసి మదన్మోహన్‌రెడ్డి, గురువారెడ్డి, మనోహర్‌లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారించాక నిషేదిక మత్తు పదార్థాలు తో డైజోఫామ్-ఆల్ఫాజోలం డ్రగ్స్‌ను తయారు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ల్యాబ్‌లో నంచి 600 గ్రాముల నకిలీ డైఫోప్లామ్-అల్ఫా జోలం, ఒక కారు, మోటర్ సైకిల్ తయారు చేయుటకు ఉపయోగించే నాలుగు యాంత్ర పరికరాలు, తయారు చేసేందుకు ఉపయోగించే 60 డ్రమ్ములు కెమికల్స్‌ను సీజ్ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మరొక నిందితుడు నరేందర్ గౌడ్ పరారిలో ఉన్నట్లు చెప్పారు.

పారిశ్రామిక ప్రాంతంలో మూతపడ్డ పరిశ్రమలపై నిఘ పెట్టనున్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఏఎస్ఐ అశోక్, హెడ్ కానిస్టేబుల్ నరేష్, అమర్నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




మీడియా ముందు వివరాలను వెల్లడిస్తున్న పటాన్‌చెరు సిఐ వేణుగోపాల్‌రెడ్డి, క్రైమ్ సీఐ బీసన్న

# ఫిబ్రవరి 13న రాష్ట్రానికి ప్రధాని మోడీ రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 21:** రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఫిబ్రవరి 13న రాష్ట్రానికి రానున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బిజెపి బహిరంగ సభలో మోడీ పాల్గొంటారు. నిజానికి ఈనెల 19నే రాష్ట్రంలో మోడీ పర్యటించాల్సి ఉంది. అయితే ఆయన బిజీ షెడ్యూల్ కారణంగా వాయిదా పడింది. దీంతో ఈనెల 15న వర్చువల్ విధానంలో సికింద్రాబాద్ విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత్ రైలును ఆయన ప్రారంభించారు. ఈ క్రమంలో తాజాగా ప్రధాని మోడీ తెలంగాణ పర్యటన ఫిబ్రవరి 13న ఖరారైంది. టిఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్‌గా ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా ప్రధాన మోడీ తెలంగాణలో పర్యటన ఆసక్తికరంగా మారింది. గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ బేగంపేటలో నిర్వహించి బిజెపి సభలో మోడీ పాల్గొన్న సంగతి తెలిసిందే.

**ప్రధాని పరీక్ష పే చర్చలో తెలంగాణ విద్యార్థులు**


ఈనెల 27న జరగనున్న ప్రధాని పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా అనేక పాఠశాలల విద్యార్థులు వీక్షించే విధగా బిజెపి రాష్ట్ర శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసుకునేందుకు బిజెపి కమిటీ వేసింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశాల అజెండాలోనూ ఈ అంశాన్ని చేర్చింది. శనివారం పలు పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ సహా ఇతర బిజెపి నేతలు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల పోరాటం, త్యాగాలను స్మరించుకోవాలి

● కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 21, ప్రభాతవార్త :** నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర స్వేచ్ఛను పొందడానికి మూలకారణం, కీలకభూమిక పోషించిన తెలంగాణ తొలిదశ ఉద్యమకారులను ప్రతీఒక్కరూ మనసారా గౌరవించి వారి త్యాగాలు, పోరాటస్ఫూర్తి పటిమ, బలిదానాలతో జీవితాలనే ఫణంగా పెట్టిన మహానుభావులను గుర్తుంచుకొని వారి త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమంలో అనేకమంది తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన మహావీరులని, వారి కుటుంబాలను అభినందించడమే కాకుండా అన్నివిధాలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం సాయంత్రం 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జి.కిషన్‌రెడ్డి అమరవీరుల త్యాగాలకు స్ఫూర్తిగా అమరవీరుల స్మారక స్థూపాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఆనాడు తెలంగాణకు అన్ని విధాలా జరుగుతున్న అన్యాయాలు, వివక్షలకు వ్యతిరేకంగా 1969వ సంవత్సరంలో దావానంలా ఉవ్వెత్తున ఎగిసిపడిన ప్రజా ఉద్యమం చరిత్రలోనే గొప్పది మరువరానిదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి ఆనాడే అంకురార్పణ జరిగిందని, యువత వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. తొలిదశ ఉద్యమకారులు మలిదశ తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకులు, ఆదర్శప్రాయంగా స్ఫూర్తిగా నిలిచారని మరోమారు స్మరించుకొన్నారు. ఈ కార్యక్రమంలో 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు మేచినేని కిషన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, సుదర్శన్, వై.కృష్ణ, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. చివరిగా జి.కిషన్‌రెడ్డి ఆనాటి ఉద్యమకారుల కుటుంబాలను ఘనంగా సత్కరించారు.



1969 ఉద్యమకారుల కుటుంబసభ్యులను సత్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు

# మహిళా దుస్తులకు ఒక స్టాప్ సాండ్ షోరూం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** డిజైనర్ మహిళా దుస్తులకు ఒక ఒక స్టాప్, గమ్యం సాండ్ షోరూం. గ్లోబల్ బ్రాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సమకాలీన, ఆధునిక రెట్రో విధానం కలిగిన షోరూంగా గుర్తింపు పొందింది. పురాతన సంప్రదాయాలు, అందాలకు అనుగుణంగా సాండ్ సంస్థ నిరంతరం అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ ప్రేక్షకుల సున్నితత్వాన్ని సంగ్రహించడం, వారిసేకరణలు సీజన్లకు మించి ఆధునిక వారసత్వ అందాన్ని తెస్తాయి. ఉద్వేగభరితంగా, ఇంద్రియాలను ఆకర్షించే లగ్జరీ అనుభూతిని కలిగించే సేకరణలను అందుబాటులోకి తెస్తోంది. ఒక ప్రసిద్ధి సాంస్కృతిక కేంద్రంగా, సంప్రదాయాలు, ఆధునికత కలిగిన హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో సాండ్ షోరూంను ప్రారంభించడం జరిగిందని ఆ సంస్థ యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. సాండ్ షోరూం పట్టణ మహిళలకు డ్రెస్సింగ్ ఫన్‌తో పాటు, బహుముఖంగా ఉందని వెల్లడించింది. మొత్తం 17 నగరాల్లో 24 షోరూంలను కలిగి ఉన్నట్లు పేర్కొంది. తమ షోరూంల్లో క్వింటెన్షియల్ ఫెస్టివల్ షేడ్స్‌లో ముంచిన సేకరణలు, లెహెంగాస్, సిల్క్ కుర్తా సెట్లు, అనార్కలిస్, ఈజీ సొగసైన చీరలతో కూడిన సిల్హౌట్ శ్రేణిలో ఉత్సాహపూరితమైన రంగుల సంకలనంగా అభివర్ణించింది. రాబోయే సేకరణలో మెరిసే దుస్తులు, జంప్ సూట్‌లు, ఓపెన్ జాకెట్లు, పూల స్కర్టులతో పాటు, సమన్వయ సెట్లతో నిండిన సేకరణలు కల్పిస్తాయని వివరించింది.



# గవర్నమెంట్ టీచర్లకు అన్ని కేడర్లలో బదలీలు, పదోన్నతులు కల్పించాలి

సిఎంకు ఎల్‌సిజిటిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో చేపట్టబోయే బదలీలు, పదోన్నతుల్లో లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్లకు అన్ని కేడర్లలో అవకాశం కల్పించాలని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాచారి, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎస్ రవీదర్, న్యాయ సలహాదారు సానా సురేందర్ శనివారం ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రం ఇచ్చినట్టు తెలిపారు. బదలీ పదోన్నతుల్లో సెప్టెంబర్ 30, 2017 సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను అనుసరించి కేశవులు జడ్జిమెంట్‌పైన ఉన్న హైకోర్టు కేసు నంబర్ 1401-2003 కంటెంట్ కేసు ప్రకారం ఆనాడు ప్రభుత్వం తదుపరి జరిపే బదలీలు, పదోన్నతులలో కేశవులు జడ్జిమెంట్‌ను తూచాతప్పకుండా పాటిస్తామని రాతపూర్వకంగా కోర్టుకు తెలియజేశారని గుర్తు చేశారు. కాబట్టి ఇప్పుడు జరిగే పదోన్నతులు బదలీల్లో లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అందరికీ అన్ని కేడర్లలో రాష్ట్రపతి ఉత్తర్వులు 1975 ప్రకారం పదోన్నతులు కల్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసికి భారీగా ఆదాయం

## 11 రోజుల్లో రూ.165.46 కోట్ల ఆదాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 21:** సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడపడం, ముందస్తు బుకింగ్ చేసుకుంటే తిరుగు ప్రయాణం టికెట్‌లో 10శాతం రాయితీ కల్పించడం, టోల్‌ప్లాజాల వద్ద ప్రత్యేక లేన్లు ఏర్పాటు చేయడం వల్ల ఆర్టీసి బస్సులను ప్రజలు ఎక్కువగా ఆదరించారు. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు... 11 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 2.82 కోట్ల ప్రయాణికులను టిఎస్ ఆర్టీసీ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది.

గత ఏడాదిలో పోల్చితే దాదాపు 12 లక్షల మంది అదనంగా బస్సుల్లో ప్రయాణించారు. సంక్రాంతికి 11 రోజుల్లో మొత్తంగా రూ.165.46 కోట్ల ఆదాయం సంస్థకు వచ్చింది. గత ఏడాది సంక్రాంతి కంటే ఈసారి రూ.62.29 కోట్లు ఎక్కువగా రాబడి వచ్చింది. హైదరాబాద్ నుంచి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లే 3,500 బస్సులకు అదనంగా 4,233 ప్రత్యేక బస్సులను టిఎస్ ఆర్టీసి నడిపింది. ఏపీఎస్ ఆర్టీసి కూడా రోజూ నడిపే 500 సర్వీసులకు తోడుగా మరో 1850 బస్సులను ఏర్పాటు చేశారు. కిలోమీటర్ల విషయానికి వస్తే రికార్డు స్థాయిలో సంక్రాంతికి 3.57 కోట్ల కిలోమీటర్ల మేర టిఎస్ ఆర్టీసి బస్సులు తిరిగాయి. గత ఏడాదితో పోల్చితే 26.60లక్షల కిలోమీటర్లు అదనంగా బస్సులు తిరిగాయి. ప్రతి రోజు సగటున 2.42 లక్షల కిలోమీటర్లు అదనంగా బస్సులు నడిచాయి. ఈసారి బస్సుల్లో అక్యూపెన్సీ పెరిగింది. గత ఏడాది సంక్రాంతికి ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) 59.17గా ఉంటే, ఈ సంక్రాంతికి అది 71.19కి పెరిగింది. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం సురక్షితమనే విషయాన్ని ప్రజలు మరోసారి నిరూపించారని టిఎస్ ఆర్టీసి చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. సంక్రాంతికి టిఎస్ ఆర్టీసి సేవలను విశేషంగా ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇలానే ఆదరించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఈ స్పందన వల్ల తమ సంస్థపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు.

# కొత్త సెక్రటేరియట్ నిర్మాణం.. పెట్రోల్ పంప్ తొలగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 21:** రాష్ట్ర నూతన సచివాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణంలో భాగంగా పక్కనే ఉన్న పెట్రోల్ పంప్‌ను తొలిగిస్తున్నారు. ఈ స్థలంలో సచివాలయ ప్రహరీ గోడ కట్టనున్నారు. గత 30 ఏళ్లుగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ పంపు నడుస్తోంది. ఈ పంప్‌లో ప్రజలతో పాటు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వాహనాలకు పెట్రోల్, డిజిల్ సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఈ పంప్‌ను కవాడిగూడ ప్రాంతానికి తరలిస్తున్నట్లుగా అధికారులు నోటీసుల్లో తెలిపారు. సిఎం కెసిఆర్ జన్మదినమైన ఫిబ్రవరి 17న నూతన సెక్రటేరియట్ ప్రారంభం కానుంది.



సమావేశంలో చర్చిస్తున్న జడ్జిలు పాపిరెడ్డి, కుశ, దుర్గాప్రసాద్, రాధికజైశ్వాల్ తదితరులు

# జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు అధికంగా పరిష్కారం కావాలి

మెట్రోపాలిటన్ న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ సెషన్స్ జడ్జి పాపిరెడ్డి

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 21 ప్రభాతవార్త :** ఫిబ్రవరి 12 ఆదివారం జరుగబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికసంఖ్యలో కేసులు పరిష్కరింపబడి పూర్తయ్యేలా చూడాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి శనివారం మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు కాంప్లెక్స్‌లో స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్స్, వారి వారి పరిధిలోని డిసిపీలు, ఎస్.హెచ్.ఓలు తదితరులు సమీక్షా సమావేశం పెద్దయెత్తున నిర్వహించారు. ప్రతీఒక్కరూ వారి వారి కోర్టు పరిధిలో ఉన్న పోలీసు సిబ్బందితో సమావేశాలు నిర్వహించి జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం అయ్యేలా సర్వవిధాలా కృషిచేయాలని సూచించారు. అంతేకాక లోక్‌అదాలత్‌పై ఆయా పార్టీలకు పూర్తి అవగాహన, లాభాల గురించి సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని నొక్కివక్కాణించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కుశ, చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దుర్గాప్రసాద్, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రాధిక జైశ్వాల్ తదితరులు పాల్గొని విశేషంగా చర్చించారు.

# 'కంటి వెలుగు'లో ఇబ్బందులు లేకుండా చూడండి

కలెక్టర్‌లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యాంప్‌ల నిర్వహణ చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్‌లకు సూచించారు. శనివారం కంటి వెలుగు కార్యక్రమంపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. బిఆర్‌కెఆర్ భవన్ నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్‌లో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మెహంతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ఇప్పటి వరకు క్షేత్రస్థాయి క్యాంప్‌ల నిర్వహణ విజయవంతం జరుగుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొదటి రోజుల్ల 3.87లక్షల మందికి కంటి పరీక్ష నిర్వహించగా, అవసరమైన 97,335 మందికి కళ్లద్దాల పంపిణీ చేసినట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో ఉన్న బఫర్ టీమ్స్ ఉపయోగించి ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కోర్టు భవన్ సముదాయాలు, పోలీసు బెటాలియన్లు, జర్నలిస్టుల కోసం ప్రెస్‌క్లబ్‌ల వద్ద ప్రత్యేక కంటి వెలుగు క్యాంపులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌లకు సిఎస్ సూచించారు.

# టూరిజంపై రాజస్థాన్, కర్ణాటక ఉన్నతాధికారుల ప్రశంసలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 21:** తెలంగాణ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని రాజస్తాన్, కర్ణాటక రాష్ట్రాలు టూరిజం ఉన్నతాధికారులు అభినందించారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరుగుతున్న ఎఫ్ఐటియుఆర్-2023లో తెలంగాణ టూరిజం ప్రమోషన్‌లో భాగంగా కర్ణాటక, రాజస్తాన్ రాష్ట్రాల పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్శించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, పర్యాటక కేంద్రాల ప్రాముఖ్యతను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, చరిత్ర, వారసత్వ సంపదను తెలిపారు. పర్యాటకులకు కనువిందు చేసే జలపాతాలు, సెలయేర్లు, దేవాలయాలు, వైల్డ్ టూరిజం, ఎకో టూరిజం, ట్రైబల్ టూరిజం, ట్రైబల్ సాంస్కృతి, మెడికల్ టూరిజం, బతుకమ్మ పండుగ గొప్పతనం గురించి కర్ణాటక, రాజస్తాన్ రాష్ట్రాల టూరిజం అధికారులకు శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల టూరిజం శాఖల మధ్య పర్యాటకులను ఆకర్శించేందుకు సమన్వయం ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. వివిధ రాష్ట్రాల మధ్య టూరిజం కేంద్రాల సమాచారాన్ని పరస్పరం అందజేసుకోవడం వల్ల పర్యాటకులకు ఎక్కువ పర్యాటక ప్రదేశాలను సందర్శించే అవకాశం ఉందన్నారు. భారత దేశం భిన్న సంస్కృతులకు కేంద్ర బిందువు అని అన్నారు. ప్రపంచ కీర్తి కిరీటంలో బుద్ధవనం ప్రాజెక్టు గొప్ప మైలు రాయిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాలైన యాదాద్రి దేవాలయం, వేములవాడ, మన్యంకొండ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, కొండగుట్ట లాంటి చారిత్రక దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఇండియా టూరిజం అదనపు సెక్రటరీ రాకేశ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, రాజస్తాన్ టూరిజం ముఖ్యకార్యదర్శి గాయత్రీ రాథోడ్, రాజస్తాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మేంద్ర సింగ్ రాథోడ్, కర్ణాటక రాష్ట్ర టూరిజం అడ్వైజర్ హెచ్‌టీ రత్నాకర్, ఐవోటీఏ వైఎస్ ప్రెసిడెంట్ రవి కుమార్, తెలంగాణ టూరిజం ఎండీ మనోహర్, రాజస్థాన్ టూరిజం ఎండీ విజయ్ పాల్ సింగ్, తెలంగాణ టూరిజం డిప్యూటీ కమిషనర్ ఓం ప్రకాశ్, ఇతర రాష్ట్రాల టూరిజం అధికారులు పాల్గొన్నారు.

# నేను ఎవరికి అనుకూలం కాదు.. వ్యతిరేకం కాదు

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** తాను ఎవరికి అనుకూలం కాదని, వ్యతిరేకం కాదని రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మణిక్‌రావు ఠాక్రే అన్నారు. శనివారం నేతలో సమావేశం అయ్యారు. హాత్ సే హాత్ జోడో పాటు పార్టీకి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుకూలం, వ్యతిరేకం అన్న ఆలోచనలను పక్కకు పెట్టాలన్నారు. అధిష్టానం చెప్పింది చేయడమే నా విధి అన్నారు. ఎముకలు కొరికే చలిలో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేశారన్నారు. యాత్ర లక్ష్యాలను ఇంటింటికి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రతో రాహుల్ సందేశాన్ని గడపగడపకు తీసుకు వెళ్లాలన్నారు. నేతలంతా ఐక్యంగా హాత్ సే హాత్ జోడో యాత్ర చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి 50 నియోజకవర్గాలకు తగ్గకుండా యాత్ర చేస్తారన్నారు. మిగిలిన సీనియర్లు 20 నుంచి 30 నియోజకవర్గాల్లో యాత్ర చేయాలన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు హాత్‌ను విజయవంతం చేయాలన్నారు. అంతా ఐక్యంగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం, అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. సవస్యలు ఉంటే నాతో చెప్పాలని, నాకు ఫోన్ చేయాలన్నారు. ఎప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. పార్టీకి నష్టం చేసేలా ఎవరూ మీడియా ముందు మాట్లాడవద్దని హెచ్చరించారు.

# ఆదివాసీల జాతర కోసం కేస్లాపూర్ ముస్తాబు

● వివిధ రాష్ట్రాల నుండి భారీగా తరలివస్తున్న భక్తులు

**ఉమ్మడిజిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న గిరి పుత్రుల యొక్క జాతర రానే వచ్చింది. దేశంలోనే అతిపెద్ద రెండవ గిరిజన జాతరగా పేరుపొందిన కేస్లాపూర్ నాగోబా జాతర ఈ సంవత్సరం ప్రత్యేకతను సంతరించుకోనుంది. వివిధ రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివస్తారని వినికిడి ఈ జాతరను మెస్రం వంశీయులు ఎంతో భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తారు. నాగేంద్రునికి భక్తు లందరు ఏ విధంగా మొక్కుతారో మనందరికి తెలిసిందే కానీ అదిలాబాద్ జిల్లా ఆదివాసీల ఆరాధ్యదైవమైనటువంటి నాగోబాదేవుడి జాతర కేస్లాపూర్ గ్రామంలో ప్రారంభమయ్యే ఈ జాతర ఆదివాసీ సాంస్కృతి సాంప్రదాయానికి ముఖ్యంగా మెస్రం వంశస్థులు నాగేంద్రునికి చేసే ఆరాధన చూసి జాతరకు వచ్చే భక్తులు మంత్రముగ్ధులైపోతారు. ఆదివాసీ ఆచారాలు నాగెంద్రుని కొలిచే మొక్కు మహా అద్భుతంగా ఉంటుంది. ఆరాధించే విధానం, నాగేంద్రుని ప్రసన్నం చేసుకునే ఆదివాసీ ప్రజల ఆచారాలు కట్టుబాట్లు చిరస్మరణీయమని చెప్పుకోవచ్చు, నాగోబా జాతర గురించి నాగోబా విశిష్టత గురించి తెలుసుకోవాలంటే నాగేంద్రుని దర్శనం చేసుకోవాలంటే, ఇంద్రవెల్లిలోని కేస్లాపూర్ వెళ్లాల్సిందే. ఆదిలాబాద్ జిల్ల ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ ఆదివాసులకు కొంగు బంగారం అయినటువంటి ఈ నాగోబా జాతర అత్యంత వైభంగా ఈ రోజే ప్రారంభిస్తారు.

పుష్యమి మాసం నెలవంక కనిపించిన రోజు మెస్రం వంశస్థులు నాగోబాకు మొక్కి.. మరుసటి రోజు జాతర నిర్వహణకు సమాయత్తమవుతారు. సిరికొండ కుమ్మరులకు మట్టి కుండలు చేయమని చెప్పి ఏడు గ్రామాల్లో పర్యటిస్తారు. సిరికొండ గ్రామ కుమ్మరి గుగ్గిల వంశస్థులే తరాలుగా కుండలు చేస్తున్నారు. ఈ జాతర వచ్చిందంటే వీరి దగ్గరికి వచ్చి నిబంధన ప్రకారం పారితోషికం ఎంత ఇవ్వాలో అంతే ఇస్తారు వారు కూడా ఎక్కువ ఆశించరని చెబుతారు.

జాతరకు రెండు రోజుల ముందు కేస్లాపూర్‌లోని మర్రిచెట్ల వద్దే మెస్రం వంశస్థులు బస చేస్తారు. మరణించిన వారిని తలచుకోని పిండ ప్రదానం చేస్తారు. వారిని ఆరాధ్యదైవంగా ఈ వంశస్థులు వేడుకుంటారు. జాతరకు వచ్చే మెస్రం వంశీయులు వేలాదిగా వచ్చినా వంటలు చేసుకునేది మాత్రం 22 పొయ్యిల మీదే. ఈ పొయ్యిలు ఎక్కడ పడితే అకంకడ పెట్టడానికి వీలు లేదు. ఆలయ ప్రాగంణంలో ఏర్పాటు చేసిన ప్రహరీ(గోవాడ) లోపలే పెట్టి వంటలు చేయాలి.. అని వారి పూర్వీకుల ఆచారం ఇప్పుడు కూడా ఇదే ఆచరణలో ఉన్నది..

వీరి ఆచార వ్యవహారాలు సంస్కృతి సంప్రదాయాలు పూజా విధానాలు చూడాలనుకుంటే నాగోబా జాతరకు రావాల్సిందే. మెస్రం వంశస్థులు కేస్లాపూర్‌లోని మురాడి(గ్రామ గుడి)లో సమావేశమై, పూజ కలశం తీసుకుని గోదావరి పవిత్ర జలాల సేకరణ కొరకు పాదయాత్రగా బయల్దేరుతారు.



సర్వాంగ సుందరంగా తయారైన నాగోబా ఆలయం

హస్తినమడుగు దగ్గర గోదావరిలో పవిత్రమైన గంగాజలంను సాంప్రదాయకంగా పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి గంగా జలాన్ని సేకరిస్తారు. 17రోజుల పాటు కొనసాగి పాదయాత్ర పవిత్రమైన గంగాజలంతో తిరుగు ప్రయాణంలో ఇంద్రవెల్లి మండలంలోని ఇంద్రదేవి వద్దకు చేరుకోని ఒకరోజు అక్కడే బస చేస్తారు. సేకరించిన పవిత్ర జలంను చెట్టుపై అక్కడే జాగ్రత్తగా భద్రపరుస్తారు. అనంతరం ఇంద్రాదేవికి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి సహబంతి భోజనాలు మరుసటి రోజు కేస్లాపూర్‌లోని మర్రి చెట్టు వద్దకు చేరుకోని అక్కడే రెండు రోజులు బస చేస్తారు. సేకరించిన గంగాజలాన్ని మోదుగ చెట్టుపైన మూడురోజల పాటు జాగ్రత్తగా భద్రపరుస్తారు. ఈ ప్రయాణంలో ఊరి పొలిమేరల్లో మాత్రమే బస చేస్తారు. ముందుగా సిరికొండ మండలం నుండి మట్టి కుండలు తెప్పించి ఆలయ శుద్ధి కోసం మెస్రం వంశీయుల ఆడపడుచులు కోనేరు నుండి నీటిని తీసుకువచ్చి ఆలయాన్ని శుభ్రపరుస్తారు. నాగోబాకు గోదావరి నుండి తీసుకువచ్చిన పవిత్ర జలంతో అభిషేకం చేస్తారు. ఆదివాసుల సంప్రదాయ కంగాడోలు సన్నాయి తుడుం కలికం వాయిస్తూ ఘనంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రత్యేక పూజ సమయంలో నవధాన్యాల మొలకలు, రాగి చెంబులో పాలు అన్నింటిని తెల్లని బట్టలో పుట్టపై ఉంచి దూరంగా వేచి చూస్తారు. నాగేంద్రుడు వచ్చి పాలని త్రాగుతాడని ఆదివాసి ప్రజల ప్రగాఢ నమ్మకం. అదే ఇప్పటికి జరుగుతుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతారు.

మెస్రం వంశస్థుల్లో వివాహమైన నూతన వధువులను తప్పక కేస్లాపూర్‌లోని నాగోబా దేవుడి వద్దకు తీసుకువచ్చి భేటింగ్ చేయిస్తారు. వారు తెల్లని దుస్తులు ధరించి ఆలయ ప్రవేశం చేస్తారు. మెస్రం వంశస్థుల పటేల్ సతీమణి ఆధ్వర్యంలో భేటింగ్ చేస్తారు. పెద్దల ఆశిస్సులు తీసుకుంటారు. అప్పుడే మెస్రం వంశస్థుల కోడళ్ళులుగా పిలుస్తారు. నాగోబా పూజలకు ముందు ఆలయ ఆవరణలోని పుట్ట మట్టితో మొత్తడంలో మెస్రం వంశం అల్లుళ్లకు పెద్దపీట వేస్తారు. మట్టిని అల్లుల్లు కాళ్లతో తొక్కి మెత్తగా చేస్తే కూతుళ్ళు ఈ మట్టితో పుట్టను చేసి మొక్కును తీర్చుకుంటారు. అప్పుడు అల్లుళ్ళకు కానుకలు ఇస్తుంటారు. పుట్ట పెరిగినట్లు కుటుంబం యొక్క ఆయురారోగ్యాలు పెరుగుతాయని వారి ప్రగాఢ విశ్వాసమని ఆదివాసి పెద్దలు చెబుతుంటారు.

నాగోబా జాతర సందర్భంగా ఏర్పాటయ్యే దర్బార్‌కు ఒక ప్రత్యేకత చరిత్ర ఉన్నది ఎనిమిది దశాబ్దాల కిందట మారుమూల గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు లేవు. పాలకులు అంటేనే ఆదివాసులు బయపడువారు. అప్పుడే జల్ జంగల్ జమీన్ అధికారం కోసం సాయుధ పోరాటం చేసి కుమురం భీం అమరుడయ్యాడు. అప్పుడు ఈ ప్రాంతంలో నిజాం పాలన సాగుతుంది. ఈ ఘటనతో ఉలిక్కిపడ్డ నిజాం సర్కార్ గిరిజన ప్రాంతాల పరిస్థితులను ఆదివాసిల స్థిగతులపై అధ్యయనం కోసం మధ్యాహ్నం చేసి నివేదిక సమర్పించేందుకు ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫేసర్ హైమన్ డార్ఫ్ ఆదిలాబాద్ జిల్లాకు అప్పటి నిజాం ప్రభుత్వం పంపించింది. ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన తరువాత హైమన్ డార్ఫ్ దృష్టి కేస్లాపూర్ జాతరపై పడింది. అక్కడకు అందరూ వస్తారని అక్కడే సమస్యలు తెలుసుకుంటే మంచిదని భావించారు.

ప్రభుత్వం తరుపున వచ్చిన అధికారులు సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇస్తారు. పుష్యమాసం అమావాస్య రోజున లోకమంతా నలుపురంగు పులుముకుంటే అక్కడ మాత్రం వెలుగులు విరజిమ్ముతాయి. చిమ్మచీకట్లో చల్లని గాలుల్లో అర్ధరాత్రి వేళ దట్టమైన అడవలో పండుగ శోభ కనిపిస్తుంది. తరాతరాల సంప్రదాయాన్ని కాపాడుతూ అడవి బిడ్డలు నిష్టగా నగదేవునికి చేసే ప్రత్యేక పూజలు మైమరపింపచేస్తాయి. ఆ సమయాన నిషి రాత్రి కూడా తాండవం చేస్తూ అడవంతా వెలుగులు నింపుతుంది. ఆ పండుగే అడవి బిడ్డలు తెల్లని దుస్తులతో కేస్లాపూర్ నాగోబా ప్రాంతమంతా పండు వెన్నెల పరచినట్లుగా రమణీయంగా కనబడుతుంది.

నేడు ఈ జాతరకు కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా వస్తున్నట్లు అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు తెలిపారు. మెస్రం వంశీయులతో ప్రత్యేక పూజలతో పాటు చర్చ వేదికల్లో పాల్గొని ఆదివాసిల సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా తీసుకువెళ్తామని ఆయన తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
ఆసక్తి వ్యక్తీకరణ (EOI)
ROC No: E1/04/2022-23 తేదీ: 23.01.2023
బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్, 17వ వార్డు, ప్రశాంత్ నగర్ కాలనీ మరియు 19వ వార్డు, అభ్యుదయ నగర్ కాలనీలో గ్రంథాలయాల స్థాపన కొరకు DPR తయారీ నిమిత్తం ఏజెన్సీ/సంస్థ/కన్సల్టెంట్ మద్దతు యొక్క నియామకానికి ఆసక్తిగల పార్టీల నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరబడుతోంది. మరిన్ని వివరాలకు బిడ్డర్ మునిసిపల్ ఇంజనీర్‌ను సంప్రదించవచ్చును. దరఖాస్తుదారులు కమిషనర్, బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్ పేరిట తీసిన రూ.5,000/- (ఐదు వేల రూపాయలు మాత్రమే) (తిరిగి ఇవ్వబడనిది) జతపరచవలెను మరియు 23.01.2023 నుండి R.F.P. (ప్రతిపాదన కొరకు అభ్యర్థన కలక్ట్ చేయవలెను. ఆసక్తి వ్యక్తీకరణ దాఖలు చివరి తేది 25.01.2023 మ.03.00 గం.వరకు. ఏ సందేహాలకైనా 9121106496 ను సంప్రదించండి.
సం/- కమిషనర్, బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.11681-PP/CL/Advt/1/2022-23, తేది: 21.01.2023



తెలంగాణ ప్రభుత్వం
నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా
ఫైల్ నెం.NMC/F1/21//2022-23, ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తేది: 19.01.2023
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ యందు మునిసిపల్ వాహనాలకు మరమ్మతులు మరియు నిర్వహణ పనులకు పేరొందిన ఏజెన్సీలు/సమోదిత సంస్థలు/కాంట్రాక్టర్ల నుండి ప్రతిపాదనలు ఆహ్వానింపబడుచున్నది. ఆసక్తిగల సంస్థ RFP డాక్యుమెంటును మునిసిపల్ కమిషనరు, నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ వారి నుండి "నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ యందు మునిసిపల్ వాహనాలకు మరమ్మతులు మరియు నిర్వహణ"కు రూ.1000/-ల డిమాండ్ డ్రాఫ్ట్‌ను షెడ్యూలు విలువ/RFP డాక్యుమెంట్ కోసం మరియు రూ.5000/-ల EMD ని మునిసిపల్ కమిషనర్, నిజాంపేట, మునిసిపల్ కార్పొరేషన్ వారి పేరిట తీసి జతచేయవలెను. అర్హతా నియామవళి మరియు సవివర RFP నిబంధనలు RFP డాక్యుమెంట్‌లో లభ్యంగా గలవు. RFP డాక్యుమెంట్ జారీకి తేది: 23.01.2023న మ॥ 3.00 గం॥లు, RFP డాక్యుమెంట్ జారీకి చివరి తేది: 25.01.2023న మ.॥3.00 గం.లు, RFP డాక్యుమెంట్ సమర్పణకు చివరి తేది: 27.01.2023న మ॥ 3.00 గం.లు, RFP డాక్యుమెంట్ తెరుచు తేది: 28.01.2023న సా॥ 4.00 గం.లు, పై నోటీసుకు సంబంధించి ఏవేని సందేహాలు ఉన్నట్లయితే, దయచేసి నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించగలరు.
సం/- కమిషనరు, నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.11691-PP/CL/Advt/1/2022-23, తేది: 21.01.2023

# న్యూజిలాండ్ కొత్త ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్

## నేడు లాంఛనంగా ఎన్నుకోనున్న లేబర్ పార్టీ



**సిడ్నీ, జనవరి 21:** న్యూజిలాండ్ నూతన ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖరారైందని చెబుతున్నారు. ఆదివారం లాంఛనంగా ఆయణ్ని తమ తదుపరి ప్రధానిగా అధికార లేబర్ పార్టీ ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. కొవిడ్ తమ దేశంపై ప్రభావం చూపకుండా కఠిన చర్యలు చేపట్టిన వ్యక్తిగా లేబర్ పార్టీకి చెందిన క్రిస్ హిప్కిన్స్‌కు పేరుంది. రెండేళ్లపాటు కొవిడ్ నియంత్రణ బాధ్యతలను ఆయనే నిర్వహించారు. గతేడాది ఆగస్టులోనే న్యూజీలాండ్ సరిహద్దుల నుంచి ఇతర దేశీయులకు అనుమతిచ్చారు. 44 ఏళ్ల క్రిస్ హిప్కిన్స్ అటు ప్రతిపక్ష నేతగా, ఇటు అధికార పక్ష నేతగా తన 14 యేళ్ల రాజకీయ జీవితంలో సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం పోలీస్, విద్యాశాఖల్ని ఆయన నిర్వహిస్తున్నారు. న్యూజిలాండ్ ప్రస్తుత ప్రధాని జెసిండా ఆర్డర్న్ గురువారమే తన రాజీనామాను ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ దేశ తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు క్రిస్ హిప్కిన్స్‌కు మార్గం సుగమం అయింది. అయితే, తన తదుపరి ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్‌ను ఎన్నుకుంటున్నందుకు అభినందించిన జెసిండా..తాను ఫిబ్రవరి 7న పదవీ విరమణ చేస్తానన్నారు. దాంతో, క్రిస్ హిప్కిన్స్ బాధ్యతలు స్వీకరించడానికి మరికొన్ని రోజులు ఆగాల్సి ఉంటుంది. న్యూజిలాండ్‌లో సాధారణ ఎన్నికలకు ఎనిమిది నెలల సమయమున్నది. తాను నిర్ణయాత్మకంగా ఉన్నానని, వేగవంతంగా పనులు పూర్తి చేయగలనని క్రిస్ హిప్కిన్స్ ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# డెక్కన్ మాల్ భవనం కూల్చేస్తాం..

## ఎవరికైనా నష్టం కలిగితే పరిహారం చెల్లిస్తాం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గాలి మాటలు మాట్లాడి వెళ్లారు: మంత్రి తలసాని

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 21, ప్రభాతవార్త:** సికిందరాబాద్ అగ్నిప్రమాద స్థలాన్ని సందర్శించిన సమయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గాలి మాటలు మాట్లాడి వెళ్లారని, బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం 2008లో ఆగిపోయిందని, ఈ స్కీం ద్వారా ప్రభుత్వం అవ సరమైనప్పుడల్లా సమకూర్చుకోవాలని చూస్తున్నదని ఇష్టానుసారం మాట్లాడారని, ఇది సరైన విధానం కాదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఘాటుగా స్పందించారు. ప్రజ లకు భరోసా ఇవ్వాల్సి న సమయంలో కేంద్రమంత్రి రాజకీయాలు మాట్లాడటం సరైంది కాదని తలసాని హితవు పలికారు. హైదరాబాద్‌లో సుమారు 25వేల ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్స్ ఉన్నాయని అంచనాకు వచ్చామని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్నింటినీ గుర్తిస్తామని మంత్రి తలసాని అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని కూల్చేందుకు అవసరమైన అధు నాతన టెక్నాలజీని ఉపయోగిస్తామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పక్షాన ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో భవనంలో పదివేల టన్నుల మెటీరియల్ నిల్వచేసి ఉందన్నారు. ఎన్‌ఐటీ ఇంజనీరింగ్ బృందం భవనం దృఢత్వంపై అధ్యయం చేసిందని, జీహెచ్ఎంసీ అధికారుల నుంచి నివేదిక రావాల్సి ఉందన్నారు. జనావాసాల మధ్య ఇలాంటి గోదాములు, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ యూనిట్లపై ఉన్నతస్థాయి కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ఈ నెల 25వ తేదీన వివిధ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించ నున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వివరించారు. ఫైర్, ఎన్ఓసీ, జీహెచ్ఎంసీ అనుమతులు లేని వారిని ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సికిందరాబాద్ అగ్నిప్రమాదంలో ప్రమాదకరస్థాయిలో ఉన్న దక్కన్‌మాల్ భవనం కూల్చి వేసేందుకు ప్రయత్నిస్తున్నామని, మరో (జీహెచ్ఎంసీ) నివేదిక వచ్చాక కూల్చివేత పనులు చేపడతామని మంత్రి తలసాని అన్నారు. శనివారం మంత్రి తలసాని జీహెచ్ఎంసీ కమిషనర్ అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నల్లగుట్ట బస్తీలో మంత్రి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ అగ్నిప్రమాదంతో తమకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. భవనానికి ఆనుకుని బస్తీ ఉందని, భవనం ఒక్కసారిగా కూలితే తమ ఇళ్లు దెబ్బతింటాయని వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ భవనం కూల్చివేత సమయంలో అన్నిరకాలైన జాగ్రత్తలు తీసుకుం టామని, ఎవరికి ఇబ్బంది కలుగకుండా కూల్చివేస్తామన్నారు. కూల్చివేత సమయంలో ఎవరికైనా నష్టం జరిగితే వారికి నష్టపరిహారం చెల్లిస్తామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు.



సంఘటనా స్థలం వద్ద అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కనిపించకుండాపోయిన వారి జాడ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మూడు రోజులుగా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారని, అగ్నిమాపక సిబ్బంది, ఇతర శాఖల అధికారుల శ్రమను అభినందిస్తున్నానని అన్నారు. ప్రమాద సమయంలో అస్వస్థతకు గురైన ఎడిఎఫ్ఒ ధనుంజయ్‌రెడ్డి డిఒపి(డ్రైవర్ ఆపరేటర్) నర్సింగరావు ఆరోగ్యం నిల కడగా ఉందన్నారు. భవనాలకు అనుమతులపై పటిష్టమైన చట్టం రూపొందించామన్నారు. ప్రమాదం జరిగిన భవనం పక్కన బస్తీలో నివసించే పేదల విషయంలో సానుకూలంగా ఆలోచించి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు.

# రూ.1,800 కోట్లకు తగ్గిన రుణ పరిమితి

## బడ్జెట్‌లో రూ.16,320 కోట్లకు కుదింపు

### రుణ పరిమితి పెంపు యత్నాలు విఫలం

### తెలంగాణ అప్పులపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టత

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అప్పుల పరిమితి పెంపుపై తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అంతేకాకుండా ముందు అనుమతించిన రుణాల్లో కేంద్రం మళ్లీ 1,800 కోట్ల రూపాయల మేర కోత పెట్టింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ అంతర్గత నిర్వహణ విభాగానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రాసిన లేఖలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వార్షిక అంచనా బడ్జెట్‌లో 53,970 కోట్ల రూపాయల మేర అప్పులు చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. అయితే బడ్జెట్ వెలుపల కార్పొరేషన్ల పేరుతో అప్పులు చేసిన ప్రభుత్వం, వాటిని తిరిగి బడ్జెట్ నుండి చెల్లించడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. దీంతో ఆర్థిక నియంత్రణలో భాగంగా ఆ అప్పులను కూడా లెక్కలోకి తీసుకుని ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్ఎంబి)కి లోబడి 53,970 కోట్ల రూపాయల అప్పుల్లో 14,520 కోట్ల రూపాయలకు కోత పెట్టి 39,450 కోట్ల రూపాయలకే అనుమతించింది. అయితే తాజాగా ఇప్పుడు అందులో మళ్లీ 1,800 కోట్ల రూపాయలకు కోత పెట్టి 37,650 కోట్ల రూపాయల వరకే అప్పులు చేసేందుకు అవకాశం ఉన్నట్లు స్పష్టత వచ్చింది.

ఈ లెక్కన బడ్జెట్ అంచనాల్లో మొత్తం 16,320 కోట్ల రూపాయల మేర కోత పడింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 31 వేల కోట్ల రూపాయలకు పైగా అప్పులు సేకరించింది. కేంద్రం పెట్టిన కోతలు పోను ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా ఇంచుమించు 6,650 కోట్ల రూపాయలకే వీలుంది. అయితే ప్రతీ నెలా రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఖర్చులకే సరిపోని పరిస్థితి నెలకొంది. కేవలం అప్పుల మీదే ఆధారపడి రైతు బంధు తదితర పథకాలతో పాటు, ఇప్పటికే చేసిన అప్పులకు కిస్తీలు, వాటికయ్యే వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీలకే దాదాపు రూ.19 వేల కోట్లు కట్టాల్సి వస్తోంది. ఇందుకు గాను ప్రతీ నెలా సగటున రూ.1,583 కోట్లను బడ్జెట్ నుండి చెల్లిస్తోంది. ఇవి కాకుండా పాత అప్పుల వాయిదాలకు కనీసం నెలకు రూ.2 నుండి 3 వేల కోట్ల వరకూ కడుతోంది. ఈ నేపథ్యంలో ప్రతీ నెలా దాదాపు 4 వేల కోట్ల రూపాయలకు పైగా కిస్తీలు, వాటికి వడ్డీలకే పోతున్నాయి. దీనికి తగినట్లుగా ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నుండి మార్చి వరకూ చివరి క్వార్టర్‌కు సంబంధించి నిధుల వినియోగం పెద్దఎత్తున చేయాల్సి ఉంటుంది.

మరోపక్క ఈ ఏడాది సాధారణ ఎన్నికల నేపథ్యంలో రుణ మాఫీ, దళితబంధు, కల్యాణలక్ష్మి తదితర పథకాలను అమలు చేయడం తప్పనిసరి కావడంతో ఈ నిధులు ఏ మూలకూ రావనేది దాదాపు తేలిపోయింది. దీంతో రుణ పరిమితి పెంపుపై రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. గత కొంతకాలంగా అనుమతి కోసం రిజర్వ్ బ్యాంక్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. రుణ పరిమితి పెంచాలంటూ పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తులు చేశారు. ఈ విజ్ఞప్తులన్నింటినీ పరిగణలోకి తీసుకోకపోగా, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు అనుమతించిన అప్పుల్లో తాజాగా మళ్లీ 1,800 కోట్ల రూపాయల మేర కోత పెట్టడం వివాదాస్పదమవుతోంది.

## పోలీసు భర్తీలు.. లాంగ్‌జంప్, షార్ట్‌పుట్‌లో

# ఉత్తీర్ణులు కానివారికి మళ్లీ అవకాశం లేనట్లే

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టులతో పాటు అబ్కారీ, రవాణా శాఖలో కానిస్టేబుల్ పోస్టులకు జరుగుతు న్న భర్తీలకు సంబంధించి ఇటీవల పూర్తయిన లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు కొంతమేర మినహాయించి వారిని తుది రాత పరీక్షకు అనుమతించాలన్న వినతులు బుట్టదాఖలైనట్లుగా తెలుస్తోంది. ఈ పోస్టుల భర్తీకి వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల మధ్య రాత పరీక్షలకు రిక్రూట్‌మెంట్ బోర్డు సన్నాహాలు చేస్తుండడం తెలిసిందే. అయితే అంతకు ముందు జరిగిన లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో చాలా మంది నిరుద్యోగులు కొద్ది తేడాతో విఫలమవడం విదితమే. వీటి కన్నా ముందు జరిగిన కఠినమైన పరుగు పందెం పోటీల్లో వీరంతా ఉత్తీర్ణులవడం గమనార్హం. రాష్ట్ర పోలీసు శాఖలో తొలిసారిగా పురుషులకు 1600 మీటర్ల (ఒక మై లు దూరం), మహిళలకు 800 మీటర్ల పరుగు పందెం (అరమైలు దూరం) నిర్వహించగా ఇందులో చాలా మంది విజయం సాధించారు. కఠినమైన పరుగు పందెంలో విజయం సాధించడంతో లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో సునాయసనంగా గెలుపొందుతామని అభ్యర్థులు అనుకున్నా వీటి ప్రమాణాలు ఎక్కువగా వుండడంతో చాలా మంది కొద్ది తేడాతో విఫలమయ్యారు. ఇలా విఫలమైన వారు తమకు మరో అవకాశం ఇవ్వాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును కోరగా నిబంధనలు అందుకు అంగీకరించవని అధికారులు తిరస్కరించారు. ఈ విషయమై రాజకీయ నాయకులు, నిరుద్యోగ, యువజన సంఘాలు పోరాటం చేబట్టాయి. ఈ విషయంలో నిరుద్యో గులకు న్యాయం చేసే విధంగా సర్కారు నిర్ణయం తీసుకోవాలని ఆయా సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు.

**రాజకీయ నేతలు, యువజన, నిరుద్యోగ సంఘాలు వినతులు బుట్టదాఖలు**

ఇదే సమయంలో కొందరు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. అంతకు ముందు జరిగిన అర్హత పరీక్షలో తప్పుడు ప్రశ్నలకుగానూ ఏడు మార్కుల నుంచి పది మార్కులు కలపాలని కూడా రాజకీయ నాయకులు, నిరుద్యోగ, యువజన సంఘాలు సర్కారును కోరినా ఎలాంటి ప్రయోజనం కలగలేదు. హైకోర్టు నుంచి ఈ విషయమై అందిన ఉత్తర్వులను కూడా సర్కారు పట్టించుకోవడం లేదని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శించడం గమనార్హం. రాజకీయ నాయకులు, నిరుద్యోగ, యువజన సంఘాల పోరాటం ఇలా సాగుతుండగానే పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీల ప్రక్రియను వేగంగా కొనసాగిస్తోంది. అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి వెంటనే పరుగు పందెం, ఆ తరువాత క్రీడాంశలకు సంబంధించిన పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా 25 కేంద్రాలలో స్వల్ప వ్యవధిలోనే పూర్తి చేసింది. మొత్తం మీద పరుగు పందెం, ఆ తరువాత క్రీడాంశలకు సంబంధించిన పోటీలలో 50 శాతానికి పైగా అభ్యర్థులు విజయం సాధించారని బోర్డు ప్రకటించింది. అయితే ఇదే విషయమై బిఆర్ఎస్ పార్టీతో సన్నిహితంగా వున్న సిపిఐ పోలీసు కొలువుల్లో లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు కొంతమేర సడలింపు ఇచ్చి వారిని రాత పరీక్షకు అనుమతించాలని సిఎం కెసిఆర్‌కు లేఖ రాసింది. ఇదే సమయంలో కాంగ్రెస్, బిజెపిలు కూడా సర్కారుకు లేఖలు రాశాయి. వీటపై కూడా సర్కారు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. మరోవైపు వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల మధ్య జరగనున్న రాత పరీక్షలకు తమను అనుమతించాలని కోరుతూ లా ంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన పలువురు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరుగుతోందని నిరుద్యోగుల తరపున వాదిస్తున్న న్యాయవాదులు తెలిపారు. ఎలాగైనా తమను రాత పరీక్షలకు అనుమతించే విధంగా స ర్కారును ఒప్పించాలని లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులు రాజకీయ పార్టీల నేతలను కలుస్తూ విజ్ఞాపనలు అందజేస్తున్నారు. వీరి వినతులకు ఆయా పార్టీల నేతలు సానుకూలంగా స్పందించినా సర్కారు నుంచి ఇప్ప టి వరకు సానుకూల ప్రకటన వెలువడ లేదు. ఈ నేపథ్యంలో వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల మధ్య జరగనున్న పోలీసు కొలువుల తుది రాత పరీక్షకు లాంగ్ జంప్, షార్ట్ పుట్ అంశాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు అవకాశం లేనట్లుగానే తెలుస్తోంది.

## వరకట్న వేధింపుల కేసులో

# భార్య చనిపోయిన 15 యేళ్లకు కోర్టు తీర్పు



**ద్వారక(గుజరాత్), జనవరి 21:** వరకట్నవేధింపులు కింద నమోదయిన కేసు విచారణలో బాధిత మహిళ చనిపోయిన 15 ఏళ్ల తర్వాతకోర్టు నిందితులకు శిక్షవిధించింది. కేసులో నలుగురు నిందితులు దోషులేనని బాధిత మహిళ భర్త, మరుదులను నిందితులుగా నిర్ధారించి వరకట్నం కోసం ఆమెను వేధించి హింసించడంవల్ల మహిళ మృతికి కారకులయ్యారని నిర్ధారించింది. బాధిత మహిళ భర్త పవన్‌కుమార్, అత్త సత్‌బీరో, మామ కప్టన్ సింగ్, మరిది దల్జిత్‌సింగ్‌లపై కేసును విచారించింది. ప్రాసిక్యూషన్‌కథనం ప్రకారం భర్తి అనే మహిళ అసాధారణపరిస్థితుల్లో మృతిచెందినట్లు పోలీసులు కేసునమోదుచేసారని, 2007 అక్టోబరు 3వ తేదీ ఆమె మరణించిందని, పెళ్లి చేసుకున్న ఏడాదిన్నరకే ఆమె మరణించిందని వాదించింది. కేవలం అత్తమామలు, మరిది వేధింపులు, హింసకారణంగానే ఆమెచనిపోయిందని వాదనలు వినిపించింది. ప్రాసిక్యూషన్ తన వాదనలను నిరూపించుకోగలిగిందని, ఐపిసి 498, 304బి, 34 సెక్షన్లప్రకారం నిందితులు శిక్షార్హులేనని అదనపు సెషన్స్ జడ్జి గౌతమ్ మనన్ వెల్లడించారు. ఈనెల 30వ తేదీకి నిందితులకు శిక్షను విధించేందుకు వాయిదా వేసింది. అయితే కోర్టు ఈకేసులో నిందితులపై హత్య, సాక్ష్యాలను తారుమారుచేసారన్న అభియోగాలను కొట్టివేసింది. పోస్టుమార్టం నివేదికలోనే హత్యకు గురయినట్లు నివేదిక వచ్చిందని విచారణ అధికారి చెప్పినా ఆదిశగా దర్యాప్తుజరగలేదని అన్నారు. బాధిత మహిళ చనిపోవడానికిముందు వరకట్నం కోసం అత్తింటివారు వేధించారనడానికి ఒక్కసాక్ష్యంకూడా చూపించలేకపోయారన్నారు. అయితే బాధితురాలిపట్ల తరచూ వరకట్నవేధింపులు జరిగాయన్న వాదనలను అంగీకరించింది. నిందితులపై బాధిత మహిళ రాసిన లేఖలో తీవ్రస్థాయి ఆరోపణలున్నాయని వరకట్నం భారీగా తేవాలని హింసిస్తూ తనను కొడు తున్నారని, వెంటాడుతున్నారని ఆరోపించినట్లుపోలీసులు తెలిపారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ ఆనాడు ద్వారక పోలీస్‌స్టేషన్‌లోనే నమోదు చేసారు.

# దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో కిసాన్ క్రెడిట్ కార్డు

- బ్యాంకులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చిన కేంద్రం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రైతులు దరఖాస్తు చేసుకున్న రెండు వారాలు లేక 15 రోజుల్లో వారికి కిసాన్ క్రెడిట్ కార్డును అందించాలని బ్యాంకులకు కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి శనివారం బ్యాంకులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత రబీ (యాసంగి) సీజనులో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పరికరాలు కొనుగోలు చేసేందుకు డబ్బు అవసరం అవుతుంది. అయితే సన్న, చిన్నకారు రైతులతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన రైతులు ఈ వ్యవసాయ పెట్టుబడులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం, తెలంగాణ రాష్ట్రాలు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన, రైతు బంధు పథకాల పేరుతో ఏడాదికి ఎకరానికి రూ. 8-10 వేల వరకూ అందిస్తున్న ఆర్థిక సాయం పంటల సాగుకు అవసరమైన పెట్టుబడిలో ఏ మూలకూ సరి పోవడంలేదు. దీంతో సన్న, చిన్న, పేద రైతులు వ్యవసాయం చేసేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమస్యల నుండి రైతులను గట్టెక్కించేందుకు బ్యాంకుల నుండి కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టింది. బ్యాంకులు కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేయడంలో తీవ్ర ఉదాశీన వైఖరి అవలంబిస్తున్నాయి. ఫలితంగా రుణం సకాలంలో లభించక రైతులకు జాప్యం జరుగుతోంది. ఫిర్యాదులపై కేంద్రం స్పందించి కిసాన్ క్రెడిట్ కార్డు మంజూరుపై కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. రైతు దరఖాస్తు చేస్తున్న నిర్ణీతకాల వ్యవధిలో కిసాన్ క్రెడిట్ కార్డు పంపిణీ చేయాలని, లేదా చర్యలు తప్పవని హెచ్చరించింది.

# తెగుళ్ల నష్టాలతో పసుపు రైతులు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** పసుపు పంటపై తెగుళ్ల విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా పసుపునకు మర్రాకు తెగులు, దుంప తెగులు వంటివి వ్యాపించడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాష్ట్రంలోని నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో 64 వేల ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. పంట చేలల్లో నీరు నిలవడంతో తదుపరి రోజుల్లో మొక్కలు దుంప తెగులు సోకింది. ఈ దుంపకుళ్లు కారణంగా పసుపు మొక్కలు కింది భాగాన కొమ్ము పిలకలు నీటిలో మురిగిపోయాయి. ఈ విధంగా పసుపు చేలల్లో దాదాపు 60 శాతం పంట దుంపకుళ్లు సోకినట్లు రైతులు వాపోతున్నారు. దీనికి తగినట్లుగా పసుపు చేలకు మర్రాకు తెగులు వ్యాపిస్తోంది. వీటి కారణంగా దుంప తెగులు సోకిన పసుపు కొమ్ముల్లో ఎదుగుదల లోపం ఏర్పడి దిగుబడి తగ్గిపోయింది. సాధారణంగా ఎకరానికి 20 నుండి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే దుంప తెగులు కారణంగా ఎకరానికి 7 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని కన్నీటి పర్యాంతమవుతున్నారు. ఎకరం పసుపు సాగు చేయడానికి దాదాపు 1.20 లక్షల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. తెగుళ్లకు తోడు ప్రస్తుతం క్వింటాల్ ధర 6 వేల రూపాయల లోపు పలుకుతోందని అంటున్నారు. ఒకవైపు తెగుళ్లతో దిగుబడి తగ్గిపోగా, మరోవైపు ధరలు లేకపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ఈ ఏడాది నష్టాలు తప్పేటట్లు లేవని పలువురు రైతులు వాపోతున్నారు.

# భాషా పండితులకు పదోన్నతులివ్వాలని నేడు మంత్రులకు వినతి

## రేపు కలెక్టర్లు, డిఇఒలకు..: పండిత జెఎసి

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని భాషా పండితులకు పదోన్నతులు కల్పించడం కోసం పండిత జేఏసీ కార్యాచరణను ప్రకటించింది. ఉపాధ్యాయులకు బదలీలు, పదోన్నతులు కల్పిస్తున్న తరుణంలోనే తమకు కూడా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పండిత జేఏసీ నేడు(ఆదివారం) అన్ని జిల్లాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు పండిత జేఏసీ నాయకులు జగదీష్, నర్సిములు, చక్రవర్తుల శ్రీనివాస్, గౌరీ శంకర్, ఎండీ అబ్దుల్లా, కాంతికృష్ణ తెలిపారు.

శనివారం సమావేశమైన పండిత జేఏసీ రెండు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణను చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆదివారం మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చిన తరువాత సోమవారం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా కలెక్టర్లకు, డీఈవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. సోమవారం సాయంత్రం పండిత జేఏసీ మరోసారి సమావేశం నిర్వహించుకొని అన్ని అంశాలను సమీక్షించుకొని పూర్తిస్థాయిలో కార్యాచరణను ప్రకటిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో విడుదల చేయబోయే ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌లో కోర్టులో అప్‌గ్రేడ్ జీవోలపై ఉన్న స్టే ను తొలగింప చేసి.. అదే షెడ్యూల్‌లోనే భాషా పండితులకు పదోన్నతులు చేపట్టాలని పండిత జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

# డెక్కన్ స్పోర్ట్స్‌మాల్ అగ్నిప్రమాదం విషాదకరం



అగ్నిప్రమాద ప్రాంతంలోని బస్తీ వాసులతో మాట్లాడుతున్న సిపిఐ నేతలు

**మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి**

**అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఇ.టి. నర్సింహ**

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 21, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ దక్కన్ స్పోర్ట్స్ అగ్ని ప్రమాదం లో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం రూ 25లక్షల రూపాయల నష్ట పరిహారం అందించాలని హైదరాబాద్ జిల్లా సీపీఐ కార్యదర్శి ఈ టి నర్సింహ డిమాండ్ చేసారు. శనివారం అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీపీఐ హైదరాబాద్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఈ టి నర్సింహ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నివాసాల మధ్య అక్రమ కట్టడాలు, గోదాంల వల్ల స్థానికంగా నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన దుయ్యబట్టారు. అక్రమాలకు అలవాటు పడిన అధికారులు అక్రమ కట్టడాలను, పట్టించుకోకపోవడం వల్ల సికింద్రాబాద్ ప్రాంతంలో తరచూ ఇలాంటి భారీ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఆయన పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, ఫైర్‌సేఫ్టీ, విద్యుత్ సంబంధించిన అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి అన్ని సక్రమంగా ఉంటేనే అనుమతి ఇవ్వాలి కానీ ఇవేమి పట్టించుకోకుండా అనుమతులు ఇస్తుండటం వల్లనే ఇలా ప్రమాదాలకు కారణాలుగా మారుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను రెగ్యులరైజ్ చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రజలు నివాసం ఉండే ప్రాంతంలో కమర్షియల్, గోడౌన్ల నిర్మాణం జరగకుండా చూడాలని చట్టం చెబుతున్నా అక్రమంగా అనేక నిర్మాణాలు నగరంలో ఉన్నాయన్నారు. తక్షణమే వీటిని గుర్తించి కూల్చివేయాలన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను తక్కువ వేతనాలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని ఇక్కడకు తీసుకు వచ్చి షాపులలో పనిచేయించుకుంటున్నారని, వారికి ఏ విధమైనటువంటి సామాజిక బధ్రత రక్షణ లేకపోవడం మూలంగా మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఇటు వంటి సంఘటనపైన లేబర్ కమీషన్ తక్షణమే స్పందించి ఈ కమర్షియల్ బిల్డింగ్‌ల లేబర్ పర్మిషన్లను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేస్తుందన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, చుట్టు పక్కల దాదాపు 50ఇండ్లను ఖాళీ చేయించిన ప్రభుత్వ అధికారులు వారి బాధ్యతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు ఛాయాదేవి, స్టాలిన్, నెర్లకంటి శ్రీకాంత్, సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్, ఉమర్ధాన్, ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొమరెల్లి బాబు, సహాయ కార్యదర్శి ఎస్‌కే లతీఫ్, గువ్వల మల్లేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవనం అగ్ని ప్రమాదం జరిగిన భవనం వద్ద ఆందోళన చేసేందుకు సీపీఐ నేతలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

**అక్రమ కట్టడాలను కూల్చివేయాలి : టిజెఎస్ అధ్యక్షుడు కోదండరాం**

సికింద్రాబాద్ అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పరిశీలించారు. ఈ సందర్భంగా దక్కన్ మాల్‌లో జరిగిన అగ్నిప్రమాదం వల్ల సమీప బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, భయాందోళనలకు గురయ్యారని కోదండరాం అన్నారు. ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయాలన్నారు. నల్లగుట్ట, కాచిబౌలి బస్తీల వాసులు మూడు రోజులుగా పొగ, మంటలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారికి ప్రభుత ్వం వైద్యసహాయం అందించడంతో పాటు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేసారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేసారు.

# చలికాలంలో వెచ్చదనం కోసం..

ఉష్ణ ప్రాంతం కాబట్టి ఎండ కాస్త ఎక్కువైనా భరించగలం, కానీ నాలుగైదు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గితే మాత్రం 'ఇదే చలిరా బాబూ.. చంపేస్తోంది..' అనుకుంటూ గజగజ వణికిపోతాం. అందుకే ఇప్పుడు చలికాలాన్నీ నులివెచ్చదనంతో హాయిగా గడిపేందుకు ఎన్నో రకాల స్మార్ట్ గ్యాడ్జెట్లు మార్కెట్లోకి వస్తున్నాయి వాటిలో కొన్ని.

## కాంతిచికిత్స



చలికాలం రాగానే చాలామందికి బద్ధకంగా అనిపించి ఓ పట్టాన నిద్ర లేవరు. మరికొందరినైతే సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ (శాడ్) కూడా పట్టి పీడిస్తుంది. అంటే చిరాకు, ఏకాగ్రత లోపించడం, డిప్రెషన్.. వంటి వాటితో బాధపడుతుంటారన్నమాట. దీనంతటికీ కారణం పగటి వేళలు తగ్గిపోయి, ఎండ సరిగ్గా తగలకపోవడమే అందుకే ఈ మధ్య చాలామంది ఆ కాలంలో లైట్ థెరపీలకీ వెళుతున్నారు. అయితే బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఒంటికి కాస్త డి-విటమిన్ వచ్చేలా కేరెక్స్, ఆరా, ఫిలిప్స్, నార్తర్న్ లైట్ టెక్నాలజీ.. వంటి కంపెనీలు సన్ ల్యాంపుల్ని డిజైన్ చేస్తున్నాయి. ఎండలోకి వెళ్లే తీరిక లేనివాళ్లు కనీసం ఓ అరగంటైనా ఈ సన్ ల్యాంప్ దగ్గర కూర్చోవడంవల్ల అది జీవగడియారాన్ని ప్రేరేపించ 'శాడ్ బారిన పడకుండా చేస్తుంది అంటున్నారు. ముఖ్యంగా దీన్నుంచి వెలువడే కాంతి శరీరంలోని సెరటోనిన్ శాతాన్ని పెంచడంవల్ల డిప్రెషన్ రాకుండా ఉంటుందట.

## కాఫీ.. చల్లారకుండా...



ఉదయం లేవగానే వేడివేడి కాఫీనో టీనో ఆగకుండా ఉండలేనివాళ్ల సంఖ్యే ఎక్కువ. అయితే చలికాలంలో మాత్రం కాఫీని కప్పులో పోసుకుని బాల్కనీలోకి వచ్చి కూర్చునేసరికే అది కాస్త చల్లగా అయిపోతుంటుంది. అదీగాక కొందరికి ఓ చేత్తో న్యూస్ పేపర్ పట్టుకుని మరో చేత్తో కాఫీ మగ్గు పట్టుకుని మెల్లగా కాఫీ తాగుతుంటారు. కానీ చదవడంలో మునిగిపోయి కాఫీ సిప్ చేయడం మర్చిపోతే, కప్పులో మిగిలిన కాఫీ మొత్తాన్నీ చల్లగానే తాగాలి. ఆ బాధ లేకుండా ఉండేందుకే ఇప్పుడు టీ, కాఫీ వార్మర్స్ వస్తున్నాయి. వీటి మీద కప్పు లేదా మగ్గు పెట్టుకుంటే అది ఎంతసేపయినా వేడిగానే ఉంటుంది. ఇది చెంతన ఉంటే మెల్లగా తాగినా కాఫీ చల్లారిపోదు.

## తొడుక్కునే దుప్పట్లు





కొందరు పుస్తకం చదువుతూ నిద్రపోతే మరికొందరు పడుకునేముందు కాసేపు టివినో ఫోన్ చూస్తుంటారు. అయితే చలికాలంలో ఈ పనులూ చేసేటప్పుడు రగ్గు కప్పుకుని పుస్తకం చదవాలన్నా టివి చూడాలన్నా కాస్త ఇబ్బందే. అందుకే రాడిసన్, ద కంఫీ, మలాకొ. వంటి కంపెనీలు తొడుక్కునే బ్లాంకెట్లనీ శాలువాల్నీ తీసుకొస్తున్నాయి. వీటిని తొడుకుని హాయిగా ఆయ పనులన్నీ చేసువచ్చన్నటిమా. ఉదయాన్నే వీటితోనే లేచి హాల్లోకి వచ్చి కూర్చుని కాఫీ కూడా తాగొచ్చు. అయితే వాతావరణం మరీ చల్లగా ఉంటే ఎంత మందపాటి రగ్గు కప్పుకున్నా ఓ పట్టాన నిద్రపట్టదు. అలాంటి పరిస్థితులకి అనుగుణంగా ఎలక్ట్రిక్ బెడ్‌షీట్లనీ రగ్గుల్నీ కూడా తయారుచేస్తున్నాయి అనేక కంపెనీలు. బ్యాటరీతో పనిచేసే ఈ బ్లాంకెట్లతో అవసరాన్ని బట్టి ఉష్ణోగ్రతని సెట్ చేసుకోవచ్చు. కొంతసేపటికి ఆటోమేటిగ్గా స్విచాఫ్ అయిపోవడంతోపాటు ప్లగ్ కార్డ్‌ను తీసేస్తే మిలిగిన కాలాల్లోనూ వాడుకోవచ్చట.

**వెచ్చని టోపీతో మధురగానం...** తలకి మఫ్లర్ చుట్టుకుని ఒంటికి స్వెటర్ వేసుకుని చెవిలో ఇయర్ ఫోన్స్ లేదా పాడ్స్ పెట్టుకుని పాటలు వింటూ వాకింగ్ చేయడం చాలామందికి ఈమధ్య ఓ అలవాటుగా మారింది. అయితే చలికాలంలో మఫ్లర్ చుట్టుకున్నప్పుడు మళ్లీ ఇయర్ ఫోన్స్ పెట్టుకోవాలంటే కాస్త ఇబ్బందే. అందుకే ఇప్పుడు వైర్‌లెస్ టెక్నాలజీతో పనిచేసే స్మార్ట్ హెడ్‌ఫోన్ క్యాప్స్ వస్తున్నాయి. ఫోన్ అప్ ద్వారా పాటల్ని సెలెక్ట్ చేసుకోవడంతోపాటు వాల్యూమ్ పెంచి తగ్గించుకునేందుకు వీలుగా దీనికి బటన్ కూడా ఉంటుంది. క్యాప్‌లోని లిథియం అయాన్ బ్యాటరీ ఆరుగంటపాటు పనిచేస్తుంది. ఆ తర్వాత దీన్ని మళ్లీ యుఎస్‌బి కేబుల్ ద్వారా ఛార్జ్ చేసుకోవచ్చు. చలికాలంలో వేళ్లు వంకర్లు పోకుండా చేతులకు గ్లోవ్స్ వేసుకుంటారు కొందరు. అయితే ఇవి వేసుకున్నప్పుడు స్మార్ట్ ఫోన్‌నూ ఆపరేట్ చేయడం చాలా కష్టం. అందుకే ఏ మాత్రం తడిని పీల్చని పలుచని కార్బన్ మైక్రోఫైబర్లతో గ్లోవ్స్‌ని రూపొందించారు. ఇవి వేసుకుంటే వర్షంలోనే కాదు, మైనస్ డిగ్రీల చలిలోనూ ఫోన్‌ని ఆపరేట్ చేయవచ్చట. మరీ ముఖ్యంగా మోటార్‌సైకిల్, సైకిల్ రైడ్‌లకి వెళ్లేవాళ్లకి ఇవి ఎంతో ఉపయోగపడతాయి అంటున్నారు ఉత్పత్తిదారులు.



**నులి వెచ్చని సాక్సు...** వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎంత పడిపోయినా పాదాలూ అరిచేతులూ వెచ్చగా ఉంటే చలి అంతగా బాధించదు. అందుకే చాలా మంది ఈ కాలంలో బయటకు వెళ్లినప్పుడే కాదు, పడుకునేటప్పుడూ సాక్సు వేసుకుంటారు. వీటివల్ల పాదాలూ పగడలకుండా ఉంటాయి. అయితే ఇప్పుడు సాక్సుని కూడా రీఛార్జబుల్ బ్యాటరీతో పనిచేసేలా తయారుచేస్తున్నారు. మొబైల్ ఆఫ్ ద్వారా వీటిల్లోని ఉష్ణోగ్రతనీ సెట్ చేసుకోవచ్చట. పరారుణ కాంతిని గ్రహించడం ద్వారా పనిచేసే ఈ సాక్కు త్వరగా వేడెక్కి రక్త ప్రసరణకు ఇబ్బంది లేకుండా చేస్తాయి.



ఆర్థ్రయిటిస్ తోనూ కీళ్లనొప్పులతోనూ తరచూ ఫ్లూ జ్వరాలతోనూ బాధపడేవాళ్లకి ఇవెంతో మేలు. కేవలం సాక్సు మాత్రమే కాదు, షూలో పెట్టుకునేందుకూ హీటెకడ్ ఇన్‌సోల్స్ కూడా దొరుకుతున్నాయి. వీటిని సైతం ఫోన్ ఆప్ ద్వారా ఉష్ణోగ్రతని పెంచుకుంటూ తగ్గించుకుంటూ సరిచేసుకోవచ్చు. తెల్లవారుజామున లేదా రాత్రివేళ బయట తిరిగేట ప్పుడూ, హైకింగ్, ట్రెకింగ్‌లకు వెళ్లేవాళ్లకూ ఈ రకమైన సోల్స్ వల్ల చలిబాధ లేకుండా ఉంటుంది.

**గది వెచ్చగా....** గది ఉష్ణోగ్రత పెరిగి వేడిగా అయ్యేందుకు సెరామిక్ ప్యాన్ హీటర్ల నుంచి ఎలక్ట్రిక్ రేడియేటర్స్ వరకూ చాలానే రకాలున్నాయి. అయితే నేలమీద పెట్టే ఈ హీటర్లతో పిల్లలున్న ఇంట్లో కాస్త జాగ్రత్తగానే ఉండాలి. మర్చిపోయి గబాల్న పట్టుకున్నా లేదా



పొరబాటున కాలో చెయ్యో తగిలినా కాలుతుంది. అందుకే ఇప్పు ప్లగ్‌లోనే పెట్టుకునే పోర్టబుల్ హీటర్లు వస్తున్నాయి. 500 వాట్స్ సామర్థ్యంతో పనిచేసే ఈ హీటర్లని ఎలాంటి వైర్ల సాయం లేకుండా నేరుగా ప్లగ్‌లో పెట్టుకోవచ్చు. రిమోట్ సాయంతో ఆన్, ఆఫ్ చేసుకోవడంతోపాటు ఉష్ణోగ్రతని తగ్గించి, పెంచుకోవచ్చు కూడా. గది వేడెక్కేవరకూ ఉండి దానంతటదే ఆఫ్ అయిపోయేలా టైమ్ కూడా సెట్ చేసుకోవచ్చు. వీటిల్లోనే గది మొత్తానికి కాకుండా మనం కూర్చున్న చోట వాతావరణం కాస్త వెచ్చగా ఉండేలా చేసే పోర్టబుల్ టేబుల్ టాప్ హీటర్లు కూడా ఉన్నాయి. వీటినైతే మన వెంట ఆఫీసుకీ తీసుకెళ్లి వాడుకోవచ్చన్నమాట.

## పట్టుకునే హీటర్లు.



ఎంత చలిగా ఉన్నా స్వెటర్లుగానీ చేతులకి గ్లోవ్స్‌గానీ తలకి క్యాప్‌గానీ పెట్టుకోవడం అంటే కొందరికి చిరాకు. పిల్లలైతే మరీనూ. కానీ అరిచేతులూ పాదాలకీ మరీ చల్లదనం సోకితే రక్తప్రస రణ సరిగ్గా ఉండదు. అందుకే అరిచేతు ల్ని వెచ్చగా ఉంచేం దుకు ఇప్పుడు ఈ పోర్టబుల్ హా ్యండ్ వార్మర్స్ వస్తున్నాయి. జేబులో కూడా పట్టే వీలున్న వీటిని అరిచేతిలో పెట్టుకుంటే చాలు, దాన్నుంచి వచ్చే వేడికి రక్తప్రసరణ మెరుగవుతుంది. వీటిని చేతిలో పెట్టుకుని పడుకోవచ్చు కూడా. మిక్కీ. మౌస్, పిల్లి.. వంటి బొమ్మలతోనూ రకరకాల ఆకారాలతోనూ వస్తున్న ఈ వార్మర్స్‌ని పట్టుకోవడానికి పిల్లలూ ఇష్టపడతారు. స్విచ్‌ఆన్ చేయగానే సెకన్లలో వేడెక్కే ఈ వార్మర్‌ని ఒకసారి ఛార్జ్ చేస్తే ఐదు నుంచి పన్నెండు గంటలవరకూ



వెచ్చదనాన్ని అందిస్తాయి. పైగా వీటిని ఫోన్. ట్యాబ్ వంటి వాటిని ఛార్జ్ చేసుకునే పవర్ బ్యాంక్‌గానూ వాడుకోవచ్చుట. ఒకటికి రెండ పనులున్నమాట. బాగుంది కదూ! ❑

# బాధిత మహిళల ఆర్థిక స్వావలంబన కోసం..



ప్రతిష్ఠాత్మకమైన ఇఎంబిఒ యంగ్ ఇన్వెస్టిగేటర్ నెట్‌వర్క్‌లో స్థానం సంపాదించుకోవడం విశేషం.

ఈ రోజుల్లో ఎంతోమంది మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తూ.. తమదైన ముద్ర వేస్తున్నారు. మరికొంతమంది విదేశాల్లో కూడా తమ ప్రతిభను చాటుకుంటున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన డాక్టర్ మహిమా స్వామి ఈ జాబితాలో చేరారు. ప్రతిష్ఠాత్మకమైన యూరోపియన్ మాలిక్యులర్ బయాలజీ ఆర్గనైజేషన్‌లో యంగ్ ఇన్వెస్టిగేటర్ నెట్‌వర్క్‌లో సభ్యురాలిగా ఎంపికయ్యారు. యూరప్‌లోని మేటి బయాలజీ నిపుణుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఇఎంబిఒ ఐరోపాలోనే ప్రతిష్ఠాత్మక సంస్థ ఇందులోని దాదాపు 1900 మందికి పైగా శాస్త్రవేత్తలు లైఫ్ సైన్సెస్ అంశాలపై నిరంతరం వివిధ పరిశోధనలు చేస్తుంటారు. లైఫ్ సైన్సెస్‌లో పరిశోధనలు చేస్తోన్న విద్యార్థులకు ఈ సంస్థ ఆర్థిక సహాయంతో పాటు వివిధ రకాల సదుపాయాలను కల్పిస్తుంటుంది. ఇందుకోసం ఏటా ప్రతిభావంతులైన పరిశోధకులను ఎంపిక చేసి యంగ్ ఇన్వెస్టిగేటర్ నెట్‌వర్క్‌లో భాగం చేస్తుంటుంది. ఇందులో స్థానం సంపాదించుకోవడం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉండే లైఫ్ సైన్సెస్ విద్యార్థులు ప్రయత్నిస్తుంటారు. తాజాగా మన దేశానికి చెందిన డాక్టర్ మహిమాస్వామి ఈ ఘనత దక్కించుకున్నారు.

**పేగుల రోగ నిరోధక వ్యవస్థపై పరిశోదనలు..** బెంగళూరుకు చెందిన మహిమా స్వామి బిట్స్ పిలానీ (రాజస్థాన్)లో బయలాజికల్ సైన్స్ అండ్ బయోటెక్నాలజీ పూర్తి చేశారు. పిహెచ్‌డి కోసం జర్మనీ వెళ్లిన ఆమె ల్యాబ్‌లో పలు పరిశోధనలు చేశారు. ఆ తర్వాత లండన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ చేశారు. ఈ క్రమంలో పేగుల్లోని రోగనిరోధక వ్యవస్థపై పలు పరిశోధనలు నిర్వహించారు. అలా 2013లో స్కాట్లాండ్‌లోని దూన్‌డీ యూనివర్సిటీలో స్వతంత్ర పరిశోధకురాలిగా చేరారు. ప్రస్తుతం అక్కడ ఉన్న పరిశోధనా బృందానికి ఆమె సారథ్యం వహిస్తున్నారు. 2017లో వెల్‌కం ట్రస్ట్ అందించే 'సర్ హెన్రీ డేల్ ఫెలోషిప్'కి సైతం ఎంపికయ్యారు మహిమ. తాజాగా

**లక్షల్లో ఆర్థిక సహాయం. ...** ఈ ఏడాది యంగ్ ఇన్వెస్టిగేటర్ నెట్‌వర్క్‌లో మహిమతో పాటు మరో 23 మంది స్థానం సంపాదించుకున్నారు. ఈనెట్వర్క్‌లో ప్రస్తుతం 135 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో స్థానం సంపాదించిన వారికి రెండో సంవత్సరం 15 వేల యూరోల (దాదాపు 13 లక్షల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. అలాగే వివిధ గ్రాంట్‌ల ద్వారా నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి 10 వేల యూరోలు ( దాదాపు 9 లక్షల రూపాయల) అందుకునే అవకాశం కూడా ఉంది. వీటితోపాటు పరిశోధనలకు అవసరమైన వివిధ రకాల సదుపాయాలను కల్పిస్తుంటారు. ఈ సందర్భంగా మహిమ మాట్లాడుతూ ' ఈ నెట్‌వర్క్‌లో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఐరోపా వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన యువ శాస్త్రవేత్తలను కలుసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇందులో భాగం కావడం ద్వారా మా పరిశోధనలు మరింత ముందుకు వెళతాయని భావిస్తున్నా, ఈ అవార్డును గెలుచుకోవడానికి సహాయపడిన నా బృందానికి, మెంటార్లకు కృతజ్ఞతలు అని పేర్కొంది. ❑

# ఆత్మవిశ్వాసం పెరగాలంటే..



- ఒక వ్యక్తి కూర్చునే విదానాన్ని బట్టి అతని ప్రవర్తన, మానిక పరిస్థితి అంచనా వేయవచ్చు లేచినప్పుడు నిటారుగా నిలబడటం, కళ్లలోకి చూస్తే మాట్లాడటం వంటివి పాజిటివ్ ఇంప్రెషన్‌ను కల్గిస్తాయి.
- ఉత్సాహపూరిత ప్రసంగాలను వినడం ద్వారా కాన్ఫిడెన్స్‌ను బిల్డప్ చేసుకోవచ్చు.
- నలుగురిలో మాట్లాడటానికి ఇబ్బంది పడే వారు అద్దం ముందు నిలుచుని మాట్లాడటం ప్రాక్టీసు చేయడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు.
- ఇతరులను పొగడటానికి వెనకంజవేయవద్దు. ఇతరుల్లోని గొప్పతనాన్ని చూడటం ద్వారా మీలో ఉన్న గొప్పతనం బయటకు వస్తుంది. మిమ్మల్ని మీరు తక్కువగా చేసి చూడటం మొదలవుతుంది. దీన్ని అధిగమించాలంటే ఇతరులను పొగడాల్సిదే.
- స్కూల్‌లో, ఆఫీసులో, పబ్లిక్ మిటింగ్‌ల్లో వెనక కూర్చోవడానికి ప్రయత్నిస్తుంటారు. నలుగురి దృష్టిలో పడకుండా ఉండటం కోసమే ఇలా చేస్తుంటారు. ఇది వారిలో ఆత్మవిశ్వాసం లోపించిందనటానికి నిదర్శం ఇటువంటి వారు ముందు వరుసలో కూర్చోవడం ద్వారా సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డప్ చేసుోచ్చు.
- గ్రూప్ డిస్కషన్లలో మాట్లాడకుండా కూర్చోకూడదు. భయం వల్ల కొందరు అసలు నోరెత్తరు. కానీ అది అనవసర భయమనే విషయాన్ని గుర్తించాలి. అందరిలోనూ ఆ భయం ఉంటుంది. ఎదుటి వాళ్లు ఏమనుకుంటారో అని కూర్చోకుండా మీకు తెలిసిన విషయాన్ని ధైర్యంగా చెప్పడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- ప్రతిరోజు వ్యాయామం చేయడం అవసరం ఫిజికల్ ఫిట్‌నెస్ ఉన్నప్పుడే కాన్ఫిడెన్స్‌గా ఉండటం సాధ్యమవుతుంది.
- ఒక వ్యక్తి మనోభావాలను దుస్తులు ప్రతిబింబిస్తాయి. కాబట్టి ఎదుటి వారిని ఆకట్టుకునే విధంగా ఫిజికల్ అప్పియరెన్స్ ఉండేలా చూసుకోవాలి. ❑

# దీంతో అద్భుత ఆరోగ్య ప్రయోజం



**మనం వాడే ప్రతీ ఆహార పదార్థానికీ రకరకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. వాటిలో ఇండియన్స్ ఎక్కువగా వాడేవి. ఎంతో టేస్టీగా ఉండే పన్నీరుతో ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో తెలుసుకుందాం.**

- కెన్సర్లలో ఎక్కువ మందికి సోకుతున్న రొమ్ము కెన్సర్ నుంచి మనల్ని కాపాడుతుంది పన్నీర్.
- పాల ఉత్పత్తి అయిన పన్నీర్‌లో ఉండే కాల్షియం, విటమిన్ డి, రొమ్ము కెన్సర్‌ను దూరం చేస్తాయి.
- గుండెకు ఎంతో మంచిది, రక్తంలోని షుగర్ లెవెల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. పన్నీర్‌లో ఉండే మెగ్నీషియం క్యాటలిస్టులా పనిచేస్తుంది. జీవ రసాయనిక చర్యల్ని ప్రోత్సహిస్తుంది.
- బాడీలోని వివిధ రకాల ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. కండరాలు మరియు నాడుల పనితీరు నిర్వహిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- పన్నీర్ ఎముకలకు బలాన్ని ఇస్తుంది. మనకు రోజూ అవసరమయ్యే కాల్షియంలో 8% దీని ద్వారా లభిస్తుంది. ఇది పిల్లల, పెద్దల్లో ఎముకలు పటిష్టంగా ఉండేలా చేస్తుంది. గర్భవతులైన మహిళలకు అత్యుత్తమైన ఆహారం పన్నీరు.
- పన్నీర్‌లో ఉండే ఎక్కువగా ఉండే ప్రోటీన్‌లు శాఖాహారులకు శక్తినిస్తాయి. పన్నీరులో ఫాస్పరస్, ఫాస్ఫేట్‌లు జీర్ణక్రియను మెరుగుపరచి.. మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసి,



వాటిని వెలికి తీయడానికి సహాయపడతాయి.

- పన్నీర్‌లో ఉండే వే ప్రోటీన్.. ఎంతో ఆరోగ్యవంతమైనది. ప్లేయర్లు, ఎక్సర్‌సైజ్‌లు చేసేవారికి ఇది మేలు చేస్తుంది. ఇది చాలా నెమ్మదిగా జీర్ణం అవుతూ, నెమ్మదిగా శక్తిని ఇస్తుంది. అందువల్ల అథ్లెటిక్స్, బాడీ బిల్డర్‌లు, స్ప్రింటర్‌లు, ఆటలు ఆడేవారికి ఇది ఎంతో మేలైన ప్రోటీన్.
- పన్నీర్‌లో ఉండే జింగ్ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికీ, జీర్ణక్రియకు, షుగర్‌ని కంట్రోల్ చెయ్యడానికీ, టెన్షన్లను తట్టుకోవడానికీ ఉపయోగపడుతుంది.
- రేచీకటిని నిరోధిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఆకలి లేకపోవడాన్ని నిరోధిస్తుంది. అలాగే ప్రొస్టేట్ రుగ్మతలను పోగొట్టి, వివిధ రకాల అంటువ్యాధులకు విరుద్ధంగా పోరాడుతుంది.
- పన్నీర్‌లో పొటాషియం కూడా ఉంటుంది. ఇది బాడీలో ద్రవ నియంత్రణ పదార్థాంగా పనిచేస్తుంది. కడంరాలు, బ్రెయిన్‌లో ముఖ్యమైన పదార్థాం. రెగ్యులర్‌గా పన్నీరు తింటే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.
- సెలీనియం ఎక్కువగా ఉండే పన్నీరును వంటల్లో వేసుకొని తినడం వల్ల మన శరీరంలోకి విష వ్యర్థాలు రాకుండా ఉంటాయి. అలాగే రకరకాల వ్యాధుల నుంచీ తప్పించుకోవచ్చు. ❑

# దేవుడే నడిపిస్తాడు..

అంతర్వాణి

నేడు జనవరి 22వ తేదీ. అప్పుడే 'కొత్త సంవత్సరం'లోకి ప్రవేశించి నాల్గవ ఆదివారం వచ్చేసింది. ఎన్నో కొత్తకొత్త నిర్ణయాలు, కొత్త తీర్మాణాలు. గత సంవత్సరం ఉన్నట్లుగా ఉండకూడదు. దేవుడు మెచ్చేలా ఉండాలి. ప్రార్థనకు, ఆధ్యాత్మిక జీవితానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అనుసరించాలి. టైమ్‌కి చర్చికి వెళ్లాలి, క్రమం తప్పకుండా బైబిల్‌ను చదవాలి. ఇలా ఒక్కటేమిటి ఎన్నో తీర్మానాలు తీసుకుని వుంటారు. దేవుడి చిత్తానుసారంగా నూతన సంవత్సరంలో అడుగుపెట్టాం. కానీ మొదటిరోజు గతించిపోయింది, మొదటివారం గతించిపోయి, నాల్గోవ వారంలో ప్రవేశించాం. అయినా మనం అనుకున్న తీర్మాణాలను నెరవేర్చడంలో విఫలమవుతున్నాం. మళ్లీ పాత జీవితమే. ఏమీ కొత్తదనం లేదు. ఇక ఇంతే మన



బతుకు, మార్పు అనేది మనకు అసాధ్యం, అది మన వల్ల కాదు. దేవుడు మెచ్చేలా జీవించాలి అంటే ఆ వరం కలిగి ఉండాలి. ఇలాంటి భావాలతో ఉంటూ, ఆశించిన ఆధ్యాత్మిక జీవితాన్ని గడపలేక, నిరాశతో నిర్వేదంతో సంవత్సరాలు గడిపేస్తున్నవారు ఎందరో ఉన్నారు. అయినా పర్వలేదు. కొత్త సంవత్సరం అనేది మనం పెట్టుకున్న సమయం, దేవుడి దృష్టిలో 'ఒక దినము వెయ్యి సంవత్సరములవలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినమువలెను ఉన్నవి' (2 పేతురు 3:8). నూతన సంవత్సరం మనం అనుకుని తీసుకునే ఒక నిర్ణయం, తీర్మాణమే తప్ప అది దేవుడి దృష్టిలో కాదు. మనం అనుకుని, జీవించడం కాదు. ఆ బలం దేవుడే ఇవ్వాలని వేడుకోవాలి. ఆశ, పట్టుదల అనేది ఉంటే మనకు అసాధ్యమైనది ఏదీ లేదు. ఆశతో దేవుడి సన్నిధిలో మన బలహీనతల్ని ఒప్పుకుని, ఆయన శక్తిని ఆశ్రయించినప్పుడు తప్పనిసరిగా మనం అనుకున్న ఉన్నతమైన భక్తి జీవితాన్ని, బలమైన విశ్వాసాన్ని కొనసాగించవచ్చు. 'ఏలయనగా ఆశగల ప్రాణమును ఆయన తృప్తిపరచియున్నాడు' (కీర్తన 107:9). కాబట్టి మొదట మనం దేవుడి సన్నిధిలో మన ఆశల్ని, ఆశయాల్ని విన్నవించుకున్నప్పుడు దేవుడే మనల్ని భక్తి, నీతిమార్గంలో నడిపిస్తాడు.

-పి.వాణిపుష్ప

# ఇళ్లలో గాలి శుభ్రపరిచే మొక్కలు



**జడ్‌జడ్ ప్లాంట్...** ఇది కంప్లీట్ ఇండోర్ ప్లాంట్. ట్రాఫిక్ పొల్యూషన్ నుంచి వచ్చే జిలైన్, థైలైన్, షెమికల్స్ అనే బ్యాక్టీరియాను నిర్మూలించడం లో ఈ మొక్క బాగా ఉపయోగపడుతుంది. వారని కోసారి నీళ్లు పోస్తే చాలు. వంద చదరపు అడుగుల్లో రెండు మొక్కలు పెంచుకోవాలి. డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్ 1000 చదరపు అడుగులు అనుకుంటే 20 మొక్కలు పెంచు కుంటే సరిపోతుంది.

**రబ్బర్ ప్లాంట్ ..ఇది** ఫర్నిచర్ నుంచి వచ్చే డస్ట, డిటర్జంట్స్ నుంచి వచ్చే కెమికల్స్‌ను నిర్మూ లిస్తుంది. కుక్కలు, ఇతర పెట్స్ నుంచి వచ్చే బ్యాక్టీరియాను క్యాచ్ చేస్తుంది. కలర్స్ నుంచి వచ్చే హానికరమై రసాయ నాలను తొలగిస్తుంది. ఇంట్లో పెట్స్ ఉన్న వారుఈ మొక్కను తప్పక పెంచుకోవాలి.

**పీస్ లిల్లీ ..** ఇది ఇంట్లో పుస్తకాలు ఉంచే ప్రదేశాల్లో, లైబ్రరీలో పెంచుకోవాల్సిన మొక్క. బుక్స్ దగ్గర పేరుపోయే డస్ట్‌ను క్యాచ్ చేస్తుంది. ఇంట్లోకి ఎలివేషన్ వచ్చే ప్రదేశాల్లో అంటే కిటికీల దగ్గర పెంచుకోవచ్చు. కరెన్స్ దగ్గర పెట్టుకోవచ్చు. చెదలు రాకుండాకాపాడుతుంది.

**స్నేక్ ప్లాంట్..** (మదరిల్లా టాంగ్ ప్లాంట్) చాలామంది ఇళ్లలో, గార్డెన్‌లలో కనిపించే మొక్క ఇది. బెంజిన్ లాంటి హానికర రసాయలను ఈ మొక్క నిర్మూలిస్తుంది. రెండు వారాలకోసారి నీళ్లు లేదా నెలకోసారి నీళ్లు అందించినా సరిపోతుంది. ❑

**చెలీ చిట్కా**

చలి కాలంలో బ్యాక్టీరియా పెచ్చరిల్లే వకాశముంది. వైరల్ ఫీవర్లు దాడి చేయకుండా ఉండాలంటే రోగనిరోధక శక్తిని పెంచే వెల్లుల్లి తినాలి. ..

# ఐసిసిలో సైబర్‌మోసం

## రూ.20 కోట్లు నష్టపోయిన అంతర్జాతీయ మండలి

**దుబాయి:** సైబర్‌మోసాలు ఇటీవలికాలంలో భారీగా కొనసాగుతున్నాయి. సామాన్యులనుంచి వివిఐపిలవరకూ సైబర్‌నేరాలబారినపడుతున్నవారిసంఖ్య పెరుగుతోంది. క్రికెట్ వ్యవహారాలను పర్యవేక్షించే అంతర్జాతీయ క్రికెట్‌మండలి ఐసిసి కూడా ఆన్‌లైన్‌మోసం బారినపడింది. ఐసిసి సుమారు 2.5 మిలియన్ డాలర్లు అంటే 20 కోట్లరూపాయలునష్టపోయింది. ఐసిసి వరుసగా నాలుగోసారి మోసపోయింది. ఆన్‌లైన్ సైబర్‌దాడికారణంగా 20 కోట్లుకోల్పోయిన ఐసిసి ఆవిషయమై నోరుమెదపడంలేదు. క్రికెట్‌కౌన్సిల్ నాలుగుపర్యాయాలు ఆన్‌లైన్‌మోసానికి లోనయింది. దుబాయ్‌లోని ఐసిసిప్రధాన కార్యాలయంలోని అధికారులెవరికీ సైబర్‌మోసాలపరంగా అనుమానం రాలేదు. ఆన్‌లైన్ లావాదేవీలద్వారా నగదును అమెరికాకు బదలీచేయడంతో ఆదేశంనుంచే మోసానికి పాల్పడి ఉంటారని అంచనా. ఈ ఆన్‌లైన్‌ఫ్రాడ్ క్రికెట్ అభివృద్ధికి ఆటంకం కలిగించేమొత్తంలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. బిజినెస్ ఈమెయిల్‌కాంప్రమైజ్(బిఇసి)చేయడంద్వారామోసగాళ్లు ఈమోసానికి పాల్పడినట్లు అంచనావేసారు. దీనినే ఇమెయిల్ అకౌంట్ కాంప్రమైజ్ అని పిలుస్తారు. ఎఫ్‌బిఐ కూడా ఈ విధానంలోనే ఎక్కువమోసాలుజరుగుతున్నాయి. ఈస్కామ్‌లో ఫిషింగ్‌ఇమెయిల్స్ పంపించడంద్వారా మోసగాళ్లు ఎదుటివారికి ఎరవేస్తారు. స్పందించిన వెంటనే ఖాతాలో ఉన్న నగదు దోచేస్తారు. అమెరికా ప్రభుత్వానికి ఎఫ్‌బిఐ అందించిన నివేదికప్రకారం ఇంటర్నెట్‌క్రైమ్‌కంట్రోల్‌సెంటర్‌కు గత ఏడాది బిఇసి సంబంధించిన నేరాలు 2.4 బిలియన్ డాలర్లవిలువైనవి అందాయి. వీటిలో తెలిసిన ఇమెయిల్ అడ్రస్‌నుంచి లేదా మనకు తెలిసిన ఇమెయిల్ ఐడిని పోలిన అడ్రెస్‌నుంచి బాధితుడికి మెయిల్‌పంపిస్తారు. ఆమెయిల్ తమ క్లయింట్ లేదా తెలిసిన వ్యక్తులే అని భావించి చెల్లింపులుజరిపితే ఆవి మోసగాళ్ల ఖాతాలోకి చేరతాయి.



# రెండో వన్డేలో భారత్ ఘన విజయం

## కివీస్‌తో వన్డే సిరీస్ 2-0 తేడాతో కైవసం

**రాయ్‌పూర్:** న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలోభారత్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయంసాధించింది. 109 పరుగుల స్వల్పలక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఓపెనర్లు రాణించడంతో 20.1 ఓవర్లలోనే లక్ష్యం ఛేదించింది. కెప్టెన్ రోహిత్‌శర్మ 51 పరుగులుచేసి అర్ధసెంచరీనమోదుచేసాడు. శుభ్‌మన్‌గిల్ 40 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ విజయంతో భారత్ మరోమ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సొంతంచేసుకుంది. ఇరుజట్లమధ్య నామమాత్రమైన మూడో వన్డే ఇండోర్ వేదికగా మంగళవారం జరుగుతుంది. టాస్‌గెలిచిన రోహిత్‌శర్మ బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్‌నుంచి సహకారం రావడంతో భారత పేసర్లు చెలరేగిపోయారు. 15 పరుగులకే ఐదు వికెట్లు తీసి కివీస్‌ను బెంబేలెత్తించారు. కానీ గ్లెన్‌ఫిలిప్స్ 36, శాంట్నర్ 27, బ్రాస్‌వెల్ 22 పర్వాలేదనిపించడంతో న్యూజిలాండ్ 34.3 ఓవర్లపాటు ఆడి 108 పరుగులైనా చేసింది. భారత బౌలర్లలో మహ్మద్‌షమీ ఆరుఓవర్లలో 18 పరుగులిచ్చి మూడు వికెట్లు తీయగా హార్థిక్‌పాండ్య ఆరు ఓవర్లలో 16 పరుగులుమాత్రమే ఇచ్చి రెండు వికెట్లు తీసాడు. పాండ్యా మూడు మెయిడిన్‌ఓవర్లు వేయడం గమనార్హం. వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు తీయగా కుల్దీప్‌సిరాజ్ శార్దూల్ తలోవికెట్‌తీసి కివీస్‌ను 34.3 ఓవర్లలోనే ఆలౌట్‌చేసారు.స్వల్పలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్, శుబ్‌మన్‌గిల్‌లుశుభారంభం ఇచ్చారు. స్వేచ్ఛగా షాట్లు ఆడిన రోహిత్‌శర్మ ఏడుఫోర్లు, మూడు సిక్సలు బాదాడు. స్వీప్, రివర్స్‌స్వీప్‌షాట్లతో హిట్‌మాన్ ఆకట్టుకున్నాడు. రోహిత్ దూకుడుచూస్తేఓపెనర్లే మ్యాచ్‌ఫినిషర్లు అనిపించింది. అర్ధసెంచరీపూర్తిచేసాకా షిప్లే బౌలింగ్‌లోరోహిత్ ఎల్బీగా ఔట్ అయ్యాడు. దీనితో 72 పరుగులవద్ద భారత్ తొలివికెట్ నష్టపోయింది. శాంట్నర్ బౌలింగ్‌లో విరాట్‌కోహ్లీని లాథమ్ స్టంపౌట్‌చేయడంతో భారత్ విజయానికి 11పరుగుల దూరంలో రెండో వికెట్‌నష్టపోయింది. ఇషాన్‌కిషన్ ఎనిమదిపరుగులుచేసి నాటౌట్‌తో గిల్‌కు సహకరించాడు. వీరే చివరకు మ్యాచ్‌ను విజయంతో ముగించారు. కివీస్ బౌలర్లలో షిప్లే,శాంట్నర్ తలోవికెట్‌తీసారు. లెఫ్టార్మ్‌స్పిన్నర్ అయిన శాంట్నర్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లోకోహ్లీని ఔట్‌చేసి ఆశ్చర్యపరిచాడు.

## ఉమన్ ఐపిఎల్‌ఫ్రాంచైజీలకోసం రేసులో పది సంస్థలు



**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో ఐపిఎల్‌తర్వాత ఇపుడు రెండోస్థానంలో మహిళల ఐపిఎల్‌కు ప్రాచుర్యం పెరిగింది. మహిళా ఐపిఎల్ లీగ్‌లోనిర్వహించిన ఫ్రాంచైజీల బిడ్డింగ్‌లో 30కిపైగా కంపెనీలు ఆసక్తిచూపించాయి. ఈనెల 25న ఫ్రాంచైజీ విజేతలను కూడా బిసిసిఐ ప్రకటిస్తుంది. 30కిపైగా సంస్థలు టెండర్ దరఖాస్తులుకొనుగోలుచేసాయి. ఐపిఎల్ తొలిసీజన్‌లో ఐదు జట్లు పోటీపడతాయి. పది ఐపిఎల్‌ఫ్రాంచైజీలతోపాటు ఇతరసంస్థలు కూడా జట్లను దక్కించుకునే యత్నాల్లో ఉన్నాయి. ఇంగ్లీష్ ఫుట్‌బాల్ లీగ్‌కు చెందిన మాంచెస్టర్ యునైటెడ్‌కంపెనీ ఓనర్లతోపాటు భారత స్నాక్‌బ్రాండ్ హాల్దీరామ్స్ కూడా పోటీలో ఉన్నాయి. దరఖాస్తులకు శనివారంతో గడువుముగిసింది. హాల్దీరామ్స్ ఇటీవలే టెండర్‌దాఖలుచేసింది. మహిళా ఐపిఎల్‌కోసం పది భారత నగరాలను వేదికలతో బిసిసిఐ టెండర్లను ఆహ్వానించింది. సంస్థలు సింగిల్‌గాను, ఒకటికంటే ఎక్కువ నగరాలకు బిడ్‌దాఖలుచేసేలా నిబంధనలు పెట్టింది. ఇందుకోసం ఎలాంటిప్రాతమిక ధరలేదు. ఈ బిడ్లు పదేళ్లకాలానికి అమలులో ఉంటాయి. ఐఎల్‌టి20 యజమానులు ఆదాని, కాప్రిగ్లోబల్ షార్జావారియర్స్ టెండరు వేసాయి. సిమెంట్‌కంపెనీలు చెట్టినాడ్, జెకెసిమెంట్స్ కొనుగోలుకు ఆసక్తితో ఉన్నాయి. చెన్నయికిచెందిన శ్రీరామ్‌గ్రూప్, నీలగిరి గ్రూప్, ఎడబ్ల్యు కట్యూరిగ్రూప్‌కూడా రేసులో ఉన్నాయి. ఢిల్లీ కేపిటల్స్ సంయుక్త యజమానులు తెలుగుసంస్థ జిఎంఆర్, జెఎస్‌డబ్ల్యుగ్రూప్ వేరువేరు టెండర్లు వేసాయి. ఎపిఎల్ అపోలో, హాల్దీరామ్‌లు కూడా ఇపుడురేసులోకి వచ్చాయి.

టెక్నికల్‌బిడ్లను ఈనెల 23వతేదీ తుదిగడువుగానిర్ణయించారు.ఐపిఎల్‌మీడియా హక్కులను వయాకామ్ 18ఇటీవలే 951కోట్లకు కొనుగోలుచేసింది. మహిళల ఐపిఎల్‌తేదీలు అధికారికంగాప్రకటించకపోయినా మార్చి 5నుంచి 23వ తేదీవరకూ జరుగుతాయని బిసిసిఐ వర్గాలద్వారా తెలుస్తోంది.

## చెత్తబ్యాటింగే మా కొంపముంచింది: టామ్ లాథమ్

**రాయ్‌పూర్:** చెత్తబ్యాటింగే భారత్‌తో జరిగిన రెండో వన్డేలో తమను ఓటమిపాలుచేసిందని కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్ అన్నాడు. టాపార్డర్ బ్యాటర్లు దారుణంగా విఫలం అయ్యారన్నాడు. అవసరమైన భాగస్వామ్యాలను అందించలేకపోయారని చెప్పిన లాథమ్ భారత బౌలర్లను ప్రవంసించాడు. సరైన ప్రదేశాల్లో బంతిని వేసి తమ పతనం శాసించారన్నాడు. టాపార్డర్ బ్యాటర్లు మంచి పనితీరు ఇవ్వలేదని, భారత్ బౌలర్ల తరహాలోనే ప్రయత్నించినా కలిసిరాలేదని అన్నాడు. మాజట్టుకు ఏమాత్రం కలిసిరాని రోజుల్లో ఇదొకటని ఈమ్యాచ్‌లోప్రతి అంశం భారత్‌కు వర్కౌట్ అయిందని అన్నాడు. ఈ పిచ్‌పై టెన్నిస్‌బాల్ బౌన్స్ ఉంది. కొన్ని బంతులు అనూహ్యంగా దూసుకొచ్చాయి. కొన్ని చాలా తక్కువగా స్లోగా వచ్చాయి. బంతి మూవ్‌మెంట్‌కూడా ఉందని, టాపార్డర్ బ్యాటర్లు సరైన భాగస్వామ్యం ఇవ్వలేకపోయారని లోయరార్డర్ అద్భుతంగా ఉన్నా మంచి లక్ష్యం సాధించలేకపోయామన్నారు. మేం పిచ్‌ను సరిగ్గా అర్థంచేసుకోలేకపోయామని టామ్‌లాథమ్ వెల్లడించాడు.

## ఆర్సీబీ ట్విట్టర్ హ్యాండిల్ హ్యాక్!

**బెంగళూరు:** ఐపిఎల్‌లో అభిమానులు ఎక్కువ ఉన్న జట్లలో రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు ఒకటి. సోషల్‌మీడియాలో ఈజట్టు చాలా చురుకుగా ఉంటుంది. ఈ జట్టు ట్విట్టర్‌ఖాతాను 64 లక్షలమందికిపైగా ఫాలో అవుతున్నారు. ఆ ఖాతాను ఆకస్మికంగా కొందరు స్కామర్లు హ్యాక్‌చేసారు. అకౌంట్ పేరును బోర్డ్ యాప్ యాచ్‌క్లబ్ అని మార్చేసారు. అక్కడితో ఆగకుండా తమలో సభ్యులు కావాలనుకుంటే ఓపెన్‌సీలో తమ కంపెనీకి చెందిన బోర్డ్ ఏప్ లేదా మ్యూటెంట్‌ఏప్‌ను కొనుగోలు చేయాలనిసూచించారు.ట్విట్టర్‌బయోనిండా తమకంపెనీకి చెందిన లింకులు పోస్టుచేసారు. అలాగే కొన్ని ట్వీట్లుకూడాచేసారు. ఆర్సీబీ ట్విట్టర్‌ఖాతా హ్యాక్ కావడం ఇదే తొలిసారికాదు 2021లోకూడా కొందరు హ్యాక్‌చేసారు. క్యాష్‌రిచ్‌లీగ్‌లోని టాప్‌జట్లలో ఒకటైన ఆర్సీబీ ట్విట్టర్ హ్యాండిల్ హ్యాక్‌కావడంపై ఫాన్స్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమ ఖాతాను కాంప్రమైజ్‌చేసారని, తిరిగి స్వాధీనంచేసుకున్నామని ఆర్సీబీ మేనేజ్‌మెంట్ అప్పట్లో ప్రకటించింది. ఈసారి మాత్రం ఆర్సీబి ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. దీనితో అకౌంట్ ఇంకా ఆర్సీబీ పరిధిలోకి రాలేదన్న ఆందోళన ఫ్యాన్స్‌లోపెరిగిపోయింది.

# రోహిత్‌ను వాటేసుకున్న బుడ్డోడు

## ఏమీచేయవద్దని సెక్యూరిటీని వారించిన రోహిత్




**రాయ్‌పూర్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేలసిరీస్‌లో రాయ్‌పూర్ వన్డేలో ఒక చిన్నోడు సెక్యూరిటీ కళ్లుగప్పి మైదానంలోకి వచ్చాడు. పరిగెత్తుకుంటూ వచ్చి రోహిత్‌శర్మను గట్టిగా వాటేసుకున్నాడు. కొద్దిగా ఉంటే హిట్ మ్యాన్ పడిపోయేవాడే. కానీ బ్యాలెన్స్‌చేసుకున్నాడు. వెంటనే పరిగెత్తుకుంటూ వచ్చిన సెక్యూరిటీ ఆపిల్లాణ్ణి పక్కకు లాగేసి అక్కడినుంచి తీసుకెళ్లేప్రయత్నంచేసాడు. ఆ బుడ్డోడిని ఏమైనా అంటారేమోనని భావించిన రోహిత్ ఆతడు చిన్నపిల్లాడని ఏమీ అనొద్దని సెక్యూరిటీ సిబ్బందికి చెప్పాడు. హిట్‌మ్యాన్‌మంచి మనసుకు ఇదేనిదర్శనం అని అభిమానులు ట్వీట్లు వెల్లువెత్తించారు.

భారత్ బ్యాటింగ్‌లో 10.4వ ఓవర్‌లో ఈఘటన జరిగింది. రోహిత్‌ను హగ్‌చేసుకున్న చిన్న వయసు అభిమాని ఇతడేనంటూ నెటిజన్లు సరదాగా స్పందించారు. సెక్యూరిటీ కళ్లుగప్పిమైదానంలోకి రావడం సర్వసాధారణంగాజరుగుతున్నాయి. తిరువనంతపురంలో శ్రీలంకతోజరిగిన చివరిమ్యాచ్‌లో ఒక అభిమాని మైదానంలోకి వచ్చి కోహ్లీకాళ్లమీదపడ్డాడు.

# వాణిజ్యం

# బులియన్ మార్కెట్ కళకళ

**ముంబై, జనవరి 21:** గత మూడు రోజులుగా తగ్గిన బంగారం ధరలు శనివారం ఒక్కసారిగా మళ్లీ జెట్ స్పీడ్‌లో దూసుకుపోయాయి. భారతదేశంలో 10 గ్రాములు 22 క్యారెట్ల బంగారంపై రూ.350మేర పెరిగింది. అదేవిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.380 మేర పెరిగింది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.52,350గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.57,110గా ఉంది. ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.52,500లుగా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.57,270గా నమోదైంది. ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.52,350గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.57,110 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల బంగారం ధర రూ.52,400లుగా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.57,160గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్లు రూ.53,250గా ఉండగా, 24 క్యారెట్ల ధర 58,090 రూపాయలుగా ఉంది. కోయంబత్తూరు, మధురైలో కూడా ఇవే ధరలు కొనసాగుతు న్నాయి. మొత్తంగా చూస్తే బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న పరిస్థితులు సామాన్యులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బంగారం కొనుగోలుదారులకు ఊహించని షాక్ ఇస్తున్నాయి. తాజా పరిణామాలను బట్టి బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగారం



60వేల రూపాయలకు చేరుకుంటుందని భావిస్తున్నారు. అంతర్జాతీయంగా ప్రతికూలపరిస్థితుల నేపథ్యంలో బంగారంధరలు పెరుగుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది.

# వెయిట్ చేయమన్న విప్రో..ఇప్పుడు వేటు వేసింది..




**ముంబై, జనవరి 21:** టెక్ కంపెనీలు తమ జీవితాలతో ఆటలాడుతున్నాయని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దేశంలో టాప్-5 కంపెనీల్లో ఒకటైన విప్రో కూడా ఈ కోవలో ఉండడం బాధాకరమని పేర్కొంటున్నారు. తాజాగా 800 మంది ఫ్రెషర్స్‌ను తొలగించడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద సంస్థలు కూడా పనికిరాని కారణాలు చెప్పి ఉద్యోగులను వదిలించుకోవడం సరికాదంటున్నారు. శిక్షణ కోసం ఫ్రెషర్స్‌పై ఖర్చు పెట్టిన రూ.75 వేలు సంస్థలకు తిరిగి చెల్లించాల్సి ఉండగా, దానిని మాఫీ చేసినట్లు టెర్మినేషన్ లెటర్‌లో విప్రో పేర్కొంది. పేలవమైన పనితీరే ఉద్యోగాల్లో కోతకు కారణమని వెల్లడించింది. తొలగింపులు వాస్తవమేనంటూ ఓ ప్రశ్నకు విప్రో సమాధానమిచ్చింది. కానీ ఎంతమందిని తొలగించాలనే విషయంపై స్పందించలేదు. విప్రో అత్యున్నత ప్రమాణాలు కలిగిన సంస్థ అని, వాటికి భంగం కలిగించే అంశమేదైనా తగిన చర్యలు తీసుకుంటామని కంపెనీ తెలిసింది. లక్ష్యాలను సాధించడం కోసం ప్రతి ఉద్యోగి నిర్దిష్ట నైపుణ్యాలు ప్రదర్శించాలని ఆశిస్తున్నట్లు పేర్కొంది. వ్యాపార ప్రక్రియ, క్లైంట్‌ల అవసరాలను పరిగణలోనికి తీసుకుని ఫ్రెషర్స్‌కి శిక్షణ ఇస్తామన్నారు. మొదటగా పూర్తిస్థాయిలో వారికి గైడెన్స్ అందించి పరీక్షిస్తామని లక్ష్యాలను చేరుకోలేకపోతే మరోసారి శిక్షణ ఇచ్చి చూస్తామన్నారు. అప్పటికీ అనుకున్న స్థాయికి చేరుకుంటే తొలగించకతప్పదని పేర్కొంది. అంతర్గత పరీక్ష పేరుతో ఉద్యోగులను వదిలించుకోవాలని విప్రో చూస్తోందని జాబ్ కోల్పోయిన వారు ఆరోపిస్తున్నారు. ఎప్పుడో ఆఫర్ లెటర్ ఇచ్చినా ఆన్‌బోర్డ్ చేయకుండా ఎందుకు ఇప్పటి వరకు వేధించారని ప్రశ్నిస్తున్నారు. తీరా నెలల వ్యవధిలోనే తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ‘ఆ ట్వీట్లను అనువదిస్తాం’: మస్క్

**వాషింగ్టన్, జనవరి 21:** ట్విట్టర్‌ను సొంతం చేసుకున్న దగ్గరి నుంచి ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్‌మస్క్ కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారు. శనివారం ఆయన కొత్త అప్‌డేట్ ఇచ్చారు. ‘రానున్న నెలల్లో ఇతర దేశాలు, సంస్కృతులకు చెందిన ప్రజలు చేసే అద్భుతమైన ట్వీట్లను ట్విట్టర్ అనువదిస్తుంది. అలాగే వాటిని సిఫార్సు చేస్తుంది. ఇతర దేశాల్లో ప్రతిరోజూ ఎన్నో అమోఘమైన ట్వీట్లు ఉంటాయి. మరీ ముఖ్యంగా జపాన్ నుంచి’ అంటూ ఆయన పోస్టు చేశారు. సిఫార్సు చేయడానికి ముందే వాటిని అనువదిస్తామని తెలిపారు. మస్క్ ట్విట్టర్‌ను కొనుగోలుచేసిన దగ్గరి నుంచి సంచలన నిర్ణయాలే తీసుకుంటున్నారు. అందులో బ్లూ టిక్ కూడా ఒకటి. రాజకీయ నాయకులు, ప్రముఖులు, జర్నలిస్టులు, ఇతర ముఖ్యమైన వ్యక్తుల ఖాతాలకు వెరిఫై బ్లూ టిక్ ఇచ్చేవారు. ఎలాన్‌మస్క్ ఎప్పుడైతే ట్విట్టర్‌ను సొంతం చేసుకున్నారో అప్పటి నుంచి అందులో మార్పులు చేపడుతూ వస్తున్నారు. తాజాగా బ్లూ సబ్‌స్క్రిప్షన్‌ఛార్జీలను ప్రకటించారు. ఇటీవల కూడా ఆయన కొన్ని అప్‌డేట్లు ఇచ్చారు. ముఖ్యంగా రికమెండెడ్‌వర్సెస్‌ఫాలోడ్ ట్వీట్లను అటూఇటూ తేలికగా కదల్చడం, యూజర్ ఇంటర్ఫేస్‌లో మార్పులు, ట్వీట్ వివరాల కోసం బుక్ మార్క్ బటన్, ట్వీట్లలో అక్షరాలసంఖ్య పెంచడంవంటి సౌలభ్యం గురించి తెలిపారు.

# డిజిటల్ ఇండియా బిల్లుతోనే ఆర్థిక అసమానతల తగ్గుదల: రాజీవ్ చంద్రశేఖర్

**న్యూఢిల్లీ, జనవరి 21:** డిజిటల్ ఇండియా బిల్లు ద్వారా కంటెంట్ క్రియేషన్, అడ్వర్టైజ్‌మెంట్ టెక్నాలజీ (యాడ్‌టెక్) కంపెనీల ఆదాయ అసమానతలను పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోందని ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (డిఎన్‌పిఎ) డిజిటల్ ఇంపాక్ట్ అవార్డ్స్ 2023లో మంత్రి మాట్లాడుతూ బిగ్‌టెక్ కంపెనీలు తమ ఆదాయంలో కొంత భాగాన్ని ప్రింట్ న్యూస్ పబ్లిషర్ల డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లతో పంచుకోవాలని కోరారు. అలాగే ప్రతిపాదిత కొత్త చట్టం దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు మార్గనిర్దేశం చేసేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న ద్విముఖ విధానంలో భాగమని మంత్రి తెలిపారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు గత యేడాది నుంచి పరిశీలనలో ఉంది. ఇది పౌరుడి వ్యక్తిగత డేటా రక్షణకు ఉపయోగపడుతుందని అన్నారు. దేశంలో కొన్ని వేల మంది కంటెంట్ క్రియేటర్‌లు ఉన్నారు. విలువలు, నిజాయితీతో నడిచే వార్త సంస్థలు ఉండడం మనలాంటి దేశానికి ఇది నిజంగా మంచి పరిణామం, కానీ ఆదాయం, అసమానత విషయంలో కొన్ని కంపెనీలకు నియంత్రణ అవసరం అని మంత్రి అన్నారు. కరోనా మహమ్మారి కారణంగా ప్రింట్ మీడియా మాత్రమే కాకుండా, డిజిటల్ వార్తల పరిశ్రమ ఆర్థికంగా దెబ్బతిన్నది. వీటిని ఆదుకోవడానికి బిగ్ టెక్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి రాబడిలోవారికి వాటా ఇవ్వడం చాలా ముఖ్య మని అన్నారు.



# కాలర్ ఐడి తప్పనిసరి చేస్తున్న ప్రభుత్వం!

**ముంబై, జనవరి 21:** సాధారణంగా కాల్ వస్తున్నప్పుడు ఎవరు చేస్తున్నారో తెలియదు. కొత్త నంబర్ నుంచి వస్తే ఫోన్ ఎత్తాలంటే కొంత ఆలోచిస్తాం. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మొబైల్‌కు కాల్ వస్తున్నప్పుడు కాలర్ పేరు ప్రదర్శించడాన్ని తప్పనిసరి చేయాలని చూస్తోంది. కానీ ఈ ప్రతిపాదనను టెలికం కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) వెల్లడించింది. వినియోగదారుల భద్రత, గోప్యత, సమ్మతి, సాంకేతిక పరిమితులను పరిగణలోనికి తీసుకుంటే, కాలర్ పేరు తెలియచేసే విధానం అమలు సాధ్యం కాదని పలు టెల్కోలు తెలిపాయి. వినియోగదారుల రక్షణ సంస్థలు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ అసోసియేషన్, వీనో కమ్యూనికేషన్‌లు ట్రాయ్ నిర్ణయానికి మద్దతు తెలిపాయి. మొదట పైలెట్ ప్రాజెక్టుగా అమలుచేసి పరీక్షించాలని యుఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సిఫార్సు చేసింది. సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ఇండియా (సిఒఎఐ) మాత్రం కాలర్ ఐడి అమలు తప్పనిసరి చేయకుండా సర్వీస్ ప్రొవైడర్లకు స్వేచ్ఛ ఇవ్వాలని అభిప్రాయపడింది. కాలర్ ఐడీ తప్పనిసరి చేయడానికి అంగీకరించిన భారతీ ఎయిర్‌టెల్ సాధారణ వినియోగదారులకు ఈ సేవను అందుబాటులో ఉంచాలనుకోవడంతో విభేదించింది. ప్రజల వ్యక్తిగత సమ్మతి అవసరం కాబట్టిసిఎన్‌ఎపి అనేది ఓఎంపిక సేవగా ఉండాలని ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ అభిప్రాయపడింది. కాలర్ సమాచారం భద్రతగురించి పునరాలోచించాలని సూచించింది. డేటా రక్షణ చట్టంఅమలు తర్వాతే ఈ వ్యవస్థను అమలు చేయాలని ప్రతిపాదించింది.

# గూగుల్‌కు గట్టి పోటీనిస్తున్న చాట్ జిపిటి




**న్యూఢిల్లీ, జనవరి 21:** చాట్ జిపిటి. కృత్రిమ మేథ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/ఏఐ) సాంకేతికత ఆధారంగా పనిచేసే చాట్ బాట్. ఇప్పుడు ఇది ఎంతో పాపులర్ అవుతుండడం, ప్రపంచ టెక్నాలజీ, సెర్చింజన్ దిగ్గజం గూగుల్‌కు నిద్ర లేకుండా చేస్తోంది. చాట్ జిపిటితో పోటీ పడేందుకు గూగుల్ తన శక్తియుక్తులను కూడదీసుకుంటోంది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో చాట్ జిపిటి, ఏఐ పెద్ద చర్చనీయాంశంగా మారాయి. టెక్నాలజీ నిపుణులే కాకుండా, గౌతమ్ అదానీ వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలు కూడా చాట్ జిపిటిని నోరారా ప్రశంసిస్తున్నారు. దీనిని వాడడం మొదలుపెట్టిన తర్వాత తనకూ కొంత వ్యసనంగా మారినట్లు గౌతమ్ అదానీ స్వయంగా లింక్డిన్‌లో ప్రకటించారు. ఏఐని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చాట్ జిపిటి సాయపడుతుందన్నారు ఎలాంటి సమాచారం అయినా యూజర్‌కు కావాల్సినట్లుగా చాట్ జిపిటి అందిస్తుందని, మనుషులతో సంభాషిస్తుందని ఆయన రాసుకొచ్చారు. చాట్ జిపిటి అన్నది బ్రౌజర్‌పై పనిచేసే టూల్. మనకు కావాల్సింది వాయిస్ ద్వారా చెబితే చాలా మొత్తం ఇంటర్నెట్‌ను శోధించి కావాల్సింది మన ముందుంచుతుంది. ఓపెన్ ఏఐ అనే సంస్థ దీన్ని అభివృద్ధి చేయగా, ఇందులో టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు కూడా వాటాలున్నాయి. మైక్రోసాఫ్ట్ కూడా పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తోంది. చాట్ జిపిటి మరింత పాపులర్ అవుతుండడంతో గూగుల్‌లో వణుకు మొదలైంది. దీంతో గూగుల్ కూడా తన సొంత ఏఐ సెర్చింజిన్ వెర్షన్ అభివృద్ధిపై అన్ని శక్తులను కేంద్రీకరించింది. చాట్ జిపిటి మాదిరి ఏఐ ఆధారిత సెర్చింగ్ టూల్‌తోపాటు, 21 నూతన ఉత్పత్తులను త్వరలో ప్రకటించనుంది.

# బీమా రంగానికి ప్రాధాన్యం పెంచాలి!

**ముంబై, జనవరి 21:** బీమా అనేది ఆవశ్యకమైన అంశంగా నిలుస్తోంది. ఎందుకంటే అవసరకాలంలో ఆదుకొని, ఆర్థిక వెసులుబాటుని కల్పించడమే కాకుండా, పన్ను ప్రయోజనాలు అందిస్తూ, మరింత మంది ప్రజలు వారి కుటుంబాలకు రక్షణ కల్పించేందుకు ప్రోత్సాహకంగా ఉంటోంది. పన్నుల విధానంలో మరింత ప్రయోజనాలు అందించాలని మేం కోరుకుంటున్నాం, అలాగైతే, ప్రజలు స్వయంగా వారికి, వారి కుటుంబానికి బీమా కల్పించడానికి ఇది అదనపు ప్రేరేపణగా నిలుస్తుంది. ప్రభుత్వం గనుక పెట్టుబడులను ప్రోత్సహించడాన్ని వ్యాపారాలు నిర్వహించాలని, పెట్టుబడులు రాబట్టడాన్ని సులభతరం చేయడాన్ని కొనసాగించినట్లయితే, మొత్తంగా బడ్జెట్ అనుకూలంగా ఉంటుందని ఐసిఐసిఐలాంబర్డ్ సిఇఒ భార్గవ్‌దాస్ గుప్తా తెలిపారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.